www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 256
శనివారం | 14-12-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి సా. 4.59 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: రోహిణి తె. 3.54 తదుపరి మృగశిర; వర్జ్యం: రా.8.32-10.00, దుర్ముహూర్తం: ఉ.6.40-8.08, అమృతఘడియలు: రా.12.57-2.25, రాహుకాలం: ఉ.9.00-10.30, సూర్యోదయం: 6.40, సూర్యాస్తమయం: 5.39
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫార్ములా-ఈ రేస్.. కేటీఆర్‌పై కేసు!

రేపోమాపో ఏసీబీ నోటీసులు

దర్యాప్తునకు గవర్నర్ అనుమతి

చట్టపరంగా విచారించేందుకు మార్గం సుగమం

ఇప్పటికే అర్వింద్‌కుమార్‌ను ప్రశ్నించిన ఏసీబీ

విదేశీ కంపెనీకి రూ.55 కోట్లు ఇవ్వడంపై విచారణ



హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడానికి ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారంలో రూ.55 కోట్లు విదేశీ కంపెనీకి చెల్లించడంపై ప్రభుత్వం ఇప్పటికే ఏసీబీ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు గవర్నర్ అనుమతి తప్పనిసరి కావడంతో ఏసీబీ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ లేఖను ప్రభుత్వం గత నెలలో గవర్నర్‌కు పంపింది. అది గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. పలువురు మంత్రులు.. గవర్నర్ ఇంకా అనుమతి ఇవ్వడం లేదంటూ పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. దీంతో న్యాయనిపుణుల అభిప్రాయాలు

మిగతా 11వ పేజీలో...

జర్నలిస్టుపై దాడి కేసు.. మోహన్‌బాబు ముందస్తు బెయిల్‌కు హైకోర్టు నో



యూటీ నంబర్

7697

జైల్లో పుష్ప

బెయిల్ వచ్చినా అల్లు అర్జున్ విడుదల వాయిదా!

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అరెస్టు

గంటసేపు విచారించిన పోలీసులు

గాంధీలో వైద్యపరీక్షలు.. నాంపల్లి కోర్టులో హాజరు

14 రోజుల రిమాండ్ విధించిన న్యాయస్థానం

చంచల్‌గూడ జైలుకు.. హైకోర్టుకెళ్లిన నటుడు

నాలుగు వారాలపాటు మధ్యంతర బెయిల్

సకాలంలో జైలుకు చేరని బెయిల్ ఉత్తర్వులు

రాత్రి 10.30 గంటల తర్వాత పత్రాల అప్‌లోడ్

నేడు ఉదయం విడుదల చేస్తామన్న అధికారులు

అల్లు అర్జున్ అరెస్టుతో దేశవ్యాప్తంగా సంచలనం

హైదరాబాద్ సిటీ/చిక్కడపల్లి/రాంనగర్/అడ్డగుట్ట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సినిమాలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు చిక్కకుండా సవాలు విసిరే పుష్పరాజ్.. నిజ జీవితంలో మాత్రం జైలుకు వెళ్లాల్సి వచ్చింది. వెండితెరపై 'తగ్గేదేలే' అంటూ మేనరిజం ప్రదర్శించిన నటుడు చట్టం ముందు తగ్గాల్సివచ్చింది. తన సినిమా ప్రీమియర్ షో చూసేందుకు థియేటర్‌కు స్వయంగా వెళ్లి.. తొక్కిసలాటలో ఓ మహిళ మృతికి కారణమయ్యారన్న ఆరోపణలపై నమోదైన కేసులో సినీ నటుడు అల్లు అర్జున్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అనంతరం ఆయనను కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే ఆ వెంటనే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసినా.. ఆ పత్రాలు సకాలంలో జైలుకు చేరకపోవడంతో అల్లు అర్జున్ విడుదల వాయిదా పడింది. కోర్టు ఉత్వర్వులు అప్‌లోడ్ చేసేసరికి రాత్రి 10.30 గంటలు దాటిపోవడంతో ఆయనను శనివారం ఉదయం విడుదల చేస్తామని జైలు అధికారులు

మిగతా 13వ పేజీలో...

మహిళ మృతికి కారణం

అల్లు అర్జునే!

ఆయన సెక్యూరిటీ, థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తొక్కిసలాట

పోలీసుల రిమాండ్ రిపోర్టు

14

అల్లు అర్జున్ తప్పు లేదు..

కేసు వెనక్కి తీసుకుంటా

సంధ్య థియేటర్ ఘటనలో మృతురాలి భర్త

వెంటిలేటర్‌పైనే కుమారుడు

13



అభద్రతాభావానికి పరాకాష్ట

13

అల్లు అర్జున్ అరెస్టుపై మాజీ మంత్రి కేటీఆర్

హైడ్రా భయంతో మృతి చెందిన వారి విషయంలో సీఎం రేవంత్‌ను అరెస్టు చేయాలని వ్యాఖ్య

రేవతి మరణానికి పాలకులే కారణం

రేవంత్ సోదరుల అంశంలోనూ చట్టం ఇలాగే స్పందించాలి: హరీశ్‌రావు

ప్రభుత్వ తప్పును కప్పిపుచ్చుకునేందుకే: అశ్వినీ వైష్ణవ్

అల్లు అర్జున్ అరెస్టు బాధ్యతారాహిత్యం: కిషన్‌రెడ్డి

ఇది కాంగ్రెస్ పార్టీ డ్రామా: బండి సంజయ్

అల్లు అర్జున్‌కు అండగా చిరంజీవి!

అరెస్టు సంగతి తెలియగానే షూటింగ్ రద్దు

సతీసమేతంగా అర్జున్ ఇంటికి రాక

పలువురు సినీ ప్రముఖుల సంఘీభావం

14

జైల్లో భోజనం చేయని అల్లు అర్జున్

కొత్త రగ్గు, దుప్పటి.. రాత్రంతా నేలమీదే

మహిళ చనిపోతే కేసు పెట్టరా?

ఒక వ్యక్తిని అరెస్టు చేస్తే ఇంతలా ప్రశ్నిస్తున్నారు?

తల్లి చనిపోయింది.. చావుబతుకుల మధ్య పిల్లాడు

ఆ కుటుంబం పరిస్థితి ఏంటని ఆలోచించారా?

ప్రభుత్వం, పోలీసులు ఏం చేయాలో చెప్పండి?

అల్లు అర్జున్ కారుపైకి ఎక్కి చేతులు ఊపారు

ఆ తర్వాతే థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది

హంగామా చేయకుంటే ఈ గొడవే ఉండేదికాదు

ఆయన మామ చిరంజీవి, పిల్లనిచ్చిన మామ కాంగ్రెసోళ్లే.. అర్జున్ భార్య వాళ్లు మా బంధువులే

ఇండియా టుడే చర్చా వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి

మంత్రివర్గ విస్తరణపై చర్చించలేదని వెల్లడి

వెనకబడిన జిల్లాల గ్రాంట్ 1800 కోట్లు ఇవ్వండి

తెలంగాణకు ఆర్థిక చేయూతనివ్వండి

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని త్వరగా పూర్తి చేయండి

కేంద్ర మంత్రులు నిర్మల, వైష్ణవ్‌కు సీఎం వినతి



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): "అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసినందుకు ఇంతలా ప్రశ్నిస్తున్నారు కదా? మరి ఒక మహిళ ప్రాణం పోయింది. దానిపై ఒక్క ప్రశ్న కూడా అడగడం లేదు. ఆ మహిళ కుటుంబం పరిస్థితి ఏమిటి? మృత్యువుతో పోరాడుతున్న 9 ఏళ్ల పిల్లాడి పరిస్థితి ఏంటి? ఆస్పత్రి నుంచి బయటికొచ్చాక తల్లి లేకుండా ఎలా బతుకుతాడు? ఇలాంటివాటి గురించి మీరు ఆలోచించడం లేదు కదా?" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హీరోకి సినిమా ఒక వ్యాపారమని, డబ్బులు పెట్టి.. డబ్బులు సంపాదించుకుంటారని

మిగతా 11వ పేజీలో...

'ఓటుకు నోటు'..

ఈడీ కేసు కొట్టేయడానికి

నిరాకరణ

వేం నరేందర్‌రెడ్డి కుమారుడికి ఎదురుదెబ్బ

కృష్ణకీర్తన్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

14



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఎయిర్‌పోర్ట్ మెట్రో తీరే వేరయా!

- హైదరాబాద్ నలుమూలల నుంచి వెళ్లేలా స్వతంత్ర కారిడార్‌గా నిర్మాణం.. 1.5 కిలోమీటరు అండర్‌గ్రౌండ్‌లో
- విభిన్నంగా మెట్రో కోచ్‌లు.. లగేజీ కోసం ప్రత్యేక డిజైన్
- ఎయిర్‌పోర్ట్ స్థాయిలో స్టేషన్లు.. రద్దీ ఆధారంగా నిర్మాణం
- ఎస్కలేటర్లు, ర్యాక్‌లు, స్కై వాక్ సదుపాయాలు
- పార్కింగ్‌కు ప్రత్యేక ప్రణాళిక.. టికెట్ చార్జీలు పెరగవు
- స్వదేశీ రైల్వే ఉత్పత్తులతో వ్యయంలో భారీగా తగ్గుదల
- మార్చి నాటికి అనుమతులు.. 2028లోగా పూర్తి
- 'హైదరాబాద్ మెట్రో' ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

10

జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన నోటీసు

- అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిని తొలగించాలి
- 55 మంది పార్లమెంటు సభ్యుల సంతకాలు
- రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు అందజేత
- మైనార్టీలపై విద్వేష ప్రసంగం చేశారని ఆరోపణ
- రాజ్యాంగ విలువలను ఉల్లంఘించినట్టు ఫిర్యాదు
- వీహెచ్‌పీ సభలో చేసిన ఉపన్యాసంపై అభ్యంతరం

న్యూఢిల్లీ, డిసెంబరు 13: విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌ను పదవి నుంచి తొలగించేందుకు అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని విపక్షాలు నిర్ణయించాయి. ఈ మేరకు 55 మంది ఎంపీలు సంతకాలు చేసిన నోటీసును శుక్రవారం రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి.మోదీకి సమర్పించాయి. ఈ నోటీసుపై సంతకాలు చేసిన వారిలో కాంగ్రెస్ ఎంపీలు వివేక్ టంఖా, దిగ్విజయ్ సింగ్, కె.టి.ఎస్ తుల్సి, డీఎంకే సభ్యుడు పి.విల్సన్, సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ తదితరులు ఉన్నారు. జస్టిస్ శేఖర్ యాదవ్ "రాజ్యాంగాన్ని ఉల్లంఘించి, మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా విద్వేషపూరిత ప్రసంగం చేశారని" ఆ నోటీసులో ఆరోపించారు. విశ్వహిందూ పరిషత్ లీగల్ సెల్ ఈ నెల 8వ తేదీన అలహాబాద్ హైకోర్టు ఆవరణలో ఉమ్మడి పౌర స్మృతిపై నిర్వహించిన సదస్సులో జస్టిస్ యాదవ్ చేసిన ప్రసంగం వివాదాస్పదంగా మారింది. ముస్లింల ప్రస్తావన

మిగతా 2వ పేజీలో...

జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన నోటీసు




(మొదటి పేజీ తరువాయి)

తీసుకువస్తూ "కఠ్‌ముల్లా (మైనార్టీలు) దేశానికి ప్రమాదకరంగా మారారు. మీలో అంతర్గతంగా ఉన్న ఆకాంక్షలను చంపుకోకపోతే దేశం బంగ్లాదేశ్‌గానో, తాలిబన్‌గానో మారడానికి ఎంతో కాలం పట్టదు. ఈ విషయాన్ని దేశ ప్రజలకు చెప్పాలి. వారి మతాన్ని గుర్తించేలా చేయాలి" అని పేర్కొన్నారు. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని పక్షపాతపూరిత, విద్వేషపూరిత ప్రసంగం చేశారని ఎంపీలు ఆ నోటీసులో పేర్కొన్నారు. దీనివల్ల తటస్థ తీర్పరి, హక్కుల సంరక్షణకర్త అంటూ న్యాయవ్యవస్థకు ఉన్న మంచి పేరుకు విఘాతం కలిగిందని తెలిపారు. ఇది వివిధ మతాల మధ్య విద్వేషం, విభజనకు దారి తీసిందని, రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక విలువలకు నష్టం చేకూర్చిందని వివరించారు. న్యాయ వ్యవస్థలో పాటించాల్సిన నైతిక విలువలపై సుప్రీంకోర్టు 1997 మే 7న 'న్యాయ జీవితంలో విలువల పునరుద్ఘాటన' పేరుతో ప్రవర్తన నియమావళి జారీ చేసిందని, అది న్యాయ వ్యవస్థ నిజాయితీ, స్వతంత్రతలకు మార్గదర్శిగా ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం జస్టిస్ యాదవ్ చేసిన ప్రసంగం అందుకు విరుద్ధంగా ఉందని తెలిపారు. ఈ కారణాల దృష్ట్యా జడ్జీల విచారణ చట్టం-1968 ప్రకారం తమ అభిశంసన నోటీసును రాష్ట్రపతికి పంపించి సభలో ప్రవేశపెట్టేలా ఆమోదం తీసుకోవాలని కోరారు.

తొలగించే ప్రక్రియ ఇదీ...

పదవిలో కొనసాగేందుకు న్యాయమూర్తి అసమర్థుడని భావిస్తే తొలగించేందుకు రాజ్యాంగంలోని 124(4) అధికరణం, జడ్జీల విచారణ చట్టం-1968లో విధానాన్ని పొందుపరిచారు. తొలగించేందుకు రాజ్యసభలోగానీ, లోక్‌సభలోగానీ తీర్మానాన్ని ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఈ తీర్మానంపై లోక్‌సభలో అయితే 100 మంది, రాజ్యసభలో అయితే 50 మంది సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ సభలో తీర్మానం ప్రవేశపెట్టడానికి సభాపతి అనుమతి ఇస్తే..అనంతరం జడ్జీల విచారణ చట్టం ప్రకారం దర్యాప్తునకు కమిటీ ఏర్పాటవుతుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ ఏర్పాటవుతుంది. ఆ కమిటీ విచారణ జరిపి సభాపతికి నివేదిక సమర్పిస్తుంది. ఆరోపణలు నిజమని తేలితే పార్లమెంటు ఉభయ సభల్లో దీనిపై చర్చ జరుగుతుంది. సంబంధిత జడ్జి కూడా పార్లమెంటుకు వచ్చి తన వాదన వినిపించుకోవచ్చు. తరువాత తీర్మానంపై ఓటింగ్ జరుగుతుంది. ఉభయ సభల్లోనూ అది ఆమోదం పొందాల్సి ఉంటుంది. సభకు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మెజార్టీగానీ, మొత్తం సభ్యుల సంఖ్యలో మెజార్టీగానీ లభిస్తేనే తీర్మానం ఆమోదం పొందినట్టవుతుంది. అనంతరం జడ్జిని తొలగించాలని సిఫార్సు చేస్తూ రాష్ట్రపతికి నివేదిక పంపిస్తారు.

లోకం తీరు



మహాకుంభమేళాలో
తెలుగులో ఏఐ చాట్‌బాట్ సేవలు

ప్రయాగ్‌రాజ్‌లో అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన మోదీ

ప్రయాగ్‌రాజ్, డిసెంబరు13: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరిగే మహాకుంభమేళాతో దేశం సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా సరికొత్త శిఖరాలకు చేరుకుంటుందని ప్రధాని మోదీ చెప్పారు. కులాలు, తెగల ఊసే లేకుండా ఐక్యతను చాటే మహాకుంభమేళా మహాయజ్ఞాన్ని తలపించనుందన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రధాని రూ.5,500 కోట్ల విలువైన 167 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రధాని ప్రసంగించారు. మహాకుంభమేళాలో తొలిసారి భక్తులు, యాత్రికుల కోసం బహుభాషా ఏఐ చాట్‌బాట్ సేవలను ఉపయోగించుకోబోతున్నామని మోదీ చెప్పారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌తో పాటు అనేక భాషల్లో దీన్ని అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా మహాకుంభమేళా విశేషాలతో పాటు చరిత్ర, పూజలు, ప్రయాణ, విడిది సౌకర్యాల వివరాలు యాత్రికులకు ఉచితంగా అందిస్తారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రధాని గంగ, యమున, సరస్వతి నదుల సంగమ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇస్తాంబుల్ విమానాశ్రయంలో 2రోజులుగా
ఇండిగో ప్రయాణికుల ఇక్కట్లు

- భోజనం, సరైన వసతి లేక 400 మంది అగచాట్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 13: తుర్కియేలోని ఇస్తాంబుల్ విమానాశ్రయంలో 400 మంది ఇండిగో ప్రయాణికులు చిక్కుకుపోయారు. వీరంతా ఢిల్లీ, ముంబైలకు రెండు విమానాల్లో రావాల్సి ఉంది. ఏ సమాచారం ఇవ్వకుండా ఆ విమానాలు రద్దు చేయడంతో దాదాపు రెండు రోజుల పాటు అక్కడే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తలెత్తింది. బుధవారం రాత్రి ఇస్తాంబుల్ నుంచి వారు ముంబై, ఢిల్లీకి విమానాల్లో బయలుదేరాల్సి ఉండగా.. శుక్రవారం ఉదయం వరకు కూడా విమానాలు ఏ సమయానికి బయలుదేరేది స్పష్టత ఇవ్వలేదు. దీంతో ప్రయాణికులు విమానాశ్రయంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారికి భోజనం, ఎలాంటి వసతి కల్పించకపోవడంతో సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు క్షమాపణలు చెప్పడంతో పాటు పరిహారం ప్రకటించాలంటూ డిమాండ్ చేశారు. చివరకు ఇండిగో దీనిపై స్పందిస్తూ.. ప్రయాణికులకు క్షమాపణలు తెలిపింది.

రిజర్వ్ బ్యాంకుకు బాంబు బెదిరింపు

ముంబై, డిసెంబరు 13: ముంబైలోని రిజర్వు బ్యాంకు భవనానికి ఈ-మెయిల్ ద్వారా శుక్రవారం బాంబు బెదిరింపు వచ్చిందని ముంబై పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. రిజర్వు బ్యాంకు అధికారిక వెబ్‌సైట్‌కి రష్యన్ భాషలో అందిన ఆ ఈ-మెయిల్‌లో బ్యాంకును పేల్చివేస్తామని బెదిరించారు. మరోవైపు, ఢిల్లీలోని 30 బడులకు శుక్రవారం తెల్లవారు జామున బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో ఆయా పాఠశాలల్లో భద్రతా సంస్థలు తనిఖీలు జరిపాయి. ఈ తనిఖీల్లో ఎటువంటి అనుమానాస్పద వస్తువులు దొరకలేదు.

టీఎం కృష్ణకు ఎంఎస్ సుబ్బులక్ష్మి అవార్డు వ్యవహారంలో సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దు

చెన్నై, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణకు సుప్రసిద్ధ విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి పేరుతో ఉన్న 'సంగీత కళానిధి అవార్డు'ను ప్రదానం చేయకూడదంటూ మద్రాస్ హైకోర్టు సింగిల్ జడ్జి వెలువరించిన ఉత్తర్వులను ద్విసభ్య ధర్మాసనం రద్దు చేసింది. చెన్నైలో మ్యూజిక్ అకాడమీ నిర్వాహకులు ప్రతియేటా ప్రముఖ కర్ణాటక సంగీత కళాకారులకు సంగీత కళానిధి ఎంఎస్ సుబ్బులక్ష్మి అవార్డును ప్రదానం చేయడం ఆనవాయితీ. ఆ మేరకు ఈ ఏడాది ఆ అవార్డుకు టీఎం కృష్ణను ఎంపిక చేశారు. అయితే, టీఎం కృష్ణ పలుమార్లు ఎంఎస్ సుబ్బులక్ష్మి కీర్తి ప్రతిష్ఠలను కించపరిచేలా విమర్శలు చేశారని, కనుక ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేయరాదని ఎంఎస్ సుబ్బులక్ష్మి మనుమడు శ్రీనివాసన్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి పేరుతో ఉన్న ఆ అవార్డును టీఎం కృష్ణకు ప్రదానం చేయకూడదని, కావాలంటే అవార్డు పేరులో ఉన్న సుబ్బులక్ష్మి పేరు తొలగించి ప్రదానం చేసుకోవచ్చని జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు కాగా.. హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసింది.

వరకట్నం, గృహ హింస చట్టాలను సమీక్షించండి

- టెకీ ఆత్మహత్య నేపథ్యంలో సుప్రీంకోర్టులో వ్యాజ్యం

న్యూఢిల్లీ, డిసెంబరు 13: వరకట్నం, గృహ హింస చట్టాలను సమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలయింది. భార్య వేధింపుల కారణంగా బెంగళూరుకు చెందిన అతుల్ సుభాష్ అనే టెకీ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో విశాల్ తివారీ అనే న్యాయవాది ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ చట్టాలను సమీక్షించి, సంస్కరించాలని కోరారు. ఇందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయకోవిదులతో నిపుణుల కమిటీ వేయాలని సూచించారు. అత్తింటివారు గృహ హింసకు పాల్పడుతున్నారంటూ కొందరు మహిళలు తప్పుడు ఆరోపణలు చేసి ఐపీసీలోని సెక్షన్ 498ఏను దుర్వినియోగం చేస్తున్నారని 2010లో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకోవాలని, అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

రాజ్యాంగం అంటే సంఘ్ రూల్ బుక్ కాదు!

ఇది ప్రధాని మోదీకి ఇంకా అర్థం కానట్లుంది.. స్వేచ్ఛ, న్యాయానికి రాజ్యాంగమే రక్షా కవచం

- దాన్ని బద్దలు కొట్టడానికి బీజేపీ చేయని ప్రయత్నం లేదు
- రాజ్యాంగంపై చర్చలో ప్రియాంక
- రాజ్యాంగాన్ని హైజాక్ చేయడానికి కాంగ్రెస్ యత్నం: రాజ్‌నాథ్‌సింగ్





న్యూఢిల్లీ, డిసెంబరు 13: భారత రాజ్యాంగం అంటే 'సంఘ్' రూపొందించిన నియమాలు, విధానాల పుస్తకం కాదన్న విషయం ప్రధాని మోదీకి ఇంకా అర్థం కానట్లు ఉందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఏకపక్షంగా అధికారంలోకి వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చే ప్రక్రియను ప్రారంభించేదన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని లోక్‌సభలో రెండు రోజుల ప్రత్యేక చర్చ శుక్రవారం మొదలైంది. ఈ చర్చను కేంద్ర ప్రభుత్వం తరఫున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. విపక్షాల తరఫున తొలుత ప్రియాంక గాంధీ ప్రసంగించారు. లోక్‌సభలో ప్రియాంక మొట్టమొదటి ప్రసంగం ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా ఆమె బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. న్యాయానికి, ఐక్యతకు, భావ ప్రకటనా స్వేచ్ఛకు రాజ్యాంగమే రక్షా కవచమని పేర్కొన్నారు. ఈ రక్షా కవచాన్ని బద్దలు కొట్టడానికి పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం చేయని ప్రయత్నమంటూ లేదన్నారు. బ్రిటిష్ వాళ్ల దేశ ప్రజలను ఎలా భయపెట్టాలని చూశారో.. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వ అలాగే చేస్తోందని చెప్పారు. ఇలాంటి పిరికివాళ్ల చేతుల్లో దేశం ఎంతో కాలం ఉండదని, ప్రజలు న్యాయం కోసం తిరగబడతారని హెచ్చరించారు. ఒక్కరికి మేలు చేయడం కోసం కేంద్రంలోని బీజేపీ సర్కారు 142కోట్ల మంది భారతీయులను విస్మరిస్తోందని ప్రియాంక అదానీని ఉద్దేశించి అన్నారు. ప్రియాంక మొత్తం 32 నిమిషాల పాటు ప్రసంగించారు. బీజేపీ పదే పదే నెహ్రూను విమర్శించడంపైనా ప్రియాంక స్పందించారు. "ఎప్పుడూ గతం గురించి మాట్లాడుతూ, నెహ్రూను విమర్శించే వీరంతా ఇప్పుడేం చేస్తున్నారో చెప్పగలరా.. లేకపోతే ఇప్పుడు కూడా దేశాభివృద్ధి బాధ్యతను ఈ పాలకులు నెహ్రూకే వదిలేశారా" అని ఎద్దేవా చేశారు. ప్రియాంక ప్రసంగంపై ఆమె సోదరుడు రాహుల్ గాంధీ ప్రశంసల వర్షం కురిపించారు. లోక్‌సభలో తన తొలి ప్రసంగం కంటే ప్రియాంక ప్రసంగమే బాగుందన్నారు. మరోవైపు, రాజ్యాంగంపై చర్చ సమయంలో ప్రధాని మోదీ సభలో లేకపోవడంపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశంలో మైనారిటీలను ముఖ్యంగా ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

వారు నేర్చుకున్నది అదే

అంతకుముందు రాజ్యాంగంపై చర్చను ప్రారంభించిన రాజ్‌నాథ్‌సింగ్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. అవకాశం దొరికినప్పుడల్లా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని హైజాక్ చేయడానికి ప్రయత్నించిందన్నారు. రాజ్యాంగం కంటే తమ అధికారమే గొప్పదని కాంగ్రెస్ భావిస్తుందని మండిపడ్డారు. ఆ పార్టీ దురుద్దేశపూర్వకంగా ఎన్నో సార్లు రాజ్యాంగానికి సవరణలు చేసిందన్నారు. ఎమర్జెన్సీని ప్రస్తావించారు. "ఇటీవల విపక్ష నేతలు జేబులో రాజ్యాంగం పుస్తకాన్ని పెట్టుకొని తిరుగుతున్నారు. వారు చిన్నప్పటి నుంచి నేర్చుకున్నది అదే. తరతరాలుగా వారు రాజ్యాంగాన్ని తమ జేబులోని పుస్తకం అనుకుంటున్నారు" అని రాజ్‌నాథ్ అన్నారు. రాజ్యాంగ నిర్మాణానికి కృషి చేసిన కొంత మందిని కావాలనే విస్మరించారని ఆయన ఆరోపించారు. రాజ్యాంగంపై చర్చ శనివారం కూడా జరగనుంది. కాగా.. భారత పార్లమెంట్‌పై 2001 డిసెంబరు 13న ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన వారికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు నేతలు శుక్రవారం నివాళులర్పించారు.

మిమ్మల్ని ఎలా గౌరవించాలి?

- నన్ను, మా పార్టీని అవమానిస్తున్నారు
- రాజ్యసభ చైర్మన్‌ను ఉద్దేశించి ఖర్గే

న్యూఢిల్లీ, డిసెంబరు 13: రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన నేపథ్యంలో సభలో శుక్రవారం తీవ్ర గందరగోళం నెలకొంది. చైర్మన్ ధన్‌ఖడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మధ్య మాటల యుద్ధం నడిచింది. 'నేను రైతు బిడ్డను. ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనంగా ఉండను, ఇప్పటికే నేను చాలా వరకు సహించాను' అని ధన్‌ఖడ్ పేర్కొనగా.. 'మీరు రైతు బిడ్డ అయితే.. నేను కూడా ఒక కూలీ కుమారుడిని!' అని ఖర్గే పేర్కొన్నారు. 'మీరు మా కాంగ్రెస్‌ను, మా పార్టీ నేతలను అవమానిస్తున్నారు. మీ గొప్పలు వినేందుకు మేం ఇక్కడకు రాలేదు' అని అన్నారు. చైర్మన్ అధికార పార్టీ ఎంపీలకే అధిక సమయం ఇస్తూ, బీజేపీ దౌర్జన్యాలను ప్రోత్సహిస్తున్నారని, విపక్ష సభ్యులను మాట్లాడనివ్వకుండా పక్షపాతం చూపుతున్నారని ఆరోపించారు. ఈ సమయంలో వాడీవేడి చర్చ మరింత తీవ్రంగా మారింది. ఒకానొక సమయంలో 'నన్ను అవమానిస్తున్న మిమ్మల్ని.. నేను ఎలా గౌరవించగలను?' అని ఖర్గే రాజ్యసభ చైర్మన్‌ను అడిగారు.

ఆఘాడీకి బీటలు!

- బృహన్ ముంబై కార్పొరేషన్ ఎన్నికల్లో ఒంటరి పోటీకే ఉద్ధవ్ పార్టీ మొగ్గు

ముంబై, డిసెంబరు 13: మహారాష్ట్ర అసెంబ్లీ ఫలితాల ప్రకంపనలు ప్రతిపక్ష కూటమి మహా వికాస్ ఆఘాడీని కుదిపేస్తూనే ఉన్నాయి. ఆఘాడీ నుంచి వేరయిపోయి, ఒంటరిగా మహారాష్ట్రలో ఎదగాలని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) యోచిస్తున్నట్టు సమాచారం. స్వతంత్ర దారిని ఎన్నుకునేందుకు ఇదే సరైన సమయమని అసెంబ్లీలో ఆ పార్టీ పక్ష నేత అంబదాస్ ధాన్వే వ్యాఖ్యానించగా, తాజాగా ఆ పార్టీ సీనియర్ నేత సంజయ్ రౌత్ కూడా అదే అభిప్రాయాన్ని పరోక్షంగా వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న బృహన్ ముంబై కార్పొరేషన్, ఇతర నగరాల్లో జరిగే స్థానిక ఎన్నికలను ఒంటరిగా ఎదుర్కొంటామన్న సంకేతాలను ఆయన అందించారు. ఈ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేయాలనుకుంటే నిరభ్యంతరంగా ఆ పని చేయొచ్చునని ఆఘాడీలోని తక్కిన పార్టీలను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు.

రాహుల్‌కు యూపీ కోర్టు సమన్లు

లక్నో, డిసెంబరు 13: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లక్నోలోని స్థానిక కోర్టు సమన్లు జారీ చేసింది. జనవరి 10న హాజరుకావాలని ఆదేశించింది. సావర్కర్‌పై అనుచిత వ్యాఖ్యలతో రాహుల్ సమాజంలో సామరస్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారంటూ న్యాయవాది నృపేంద్ర పాండే క్రిమినల్ కంప్లైంట్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి అలోక్ వర్మ ఈ మేరకు సమన్లు జారీ చేశారు. భారత్ జోడో యాత్రలో భాగంగా 2022 నవంబరు 17న మహారాష్ట్ర అకోలాలో విలేకరుల సమావేశంలో సావర్కర్‌పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఈ కేసు నమోదైంది. సావర్కర్ బ్రిటీషువారికి సేవకుడిలా వ్యవహరించడమే గాక పెన్షన్ కూడా తీసుకున్నారని రాహుల్ నాడు వ్యాఖ్యానించారు.





ట్రయల్‌రన్‌కు ముందు వాహనానికి పూజలు, మల్కాపూర్ పెద్ద చెరువులో ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్

నేలపైనే కాదు.. నీటిపైనా గర్జిస్తాయ్

- ఎద్దుమైలారం ఓడీఎఫ్‌లో ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్స్ తయారీ
- మల్కాపూర్ పెద్ద చెరువులో ట్రయల్‌రన్ సక్సెస్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ యుద్ధ వాహనాలు నేలపైనే కాదు నీటిపైనా దూసుకెళ్తూ శత్రువులపై గుళ్ల వర్షం కురిపిస్తాయి. మన దేశ సైన్యం అమ్ములపొదిని మరింత శక్తిమంతం చేయనున్న ఈ అధునాతన ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్స్‌ను సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ (ఓడీఎఫ్)లో రూపొందించారు. శుక్రవారం వీటి ట్రయల్‌రన్‌ను కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ పెద్దచెరువులో విజయవంతంగా నిర్వహించారు. ఓడీఎఫ్ చీఫ్ జనరల్ మేనేజర్ శివశంకర్ ప్రసాద్ పూజలు చేసిన అనంతరం ట్రయల్‌రన్ ప్రారంభించారు. పెద్దచెరువులో రెండు యుద్ధ వాహనాలు 20 సార్లు చక్కర్లు కొట్టాయి. దీనిని వీక్షించేందుకు మల్కాపూర్ గ్రామస్థులు తరలివచ్చి ఉత్సాహంగా ఫొటోలు, సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా శివశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్స్ ట్రయల్‌రన్ విజయవంతమైందన్నారు. ఓడీఎఫ్ పరిశ్రమను 1984లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రారంభించారని, 1987 నుంచి యుద్ధ వాహనాలను తయారు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ ఏడు రకాల యుద్ధ వాహనాలను రూపొందించామని, వాటిలో.. బీఎంపీ2, ఏఏటీ, సీఎంటీ, ఏఈఆర్వీ, ఎన్‌బీసీఆర్వీ, సీసీపీటీ, ఎన్ఏఎంఐసీఏ వంటివి ఉన్నాయన్నారు. యుద్ధవాహనాలతోపాటు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను కూడా తయారు చేస్తున్నట్టు వెల్లడించారు. తాజాగా రూపొందించిన ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్స్ ఒక్కొక్కటి 14 టన్నుల బరువు ఉంటాయని, గంటకు 65 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తాయని తెలిపారు. నైట్ విజన్ టెక్నాలజీ, ఆర్మమెంట్ గన్‌తో పాటు మిసైల్ లాంచర్ సదుపాయం కూడా వీటిలో ఉందన్నారు. భారత సైన్యానికి ఇప్పటి వరకు మూడు వేల యుద్ధ వాహనాలను అందజేశామని శివశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓడీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఇంత తక్కువ వేతనమా?

- పార్లమెంటరీ స్థాయీ సంఘం ఆక్షేపణ

న్యూఢిల్లీ, డిసెంబరు 13: జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు తక్కువ వేతనాలివ్వడంపై పార్లమెంటరీ స్థాయీసంఘం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ వేతనాలను వినియోగదారుల సూచీకి అనుసంధానించకపోవడాన్ని ఆక్షేపించింది. పనిదినాలను ఇప్పుడున్న వంద రోజుల నుంచి 150కి పెంచాలని సిఫారసు చేసింది. గ్రామీణాభివృద్ధి-పంచాయతీరాజ్ శాఖపై కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలాకా సారథ్యంలో ఏర్పాటైన ఈ కమిటీ గురువారం తన నివేదికను లోక్‌సభకు సమర్పించింది. 'ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జీవన వ్యయం బాగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో ఉపాధి కూలి రూ.200 మాత్రమే ఉండడంలో అర్థం లేదు. అందుచేత గ్రామీణాభివృద్ధి శాఖ తన వైఖరిని మార్చుకుని ఉపాధి వేతనాల పెంపునకు సరికొత్త వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి' అని స్థాయీ సంఘం సిఫారసు చేసింది.

పీఎం ఆవాస్ యోజన కింద ఆర్థిక సాయం పెంచాలి

న్యూఢిల్లీ, డిసెంబరు 13: దేశవ్యాప్తంగా 2 కోట్ల అదనపు ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ (పీఎంఏవై-జీ) పథకాన్ని 2029 మార్చి వరకు పొడిగించిన నేపథ్యంలో యూనిట్ వ్యయాన్ని కూడా తగురీతిలో పెంచాలని గ్రామీణాభివృద్ధి-పంచాయతీరాజ్ శాఖపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ సూచించింది. చాలా కాలంగా ఇంటి నిర్మాణానికి కేంద్రం ఒక్కో యూనిట్‌కు రూ.1.2 లక్షల ఆర్థిక సాయం మాత్రమే అందిస్తోందని.. ఈ కారణంగా లబ్ధిదారులు ఇళ్లను పూర్తిచేయలేకపోతున్నారని తెలిపింది. వారికి తగు సాయం చేయనిదే 'అందరికీ ఇల్లు' సమకూర్చాలన్న లక్ష్యం నెరవేరడం సాధ్యం కాదంది. స్థలం లేని ఇళ్ల లబ్ధిదారులు కూడా ఉన్నారని గుర్తుచేసింది. ఇలాంటివారు కనీసం 2 లక్షల మంది ఉన్నారని.. రాష్ట్రప్రభుత్వం నుంచి స్థలం లేదా ఆర్థిక సాయం కోసం చూస్తున్నారని పేర్కొంది.

కెనడాలో ముగ్గురు విద్యార్థుల హత్యపై భారత్ ఆందోళన

న్యూఢిల్లీ, డిసెంబరు 13: కెనడాలో ముగ్గురు భారతీయ విద్యార్థుల హత్యపై కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. తమ ఆవేదనను కెనడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని శుక్రవారం విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. బాధిత కుటుంబాలకు ఒట్టావాలోని భారత రాయబార కార్యాలయం, వాంకోవర్, టొరాంటోల్లోని కాన్సులేట్ కార్యాలయాలు సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. సమగ్రమైన దర్యాప్తు జరిగేలా స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాయని తెలిపారు. కెనడాలో అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని భారతీయ విద్యార్థులకు సూచించారు. కెనడాలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు వీసా మంజూరులో భారత రాయబార కార్యాలయం ఆలస్యం చేస్తోందన్న వార్తలపై ఆయన స్పందించారు. ఇది కెనడా మీడియా చేస్తున్న దుష్ప్రచారమన్నారు.

ఎర్రకోటను నాకు తిరిగి ఇవ్వండి

న్యూఢిల్లీ, డిసెంబరు 13: ఎర్రకోటను తిరిగి తనకు అప్పగించాలని కోరుతూ మొఘల్ చక్రవర్తి వారసురాలు దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తిరస్కరించింది. చివరి చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 మునిమనుమడి భార్య సుల్తానా బేగం ఈ పిటిషన్ దాఖలు చేశారు. చక్రవర్తికి చట్టబద్ధ వారసురాలిని తానేనని, అందువల్ల ఎర్రకోటపై తనకు హక్కు ఉందని తెలిపారు. తొలుత ఇదే విషయమై దావా వేయగా పరిశీలించిన ఏకసభ్య ధర్మాసనం దాన్ని తిరస్కరిస్తూ 2021 డిసెంబరులో ఆదేశాలు ఇచ్చింది. సంఘటన జరిగి ఎన్నో దశాబ్దాల అనంతరం కేసు పెట్టినందున విచారణకు స్వీకరించలేమని తెలిపింది. దీనిపై అప్పీలు చేయగా ద్విసభ్య ధర్మాసనం..ఏకసభ్య ధర్మాసనం తీర్పుపై అప్పీలుకు రెండున్నరేళ్లు ఎందుకు ఆగారని ప్రశ్నిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది.

కేసీఆర్ వియ్యంకుడిపై అట్రాసిటీ కేసు నమోదు

అపార్ట్‌మెంట్ స్థల వివాదంలో పరస్పర ఫిర్యాదులు

ఖిల్లా (నిజామాబాద్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్ వియ్యంకుడు, ఎమ్మెల్సీ కవిత మామ, బీఆర్ఎస్ సీనియర్ నేత రాంకిషన్‌రావుపై కేసు నమోదైంది. నిజామాబాద్‌లో ఓ స్థల వివాదం విషయంలో గాధారి గోపి ఫిర్యాదు మేరకు నిజామాబాద్ రూరల్‌పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు రాంకిషన్‌రావుతోపాటు కొండూరు నగేష్, సూదం రవిపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని బైపాస్‌రోడ్డులో ఉన్న ఆర్‌కేఆర్ అపార్ట్‌మెంట్ వద్ద 235 గజాల స్థలం విషయమై కొన్ని రోజులుగా వివాదం కొనసాగుతోంది. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు రాంకిషన్‌రావు, అతని అనుచరులు ప్రయత్నిస్తున్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని అపార్ట్‌మెంట్‌కు చెందిన గోపి అనే వ్యక్తి ఫిర్యాదు చేసినట్టు రూరల్ పోలీసు స్టేషన్ ఎస్సై ఎండీ ఆరీఫ్ తెలిపారు. ఈ స్థలం తమదని, తాము ఎలాంటి కబ్జా చేయలేదని కొండూరు నగేష్ తెలిపారు. ఈ వివాదంతో ఎమ్మెల్సీ కవిత మామ రాంకిషన్‌రావుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అపార్ట్‌మెంట్ వాసుల్లో కొందరు తన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అదే పోలీసు స్టేషన్‌లో నగేష్ ఫిర్యాదు చేశారు.

ఇచ్చిన వడ్లు ఇచ్చినట్లే మాయం!

- కొత్త ధాన్యాన్నీ అమ్ముకుంటున్న రైస్‌మిల్లర్లు.. 11 మందిపై కేసులు

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్లలో కొందరు మారడం లేదు! నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. పాత బకాయిల వసూలుకు ఒకవైపు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ అవస్థలు పడుతుంటే... మిల్లర్లు కొత్త ధాన్యాన్ని కూడా యథేచ్ఛగా బయట అమ్ముకుంటున్నారు. గడిచిన నాలుగైదు సీజన్ల ధాన్యం, బియ్యం లెక్కలే ఇప్పటికీ తేలకపోగా ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని కూడా రైస్‌మిల్లర్లు మాయం చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ బృందాల తనిఖీల్లో మిల్లర్ల బండారం బయటపడింది. నాలుగు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిఘా బృందాలు తనిఖీలు నిర్వహించగా 5 జిల్లాల్లోని 11 రైస్‌మిల్లుల్లో 80 వేల మెట్రిక్ టన్నుల కొత్త ధాన్యం మాయమైనట్లు తేలింది. కామారెడ్డి జిల్లాలో 2, సూర్యాపేట జిల్లాల్లో 2, వనపర్తి జిల్లాలో 2, ఖమ్మం జిల్లాలో 2, వరంగల్ జిల్లాలో మూడు రైస్‌మిల్లుల్లో కొత్త వడ్లు దారి మళ్లించినట్లు నిర్ధారించారు. దీంతో 11 మంది రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదుచేశారు. వీరిలో కొందరు మిల్లర్లను అరెస్టు కూడా చేశారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా పలుజిల్లాల్లో ఇంకా నిఘాబృందాల తనిఖీలు కొనసాగుతున్నాయి. కాగా ఇక మీదట ధాన్యం దారిమళ్లింపులకు అవకాశం ఉండదని, మిల్లర్లు సీఎంఆర్ సకాలంలో ఇచ్చేలా సమన్వయం చేస్తామని రైస్‌మిల్లర్ల తరుపున రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌తోపాటు, జిల్లా అసోసియేషన్లు... రాష్ట్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చాయి. మిల్లర్లకు ధాన్యం కేటాయింపుల్లో కూడా అసోసియేషన్ క్రియాశీలకపాత్ర పోషించింది. ఇందులో ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పుడు ధాన్యం దారిమళ్లుతుంటే... రాష్ట్ర, జిల్లా అసోసియేషన్లు ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

ధాన్యం ధారిమళ్లిస్తే కఠినచర్యలు

రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని దారిమళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్ చౌహాన్ శుక్రవారం జారీచేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు. 11 మంది మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదుచేశామని తెలిపారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఇచ్చిన హామీమేరకు ఈ విషయంలో బాధ్యత వహించాలన్నారు. కాగా ఇకమీదట ధాన్యం దారిమళ్లింపులకు అవకాశం ఉండదని, మిల్లర్లు సీఎంఆర్ సకాలంలో ఇచ్చేలా సమన్వయం చేస్తామని రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌తోపాటు, జిల్లా అసోసియేషన్లు... రాష్ట్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చాయి. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాసిచ్చిన హామీని ప్రకటనలో చౌహాన్ ప్రత్యేకంగా ప్రస్తావించటం గమనార్హం.

పేదల ఇళ్లపై రాజకీయాలు వద్దు: గండ్ర



ఓ లబ్ధిదారుడి ఇంటి పట్టా కాపీని చూపుతున్న వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో రాజకీయాలు చేయొద్దని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే తన కార్యకర్తలకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇప్పించుకునే దురుద్దేశంతో అర్హులైన పేదలకు పట్టాలు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. శుక్రవారం భూపాలపల్లిలోని భాస్కర్‌గడ్డ వద్ద డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు ఇవ్వాలంటూ లబ్ధిదారులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి గండ్ర సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబరు 8న అప్పటి మంత్రి కేటీఆర్ కొందరు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందించారన్నారు. మిగిలిన వారికి పట్టాలు ఇచ్చే లోపే ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ నిలిచిపోయిందని చెప్పారు. అయితే అప్పుడు గుర్తించిన లబ్ధిదారులకు కాకుండా స్థానిక ఎమ్మెల్యే తనకు సంబంధించిన వారికి ఆ ఇళ్లు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో ఫోన్‌లో మాట్లాడారు. అర్హులైన వారికి తప్పకుండా త్వరలో ఇళ్ల పట్టాలు అందిస్తామని వారు హామీనిచ్చినట్లు గండ్ర తెలిపారు.

నాలుగేళ్లలో 20లక్షల ఇళ్ల నిర్మాణం

» రాష్ట్రవ్యాప్తంగా 580 నమూనా ఇళ్ల నిర్మాణం: పొంగులేటి

కూసుమంచి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న నాలుగేళ్లలో 20లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్లు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండల పరిషత్ ఆవరణలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పేదవాడి సొంత ఇంటికల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి మొదటి విడతగా 4.5 లక్షల మందికి ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని మండల కేంద్రాల్లో 580 నమూనా ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. అక్కడే అవసరమైతే తక్కువ ఖర్చులో ఎలా ఇల్లు నిర్మించాలో మేస్త్రీలకు శిక్షణ ఇస్తామని తెలిపారు.

అన్ని పంచాయతీలకు 'ఆదర్శ' గుర్తింపు రావాలి: తుమ్మల

దమ్మపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామపంచాయతీలకు ఆదర్శ పంచాయతీలుగా గుర్తింపు వచ్చేలా అందరూ కృషి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అల్లిపల్లి గ్రామంలో రూ.49 లక్షలతో నూతన పంచాయతీ భవనాన్ని, సీసీ రోడ్లు, పామాయిల్ బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యులు, గ్రామస్థుల సహకారంతో నిర్మించిన పాఠశాల భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు.

రుణమాఫీ కాని రైతులను ఆదుకుంటాం: సీతక్క

» బాసర ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయింపు

బాసర/దిలావర్‌పూర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదని, ఇలాంటివారిని ఆదుకుంటామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గత ప్రభుత్వం మాఫీని కొందరికే వర్తింపజేసిందని.. దీంతో రుణాలు రెన్యువల్ కాలేదని అన్నారు. ప్రస్తుతం చాలా మంది పేర్లు మాఫీ జాబితాలో లేకుండా పోయాయని పేర్కొన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా బాసరలో పర్యటించిన సీతక్క కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ రాని వారు కూడా రైతులే కాబట్టి మంత్రివర్గం, పార్టీ సమావేశంలో చర్చించి వారందరికీ పరిష్కారం చూపుతామని తెలిపారు. బాసర సరస్వతి ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కార్యకర్తల సమావేశం అనంతరం సీతక్క ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను సందర్శించారు. 2 గంటల పాటు విద్యార్థులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. కలిసి భోజనం చేశారు. ఐదేళ్ల నుంచి యూనిఫాంలు, హాస్టల్‌లో వసతులు, ల్యాప్‌టాప్‌లు ఇవ్వడం లేదని విద్యార్థులు చెప్పగా నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. వెంటనే రూ.కోటి ఇస్తున్నట్లు ప్రకటించారు.

కాన్వాయ్ ఆపి.. క్షతగాత్రులను తరలించి

సీతక్క తన కాన్వాయ్‌ను ఆపి.. రోడ్డు ప్రమాద బాధితులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. మంత్రి బాసర నుంచి నిర్మల్ వెళ్తుండగా.. దిలావర్‌పూర్ మండలం న్యూ లోలం-దిలావర్‌పూర్ గ్రామాల మధ్య రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయలయ్యాయి. వీరు అంబులెన్స్ కోసం చూస్తుండగా.. సీతక్క వారి వద్దకు వెళ్లారు. ఇంతలో అంబులెన్స్ వచ్చింది. మంత్రితో పాటు కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల వెంటనే బాధితులను అంబులెన్స్‌లో ఎక్కించి నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించేలా చూశారు.

అమేయకుమార్ కేసులో కొత్త మలుపు

» మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డికి ఈడీ సమన్లు

» వంశీరాం బిల్డర్స్ అధినేత సుబ్బారెడ్డి, మరో ఇద్దరు బిల్డర్లకూ.. ఈ నెల 16న విచారణ

హైదరాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి అమేయకుమార్‌పై నమోదైన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. మహేశ్వరం మండలం నాగారంలో 50 ఎకరాల భూదాన్ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో అమేయకుమార్‌పై ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసుకు సంబంధించి విచారణలో తేలిన అంశాల ఆధారంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, వంశీరాం బిల్డర్స్ అధినేత సుబ్బారెడ్డి, కేఎస్ఆర్ మైన్స్ కె.సిద్ధారెడ్డి, అమ్మద డెవలపర్స్ సూర్యతేజలకు ఈడీ సమన్లు జారీ చేసింది. ఈ నెల 16 నుంచి విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. అమేయకుమార్ ద్వారా వీరు లబ్ధి పొందారని ఈడీ గుర్తించినట్లు సమాచారం. భూదాన్ భూములను ప్రైవేట్ పట్టా భూములుగా మార్చడం, వాటికి రిజిస్ట్రేషన్లు జరగడం వెనుక వంద కోట్ల రూపాయల వరకు చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో దస్తగిరి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు మహేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు.

బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు మావోయిస్టుల మృతి

చర్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బాసగూడ అడవుల్లో శుక్రవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. చనిపోయినవారు బాసగూడ ఏరియా కమిటీకి చెందిన ఎస్ కల్లు, జనతన సర్కార్ వైస్ ప్రెసిడెంట్ కవాసి హంగా అని పోలీసులు తెలిపారు. మావోయిస్టుల కోసం డీఆర్‌జీ, కోబ్రా బలగాలు శుక్రవారం బాసగూడ అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో నేంద్ర, పున్నూరు గ్రామాల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. మృతదేహాల దగ్గర 12 బోర్ తుపాకులు, ప్రింటర్, యూనిఫాంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు, సస్పెన్షన్

ధారూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. వికారాబాద్ జిల్లా ధారూరు ఎస్సై వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండల పరిధిలోని స్టేషన్ ధారూరు ప్రాథమికోన్నత పాఠశాలలో నవాబుపేట మండలం అక్నాపూర్ గ్రామానికి చెందిన గొల్ల కిష్టయ్య ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొద్దిరోజులుగా మద్యం తాగి విధులకు హాజరవుతున్నాడు. ఈ క్రమంలో పాఠశాలలో కొంతమంది విద్యార్థినులను అసభ్య చేష్టలు, మాటలతో వేధించాడు. దీంతో శుక్రవారం విద్యార్థినుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణ జరిపి ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. దీంతో కిష్టయ్యను సస్పెండ్ చేస్తూ డీఈవో రేణుకాదేవి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

యూట్యూబ్ చానల్ ప్రారంభించిన పౌరసరఫరాల శాఖ

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించింది. "కమిషనర్ సివిల్ సప్లైస్" పేరుతో ఈ యూట్యూబ్ చానల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ శుక్రవారం ఆ చానల్‌ను ప్రారంభించి, దాని ద్వారా రైతులకు సందేశం ఇచ్చారు. రైతులకు నేరుగా సమాచారం చేరవేయడానికి ఈ చానల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన ధాన్యానికి రూ.500 బోనస్ వస్తుందా.. లేదా? ప్రైవేటు ట్రేడర్లు, రైస్‌మిల్లర్లు కొనుగోలు చేసినప్పుడు రూ.2,820 చొప్పున చెల్లిస్తున్నారా.. లేదా? ఇంకా కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులందరూ చానల్‌ను లైక్ చేసి, సబ్‌స్క్రైబ్ చేయాలని కమిషనర్ కోరారు.

పదవీ విరమణ బకాయిలను 24% వడ్డీతో చెల్లించండి

» ట్రెజరీ కార్యాలయాన్ని ఆదేశించిన హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి కార్యాలయంలో సీనియర్ సూపరింటెండెంట్‌గా అన్నపూర్ణ విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. 10 నెలలుగా ఆర్థిక ప్రయోజనాలను ఇవ్వడంలేదంటూ ఆమె ట్రెజరీ అధికారులపై హైకోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ పుల్లా కార్తిక్ ధర్మాసనం.. కమ్యూటేషన్ బిల్లు రూ.25.95 లక్షలు, ఆర్జిత సెలవుల (ఈఎల్) నగదు రూ. 18.14 లక్షలు, గ్రాట్యుటీ రూ.24.18 లక్షలు, టీజీఎల్‌ఐసి రూ.3.25 లక్షల చొప్పున మొత్తం రూ.72 లక్షలను 24% వార్షిక వడ్డీతో కలిపి ఆరు వారాల్లో చెల్లించాలని ట్రెజరీని ఆదేశించింది.

బాలికపై అత్యాచారయత్నం

» దాడిలో నిందితుడి మృతి

రెంజల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చాక్లెట్లు కొనేందుకు తన షాప్‌కు వచ్చిన బాలికపై కన్నేసి అత్యాచారానికి యత్నించాడో కామాంధుడు. గమనించిన బాలిక కుటుంబీకులు అతన్ని చితకబాదడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలో జరిగింది. రెంజల్ మండలంలో ఓ తండాకు చెందిన రత్నవత్ రెడ్యా నాయక్(55) కిరాణా షాప్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే తండాకు చెందిన 8 ఏళ్ల బాలిక గురువారం రాత్రి రెడ్యానాయక్ షాప్‌లోకి చాక్లెట్లు కొనేందుకు తన అమ్మమ్మతో కలిసి వెళ్లింది. అయితే అమ్మమ్మ తిరిగి ఇంటికి వెళ్లగా.. బాలిక మాత్రం అక్కడే ఆడుకుంటూ ఉంది. అదే సమయంలో బాలికపై కన్నేసిన రెడ్యానాయక్.. షాప్ పక్కనే గల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. గమనించిన అమ్మాయి బంధువులు రెడ్యా నాయక్‌పై దాడి చేసి, విపరీతంగా కొట్టడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు రెడ్యానాయక్‌ను ఆస్పత్రి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. అనంతరం మృతుడి కుటుంబీకులు బాలిక ఇంటిపై దాడి చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే పోలీసులు చేరుకొని ఆందోళనకారులను అడ్డుకున్నారు.



రెడ్యా నాయక్ (ఫైల్)

ద్వంద్వార్థాలతో వైద్యురాలికి వేధింపులు

» సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌పై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ద్వంద్వ అర్థం వచ్చేలా మాట్లాడుతూ మహిళా వైద్యురాలిని మానసికంగా వేధిస్తున్న ఓ కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) సూపరింటెండెంట్‌పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. చౌటుప్పల్‌లోని సీహెచ్‌సీకి డాక్టర్ రాజగోపాల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సీహెచ్‌సీలో 8 మంది వైద్యులు, 14 మంది ఇతర సిబ్బంది ఉన్నారు. వీరిలో ఓ మహిళా వైద్యురాలు గైనకాలజిస్టుగా పని చేస్తున్నారు. విధులు నిర్వహించే క్రమంలో ఆమెను మానసికంగా వేధిస్తూ, ద్వంద్వ అర్థాల మాటలతో రాజగోపాల్ ఇబ్బంది పెట్టేవాడు. ఆస్పత్రి సిబ్బంది ఎదుట అవమానపరిచేలా వ్యవహరించడంతో వేధింపులు భరించలేక ఆమె ఈ నెల 5న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం డాక్టర్ రాజగోపాల్‌పై లైంగిక వేధింపులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పక్కాగా ఇందిరమ్మ ఇళ్ల యాప్!

అనర్హులను ఏరివేసేందుకు ముమ్మర సర్వే.. అర్హులను గుర్తించేందుకు మొత్తం ఏడు ప్రశ్నలు

» అర్హుల జాబితా వెలువడ్డాక ఇందిరమ్మ కమిటీలు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో సభలు.. లబ్ధిదారుల ఎంపిక

పెద్దపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం పక్కాగా యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను మరోసారి ధ్రువీకరించుకుని.. అర్హులా, అనర్హులా అని తేల్చనుంది. ఈ జాబితా ప్రకారమే తొలి విడతలో ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన ఇళ్లను లబ్ధిదారులకు మంజూరు చేయనుంది. 2024-25 సంవత్సరానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం సంకల్పించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గత ఏడాది డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రజాపాలన సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. అప్పట్లో దరఖాస్తు చేసుకున్న వారందరి వివరాలను ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో ఇప్పటికే పొందుపర్చారు. ఈ వివరాల ఆధారంగానే పట్టణాల్లో మునిసిపల్ సిబ్బంది, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు.. సర్వేను ప్రారంభించారు. ఇందులో ప్రధానంగా 7 ప్రశ్నలు, వాటికి అనుబంధంగా మరో 7 ప్రశ్నలు, అందులో ఆప్షన్లు ఉన్నాయి. దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి పేరు, ఆధార్, సెల్ నంబర్ నమోదు చేస్తే ఆటోమేటిక్‌గా ఆ వివరాలు వస్తాయి. దానికింద సర్వేకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు పూరించాల్సి ఉంటుంది. 2004-14 వరకు ఇందిరమ్మ ఇల్లు గానీ, ఆ తర్వాత డబుల్ బెడ్‌రూం ఇల్లు కానీ మంజూరైందా? ఇప్పుడు నివసిస్తున్న ఇల్లు సొంతమా? కాదా? సొంత ఇల్లైతే సిమెంట్ కాంక్రీట్‌తో స్లాబ్ వేశారా? రేకులతో నిర్మించారా? ఇంటి గోడలు మట్టితో కట్టినవా? ఇటుకలతో నిర్మించారా? వంటి వివరాలు నమోదు చేయాలి. ఇంటి ముందు దరఖాస్తుదారుడిని నిలబెట్టి ఒక ఫొటో, ఇంటి పైకప్పు ఫొటో, ఆ ఇంటి స్థితిగతులు, ఆ కుటుంబ స్థితిని తెలుసుకునేందుకు ఇంటి లోపల ఒక ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇంట్లో పెళ్లి అయిన వాళ్లు ఎంత మంది ఉన్నారు? దరఖాస్తుదారుకు గానీ, కుటుంబ సభ్యుల పేరిట గానీ ఇంటి నిర్మాణానికి స్థలం ఉందా? ఉంటే అది డీ-ఫారం పట్టానా? లేక సాదాబైనామానా? అని నిర్ధారించుకొని, పొజిషన్ సర్టిఫికెట్, ప్రాపర్టీ ట్యాక్స్, పట్టాదార్ పాస్‌బుక్, ఎలక్ట్రిసిటీ బిల్లు.. వీటిలో ఏది ఉంటే అది అప్‌లోడ్ చేయనున్నారు. ప్రస్తుత నివాస ప్రాంతంలోగాకుండా మరోచోట స్థలం ఉంటే దానికి సంబంధించిన వివరాలతోపాటు ఆ స్థలం ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇతర ప్రాంతాల్లో ఎన్ని సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నారనే అంశాలను నమోదు చేయాలి. ఎంపికలో వ్యవసాయ కూలీలు, వితంతువులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్, సఫాయి కర్మచారి, ఒంటరి మహిళలు, అట్టడుగున ఉన్న గిరిజనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వీటి ఆధారంగా దరఖాస్తుదారులు అర్హులా? కాదా? అని తేల్చేందుకు యాప్‌లోనే ఓ ఆప్షన్ ఇచ్చారు. ఒక వేళ ప్రజాపాలన సభల్లో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోకుంటే.. ఎడిట్ ఆప్షన్ ద్వారా వారి వివరాలను నమోదు చేస్తారు. వారు అర్హులేనా? కాదా? అని మళ్లీ ధ్రువీకరించుకుంటారు. ఈ సర్వే ద్వారా దరఖాస్తుదారుల నుంచి అనర్హులను ఏరివేసి, అర్హుల జాబితా రూపొందించనున్నారు. దాని ఆధారంగా గ్రామసభలు నిర్వహించి, ఇందిరమ్మ గ్రామ కమిటీలు, ఎమ్మెల్యేలు మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.



పెద్దపల్లి జిల్లా పెద్దకల్వలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది



జగిత్యాల ప్రధాన ఆస్పత్రిలో డ్యాన్స్ చేస్తున్న నర్సులు

జగిత్యాల ప్రధాన ఆస్పత్రిలో నర్సుల డ్యాన్స్

» విచారణ జరిపిన జిల్లా అదనపు కలెక్టర్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ప్రధాన ఆస్పత్రిలో విధులను పక్కన బెట్టి నర్సులు డ్యాన్స్ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న గదిలో పెద్ద సౌండ్ పెట్టుకుని నృత్యాలు చేయడంతో పక్క గదిలో ఉన్న రోగులు, వారి తరఫు బంధువులు తాము ఇబ్బందిపడుతున్నామంటూ ఆర్ఎంవో సుమన్‌కు ఫిర్యాదు చేశారు. క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో భాగంగా నర్సులకు తానే అనుమతి ఇచ్చానని, ఈ విషయాన్ని ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని ఆర్ఎంవో ప్రశ్నించారు. దీనిపై భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నేతలు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేయడంతో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి ఘటనపై ఆరా తీశారు. వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ రాములును ఆదేశించారు. ఇద్దరు ఆర్ఎంవోలను విచారణకు నియమించామని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని రాములు తెలిపారు.

కిరాయికి దిగి కిరాతకానికి ఒడిగట్టారు

నేలకొండపల్లి దంపతుల హత్య కేసులో వీడిన మిస్టరీ.. నెలక్రితం అద్దెకు.. 8 మంది అరెస్టు

ఖమ్మం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి యజమానులూ జాగ్రత్త! ఇంట్లోని పోర్షన్‌ను ఎవరు పడితే వారికి అద్దెకిస్తే కోరికష్టాలు తెచ్చుకొన్నట్టే. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో ఇదే జరిగింది. దంపతులను వారింట్లో కిరాయికి ఉంటున్న వ్యక్తులే చంపేశారు. నేలకొండపల్లిలో 17 రోజుల క్రితం జరిగిన దంపతులు యర్రా వెంకటరమణ (62), కృష్ణకుమారి (60) దంపతుల హత్య వెనుక మిస్టరీని పోలీసులు ఛేదించారు. కేసు వివరాలను ఖమ్మం సీపీ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మోగులూరుకు చెందిన షేక్ అబిద్ అలియాస్ అబిద్ అలీ, సోహైల్, ఆరిఫ్ అనే వ్యక్తి బైసెక్సువల్! 2011లో కంచికచర్లలో జరిగిన ఓ హత్య కేసులో 2014లో జీవితఖైదు శిక్ష పడింది. అప్పటి నుంచి రాజమండ్రి సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న అతడు ఈ ఏడాది పెరోల్ మీద బయటకొచ్చాడు. గడువు ముగిసినా జైలుకు వెళ్లకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో కోదాడకు వచ్చి పేరు మార్చుకున్నాడు. అక్కడ షేక్ హుస్సేన్ బీ అనే భర్త లేని మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. హుస్సేన్ బీ నేలకొండపల్లి మండలం బుద్దారంలో నివాసం ఉంటున్న తన స్నేహితురాలైన జమాల్‌బీని, తన మేనకోడలు షాబానాను అబిద్‌కు పరిచయం చేసింది. కొన్నాళ్లకు షాబానాతోనూ అబిద్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కోదాడలో టీ కొట్టు వద్దకు వచ్చిపోయే సురేశ్ అనే వ్యక్తితోనూ అబిద్ శారీరక సంబంధాన్ని ఏర్పరుచుకున్నాడు. జల్సాలకు అలవాటు పడ్డ అబిద్ పక్కా పథకం ప్రకారం ఓ భారీ దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం వద్ద ఎలాంటి ఐడీ కార్డులు ఇవ్వకుండా పది సిమ్‌కార్డులు కొన్నాడు. ఓ గుర్తు తెలియని వ్యక్తి దగ్గర రూ. 10వేలు పెట్టి ఓ బైక్ కొనుగోలుచేసి దానికి మరో బైక్‌కు సంబంధించిన నంబరును వేయించాడు. అనంతరం డబ్బున్నవారి ఇళ్ల గురించి ఆరా తీయడం మొదలుపెట్టాడు. ఈ విషయాన్ని బుద్దారం వెళ్లి జమాల్‌బీకి చెప్పాడు. ఆమె ద్వారా నేలకొండపల్లిలోని బియ్యం వ్యాపారం చేసే యర్రా వెంకటరమణ(62) గురించి తెలుసుకున్నాడు. ఆయన డబ్బులు బాగా సంపాదించాడని, ఇంట్లో ఆయన, భార్య కృష్ణకుమారి(60) మాత్రమే ఉంటారని తెలుసుకున్నాడు. ఆ ఇంట్లో పలు పోర్షన్లు కిరాయికిస్తారని తెలుసుకున్న అబిద్, జమాల్‌బీ.. సురేశ్, షేక్ షాబనా, షేక్ హుస్సేన్‌బీతో కలిసి వెంకటరమణ ఇంట్లో దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. తొలుత వారింట్లో కిరాయికి దిగి వారిని నమ్మించి దోపిడీ చేయాలని పథకం వేశారు. గత జూలైలో అబీద్, సురేశ్ వెళ్లగా వెంకటరమణ ఇల్లు చూపించాడు.. కానీ ఇల్లు అద్దెకు ఇవ్వలేదు. తర్వాత అబిద్ ప్లాన్ మార్చి.. షాబానా, హుస్సేన్‌బీలను రంగంలోకి దించారు. నవంబరు రెండో వారంలో షాబానా, హుస్సేన్‌బీ.. వెంకటరమణ ఇంట్లో అద్దెకు దిగారు. గతనెల 26న రాత్రి అబిద్, సురేశ్ కలిసి వెంకటరమణ ఇంటికి వెళ్లారు. అప్పటికి ఇంట్లో వెంకటరమణ భార్య కృష్ణకుమా రి.. షాబానా, హుస్సేన్‌బీతో కలిసి టీవీ చూస్తోంది. సురేశ్, అబీద్ ఒక్కసారిగా లోపలికి వచ్చి కృష్ణకుమారిని గొంతుపిసికి చంపి ఆమె ఒంటిపై ఉన్న బంగారాన్ని లాక్కున్నారు. ఇంట్లో ఉన్న బంగారం కూడా తీసుకుని, పక్క గదిలోని బంగారం కోసం వెతుకుతుండగా వెంకటరమణ లేచి చూడగా ఆ యన్నూ గొంతు పిసికి చంపారు. మొత్తంగా 8 తు లాల బంగారంతో అక్కడి నుంచి పారిపోయారు. గురువారం ఉదయం నేలకొండపల్లి మండలం పైనంపల్లి చెక్‌పోస్టు వద్ద ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో చేపట్టిన వాహన తనిఖీల్లో అబిద్ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా వృద్ధ దంపతుల హత్యకేసు మిస్టరీ వీడింది. హత్యలతో సంబంధం ఉన్న మరో ఏడుగురిని అరెస్ట్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చదరంగపు రారాజు

ప్రపంచ చాంపియన్ అవ్వాలని ప్రతి ఆటగాడూ కోరుకుంటాడు. కొందరు కెరీర్ చరమాంకంలో లక్ష్యాన్ని చేరుకుంటే.. మరికొందరు ఆదినుంచే అద్భుతాలు సృష్టిస్తూ అందనంత 'ఎత్తు'కు ఎదుగుతారు. తెలుగు మూలాలున్న పద్దెనిమిదేళ్ల తమిళ ఆటగాడు దొమ్మరాజు గుకేశ్ రెండో కోవలో నిలుస్తాడు. ఇటీవలే ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన గుకేశ్, ప్రపంచ టోర్నీకి డిఫెండింగ్ చాంపియన్, చైనా ఆటగాడు డింగ్ లిరెన్‌ను సవాల్ చేశాడు. అనుకున్నట్టే తాజాగా సింగపూర్‌లో జరిగిన అసలైన సమరంలో లిరెన్‌ను తన ఎత్తులతో చిత్తు-చేసి కొత్త చాంపియన్‌గా అవతరించాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయుడిగా, కాస్పరోవ్‌లాంటి దిగ్గజాన్ని అధిగమిస్తూ ప్రపంచంలోనే అతి పిన్న వయసు ఆటగాడిగా గుకేష్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించాడు.

చదరంగంలో గుకేష్ ప్రయాణమే ఓ సంచలనం. ఏడేళ్ల వయసులోనే అరవై నాలుగు గళ్ల ఆటను ఔపోసన పట్టేసిన గుకేష్, అనతికాలంలోనే తన ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నాడు. తొమ్మిదేళ్లకే ఆసియా పాఠశాలల చాంపియన్‌షిప్, మూడేళ్ల అనంతరం ప్రపంచ యూత్ చెస్ చాంపియన్-షిప్‌లో విజేతగా నిలిచి తన సహజ-సిద్ధమైన ప్రజ్ఞను చాటుకున్నాడు. 12 ఏళ్ల ఏడు నెలల పదిహేడు రోజుల వయసులోనే గ్రాండ్‌మాస్టర్ హోదాను దక్కించుకున్నాడు. గ్రాండ్‌మాస్టర్ అయ్యాక మరింత కష్టపడడం మొదలుపెట్టాడు. భారత దిగ్గజం విశ్వ-నాథన్ ఆనంద్ మార్గనిర్దేశనంలో మరోస్థాయికి ఎదిగాడు. తన గురువు ఆనంద్, మాగ్నస్ కార్ల్‌సన్‌లను ఓడిస్తానని ఐదేళ్లక్రితమే ప్రకటించిన గుకేష్.. చెప్పినట్టే అనంతరకాలంలో ఆ ఇరువురు దిగ్గజాలపై పైచేయి సాధించాడు. రెండేళ్ల క్రితం ఒలింపియాడ్‌లో వ్యక్తిగత స్వర్ణం, నిరుడు ఆసియా క్రీడల టీమ్ విభాగంలో రజతం అందుకున్న గుకేష్ ప్రపంచ చెస్‌లో 2750 రేటింగ్ దాటిన అతి పిన్న వయసు ఆటగాడిగా రికార్డుల్లో నిలిచాడు. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో తలపడి పదిహేడేళ్ల వయసులోనే టైటిల్ నెగ్గి చరిత్ర సృష్టించాడు. ఇక భారత జట్టు చెస్ ఒలింపియాడ్ ట్రోఫీని సాధించడంలో కీలకపాత్ర పోషించిన ఈ చెన్నై చిన్నోడు, ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌షిప్‌తో చదరంగ సింహాసనంపై రారాజు జెండా ఎగరేశాడు. ఈ ఘనతలన్నీ అతి తక్కువకాలంలో, చిరు-ప్రాయంలోనే అందుకొని తనపేరును చిరస్మరణీయం చేసుకున్నాడు.

గుకేష్ మితభాషి. ఎంత తక్కువగా మాట్లాడతాడో అంత ఎక్కువగా తనదైన వ్యూహాలతో చదరంగ బోర్డుపై చెలరేగిపోతాడు. చెస్ శిక్షణలో కంప్యూటర్ల సాయం తీసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ తరం ఆటగాళ్లకు గుకేష్ కొంత భిన్నం. ఈ క్రీడలో క్లాసికల్ ఫార్మాట్ అంటే మక్కువ చూపే గుకేష్, వీలైనంత వరకు కంప్యూటర్ల వాడకాన్ని తగ్గిస్తూ, సంప్రదాయమైన శిక్షణలో కోచ్‌ల పర్య-వేక్షణను ఎక్కువగా ఇష్టపడతాడు. ఏ టోర్నీకి వెళ్లినా ఆటకు ముందు గుకేష్ అమ్మతో పావుగంట సేపు మాట్లాడతాడు. ఆ సంభాషణలో ఎక్కడా చెస్ ప్రస్తావన తీసుకురాకుండా జాగ్రత్తపడతాడు. ఎంత ఒత్తిడి దరిచేరు-తున్నా, ప్రశాంతంగా ఉంటూ ఆటకు సిద్ధమయ్యేందుకే కాసేపు అమ్మతో మాట్లాడతానని గుకేష్ చెప్తాడు. ఇలా, ప్రతి అంశంలోనూ విభిన్నంగా ఉంటూ బోర్డులో ఎత్తుకు పైఎత్తులు వేస్తుంటాడు.

భారతీయుల ఆటగా పేరొందిన చదరంగంలో గుకేష్‌తో పాటు ప్రజ్ఞానంద, అర్జున్, విదిత్ గుజరాతి, వైశాలి, దివ్యా దేశ్‌ముఖ్ లాంటి యువ ఆటగాళ్లు సాధిస్తున్న విజయాలతో ఇప్పుడు పుట్టింటికి పూర్వ వైభవం వచ్చింది. వీళ్ల అంతర్జాతీయస్థాయి ప్రదర్శనలతో దేశవ్యాప్తంగా చదరంగ విప్లవం మళ్లీ పురుడు పోసుకుంది. 1999లో భారత్‌లో ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లే ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 85కు చేరడమే అందుకు నిదర్శనం. విశ్వనాథన్ ఆనంద్ వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ యువతరం తమ క్రీడాప్రజ్ఞకు పదును పెట్టుకుంటుండడం శుభ పరిణామం. క్రీడల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్న మన చిన్నారులకు వ్యవస్థాగత తోడ్పాటు, నిరంతరం శిక్షణ అందించే పటిష్ఠ యంత్రాంగాన్ని తీర్చిదిద్దాలి. క్షేత్రస్థాయిలో అపరిష్కృతంగా ఉన్న మౌలిక సమస్యలపై దృష్టి సారించాలి. ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు ప్రైవేట్ సంస్థల వెన్నుదన్నూ ఉండాలి.

ఆర్థిక భారత అద్భుతానికి మోదీ ఎలా ఆద్యుడు?

విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఎలెక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ నాగరీక మర్యాదలు తెలిసినవారు, విద్యాధికులు, మృదుస్వభావులు. ప్రజ్ఞా-వంతుడైన దౌత్యవేత్తగా జైశంకర్ సుప్రసిద్ధుడు. ఉదారవాదిగా పేరు పొందారు. మాజీ ఐఏఎస్ అధికారి అయిన వైష్ణవ్ వ్యాపార రంగంలో విజయాలు సాధించి పార్లమెంటుకు ఎన్నికై వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించిన ప్రతిభావంతుడు. అర్థశాస్త్రం, ఆర్థిక రంగ వ్యవహారాలలో జైశంకర్‌కు ఆసక్తి ఉన్నదన్న విషయం నాకు తెలుసు. వార్టన్ బిజినెస్ స్కూల్‌లో గ్రాడ్యుయేట్‌గా వైష్ణవ్ అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి ఈ ఇరువురికీ బాగా తెలుసు. టీవీ ఛానెల్ ఎన్‌డీటీవీ ఇటీవల నిర్వహించిన ఒక సదస్సులో దేశ ఆర్థిక వ్యవస్థపై ఇరువురూ తమ అభిప్రా-యాలను సుదీర్ఘంగా వ్యక్తం చేశారు.

అంకెలు ప్రతిభావంతులను సైతం గందరగోళపరుస్తాయి. జైశంకర్ తొలుత భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం గురించి సగర్వంగా మాట్లాడారు: నేడు మన ఆర్థిక వ్యవస్థ 4 లక్షల కోట్ల డాలర్ల విలువైనది. 80,000 కోట్ల డాలర్ల విదేశీ వాణిజ్యం జరుపుతున్న ఆర్థిక వ్యవస్థ మనది. మన దేశంలో విదేశీ మదుపులను చూస్తే మన ఆర్థిక వ్యవస్థ ఎంత పెద్దదో మీకు అర్థమ-వుతుంది...'. వాస్తవం ఇందుకు చాలా దూరంగా ఉంది సుమా! మనం ఇంకా 4 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందలేదు. 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందాలని మనం లక్ష్యం నిర్దేశించుకున్నాం. ఆ గమ్యానికి చేరేందుకు మనం ఆపసోపాలు పడుతున్నాం. ఈ లక్ష్య సాధన విషయమై ఆర్థికమంత్రి, ప్రభుత్వ ఆర్థిక సలహాదారు గత ఆరేళ్లలో మూడుసార్లు భిన్న రీతుల్లో మాట్లాడారు!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

2023–24 ఆర్థిక సంవత్సరాంతంలో మన దేశం నుంచి 437 బిలియన్ డాలర్ల విలువైన సరుకులు ఎగుమతి అయ్యాయి; 677 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు దిగుమతి చేసుకున్నారు. వాణిజ్య లోటు 240 బిలియన్ డాలర్లు. మన దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2021–22లో 84.84 బిలియన్ డాలర్ల నుంచి 2023–24లో 70.95 బిలి-యన్ డాలర్లకు తగ్గిపోయాయి. 'ప్రజలకు లబ్ధి, ముఖ్యంగా ఆహారాన్ని సమ-కూర్చడంలో మన ఆర్థిక వ్యవస్థ సామర్థ్యం గురించి ఘనంగా మాట్లాడారు. తలసరిన ఐదు కిలోల ఆహారధాన్యాలను ఉచితంగా సరఫరా చేయడం గురించి జైశంకర్ మాట్లాడుతున్నారా? నేనైతే ఆ ఉచిత సరఫరా ప్రజల దురవస్థలు, అల్ప వేతనాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాల కొరతకు సూచనగా పరిగణిస్తాను. కోవిడ్ కాలంలో వాక్సిన్ల ఉత్పత్తిదారుగా, సృష్టికర్తగా భారత్ సామర్థ్యాన్ని కూడా ఆయన ప్రశంసించారు. నిజమేమిటి? మన దేశంలో రూపొందించిన ఏకైక వ్యాక్సిన్ కోవాక్సిన్. దీని ప్రభావశీలత 80 శాతంగా ఉందని నిర్ధారణ అయింది. మరో వాక్సిన్ కోవిషీల్డ్. ఇది 90 శాతం ప్రభావశీలతను కలిగి ఉన్నదని రుజువయింది. అయితే ఆక్స్‌ఫర్డ్ – ఆస్ట్రాజెనెకా నుంచి లైసెన్స్ పొంది ఉత్పత్తి చేసిన వ్యాక్సిన్ ఇది. మన దేశంలో వేసిన 200 కోట్ల వ్యాక్సిన్లలో 160 కోట్లు కోవి-షీల్డ్ వ్యాక్సిన్లే.



1991లో ప్రారంభమైన సరళీకృత ఆర్థిక విధానాలతో భారత్‌లో ఆర్థిక స్వాతంత్ర్యం ఉదయించింది. ఆ నవశకానికి తీవ్ర అవరోధాలు ఎదురయినా కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తమకు ముందున్న ప్రభుత్వాల కృషిని మరింత ముందుకు తీసుకువెళ్లి దేశ సౌభాగ్య సాధాన్ని మరింత సమున్నతమూ, శోభావంతమూ చేశాయి. ఆర్థిక పురోగతి పూర్తిగా దిగజారిపోయిన పరిస్థితుల నుంచి తమ పాలనా ప్రస్థానాన్ని ప్రారంభించామని మోదీ ప్రభుత్వం చెప్పుకోవడంలో సత్యం లేదు.

వైష్ణవ్ సైతం మన ఆర్థిక వ్యవస్థ పురోగతి గురించి ఎంతో ఉద్వేగ భరితంగా మాట్లాడారు. భారత్ 6 నుంచి 8 శాతం సుస్థిర వృద్ధిరేటు సాధించడం గురించి ఆయన మాట్లాడారు. ఈ పురోగతికి నాలుగు ప్రధాన కారణాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని మూలధన పెట్టుబడులు, వస్తూత్పత్తి, సమ్మిళిత వృద్ధి, సరళీకరణగా ఆయన గుర్తిం-చారు. అయితే వాస్తవాలు ఏమిటి? మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పెరుగుదల రేటు కోవిడ్ ప్రభావిత ఏడాదితో సహా గత ఆరు సంవత్సరా-లుగా సగటున 4.99 శాతంగా ఉంటోంది. కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం, ప్రభుత్వ రంగ సంస్థల మదుపులు వాస్తవంగా 2019–20లో జీడీపీలో 4.7 శాతం నుంచి 2023–24లో 3.8 శాతానికి తగ్గిపోయింది.

జీడీపీలో వస్తూత్పత్తి రంగ వాటా 2014లో 15.07 శాతం నుంచి 2019లో 12.84 శాతానికి, 2023లో 12.84 శాతానికి తగ్గిపోయింది. సమ్మిళిత వృద్ధి అనేది తీవ్ర చర్చనీయాంశం. అటువంటి పురోగతి ఉన్నదా లేదా అనేది ఇంత చిన్న వ్యాసంలో నిరూ-పించడం కష్టం. కనుక ఈ అంశాన్ని వదిలివేస్తున్నాను. ఇక సరళీకరణ విషయానికి వస్తే పది సంవత్సరాల క్రితం కంటే ఇప్పుడే, ముఖ్యంగా క్రమబద్ధీకరణ చట్టాల కింద నియమనిబంధనలు ఎక్కువగా ఉన్నాయి. ఏ చార్టర్డ్ అకౌంటెంట్ లేదా కంపెనీ సెక్రెటరీ లేదా లీగల్ ప్రాక్టీషనర్‌ను అయినా అడగండి, నియమ నిబంధనలు, నియంత్రణలు ఎంత ఎక్కువ స్థాయిలో అదనంగా వచ్చాయో వివరిస్తారు.

1991లో సరళీకృత ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన తరువాత దేశ ఆర్థిక వ్యవస్థ సాధించిన పురోగతి గురించి జైశంకర్, వైష్ణవ్‌లు సహేతుకంగా గర్వపడవచ్చు. అది ఆర్థిక స్వాతంత్ర్య నవోదయం. అయితే దానికి 1997లో (ఆసియన్ ఆర్థిక సంక్షోభం), 2008 (అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం), 2016 (పెద్దనోట్ల రద్దు), 2020 (కోవిడ్ విలయం) తీవ్ర అవరోధాలు ఎదురయ్యాయి. అయినప్పటికీ కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తమకు ముందున్న ప్రభుత్వాల భుజస్కంధాలపై నిలబడి భవి-ష్యత్తులోకి దృష్టి సారించి, దేశ సౌభాగ్య సౌధాన్ని మరింత సమున్నతం, శోభావంతం చేశాయి. ఆర్థిక పురోగతి పూర్తిగా దిగజారిపోయిన పరిస్థితుల నుంచి తమ పాలనా ప్రస్థానాన్ని ప్రారంభించామని మోదీ ప్రభుత్వం చెప్పుకోవడంలో సత్యం లేదు. ఏ ప్రభుత్వమూ అలా ప్రారంభమవదు. కోవిషీల్డ్ వ్యాక్సిన్ విషయాన్నే తీసుకోండి. సీరమ్ ఇనిస్టిట్యూట్‌ను 1996లో నెలకొల్పారు. ఔషధాల ఉత్పత్తిలో ఒక బృహత్తర సంస్థగా అది అభివృద్ధి చెందింది. అపార అనుభవాన్ని సంతరించుకుంది. కోవిడ్ ఉపద్రవం సంభవించినప్పుడు ఆస్ట్రాజెనెకా సాంకేతికతను సమకూర్చుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నది. వ్యాక్సిన్ల తయారీలో ప్రపంచ అగ్రగామి సంస్థగా ఆవిర్భవించింది. అలాగే అతిగా పొగుడుతుండే JAM – జన్ ధన్ ఖాతాలు, ఆధార్, మొబైల్ ఆద్యక్షర సంక్షిప్త పదం– నే తీసుకోండి నో–ఫ్రిల్స్ బ్యాంక్ ఖాతాల (జీరో బ్యాలెన్స్ ఎకౌంట్)కు బీజాలు ఇరువురు ఆర్బీఐ గవర్నర్ల– డాక్టర్ ఎస్. రంగరాజన్ (1992–97), డాక్టర్ బిమల్ జలాన్ (1997–2003) హయాంల్లో పడ్డాయి. లక్షలాది కొత్త ఖాతాలు ప్రారంభమ-య్యాయి. ప్రప్రథమ ఆధార్ నంబర్‌ను యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకత్వంలో సెప్టెంబర్ 29, 2010న జారీ అయింది. సెల్‌ఫోన్ ద్వారా తొలి కాల్ చేసిన జూలై 31, 1995న మొబైల్ విప్లవం ప్రారంభమయింది.


సరే, భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత స్థితిగతుల గురించి తెలుకోవాలంటే దాని అసాధారణ పురోగతి గురించి గౌరవనీయ మంత్రులు జైశంకర్, వైష్ణవ్‌ల ప్రశంసా-పూర్వక ప్రసంగాలను మీరు వినితీరవలసిందే. అయిత ప్రతినెలా ప్రచురితమయ్యే ఆర్బీఐ బులెటిన్‌లో ఆర్థిక వ్యవస్థ తాజా పరిస్థితిపై విపుల సమీక్షా వ్యాసాన్ని కూడా మీరు తప్పక చదవాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

వ్యాసుడు చూపిన వెలుగుబాట

గొప్ప చరిత్రకారుడు, విశిష్ట జీవితాల కథకుడు అయిన రాజ్‌మోహన్ గాంధీని నేను చాలా సంవత్సరాలుగా చదువుతున్నాను. అత్యయికస్థితి చీకటి రోజుల్లో ఆయన ఎడిటర్‌గా ఉన్న వారపత్రిక 'హిమ్మత్' ఆనాటి భయ విహ్వల వాతావరణాన్ని సాహ-సోపేతంగా ఎదుర్కొంది. ఆ తరువాత ఆధునిక భారతదే-శంపై లోతైన, నిర్దుష్ట పరిశోధనతో పలు పుస్తకాలు వెలు-వరించారు. పటేల్, రాజాజీ జీవితం, రాజనీతిజ్ఞత, పాలనా-దక్షతపై ప్రభావశీల గ్రంథాలు కూడా వాటిలో ఉన్నాయి. పత్రికలలో తన కాలమ్స్ ద్వారా వివిధ అంశాలపై ఆలోచ-నాత్మక చర్చకు విశేషంగా దోహదం చేశారు.

ఇటీవల నా మిత్రుడు ఒకరు నేను ఇంతకు ముందు చదవని రాజ్‌మోహన్ గాంధీ ప్రసంగం ఒకదాన్ని నా దృష్టికి తీసుకువచ్చారు. సెప్టెంబర్ 1991లో రాజ్యసభలో ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టంపై చర్చలో చేసిన ఉపన్యాసమది. ఆగస్టు 15, 1947నాటికి ఉన్న ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావాన్ని యథాతథంగా ఉంచేందుకు, ప్రార్థనాస్థలం లేదా స్థలంలోని ఒక విభాగాన్ని వేరే మతానికి చెందిన లేదా అదే మతంలోని వేరే సంప్రదాయానికి చెందిన ప్రార్థనాస్థలంగా మార్చడాన్ని నిషేధించే బిల్లు అది. అప్పటికే న్యాయ విచారణలో ఉన్న అయోధ్య వివాదాన్ని ఆ ప్రతిపాదిత చట్టం నుంచి మిన-హాయించారు. ఆనాడు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నది. బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ లోక్‌సభలో ఆ బిల్లు ఆమోదం పొందింది. తమ నియంత్రణలో ఉన్న ప్రార్థనా స్థలాలలో ఎటువంటి మార్పులు చేయడానికి అయినా రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ ఉన్నదని బీజేపీ వాదించింది. అప్పట్లో జనతాదళ్ సభ్యుడుగా ఉన్న రాజ్‌మోహన్ గాంధీ ఆ బిల్లుపై చర్చ ప్రారంభించారు. పగ తీర్చుకునే ప్రయత్నాలలో లక్షలాదిమంది హతమైపోయిన విషాదం గురించి మహాభారతంలో వ్యక్తమైన ఆవేదన ప్రస్తావనతో రాజ్‌మోహన్ తన ప్రసంగాన్ని ప్రారంభిం-చారు. 'గతించిన యుగాలలో జరిగిన తప్పులను ప్రతీకార దృక్పథంతో సరిదిద్దేందుకు ప్రయత్నించేవారు కేవలం విధ్వంసానికి, మరింత విధ్వంసానికి, మరెంతో వినాశనా-నికి కారకులు అవుతారని మహాభారతం ఉద్ఘోషిస్తోంది' అని వక్కాణించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రార్థనాస్థలాల చట్టాన్ని రాజ్‌మోహన్ పూర్తిగా సమర్థించారు. ఆ బిల్లు హిందూ మతస్థులకు వ్యతిరేకంగా ఉందని బీజేపీ సభ్యులు చేసిన విమర్శకు ఆయన ఇలా ప్రతిస్పందించారు: 'ఆ విమ-ర్శలు మన దేశంలో కొత్త వేర్పాటు వాదాన్ని వినిపిస్తు-న్నాయి. ఆ విమర్శలు చేస్తున్నవారు తాము ప్రవచిస్తున్నది ఒక కొత్త జాతీయవాదం అని అంటున్నారు. అయితే అది హిందూ వేర్పాటువాదం. హిందూ ధర్మాన్ని వక్రీకరించిన వాదనలు అవి. ఆ విమర్శలు చేస్తున్నవారు తమ సొంత భావావేశాలు, ఉద్వేగాలతో తప్పుదోవ పట్టినవారు. భారత్‌లో ఒక హిందూ పాకిస్థాన్‌ను, ఒక హిందూ సౌదీ అరేబియాను సృష్టించాలని వారు ఆకాంక్షిస్తున్నారు'. 'గత యుగాలలో జరిగిన నేరాల (వాస్తవమైనవి, ఊహా-త్మకమైనవి)పై మితిమీరిన స్థాయిలో దృష్టి పెట్టిన 'కొత్త వేర్పాటువాద హిందూధర్మం' ఉద్దేశపూర్వకంగా వర్తమాన కాలంలోని సంఖ్యానేక ప్రజల జీవన దుర్భరత్వం, ఆకలి దప్పులను విస్మరిస్తుం-దని, తాండవమాడుతున్న అవినీతి, పెచ్చ-రిల్లుతున్న హింసాకాండను ఉపేక్షిస్తుం-దని' ఆయన ఆక్షేపించారు.



1991లో ప్రార్థనాస్థలాల చట్టంపై రాజ్యసభలో చర్చను ప్రారంభిస్తూ 'గతించిన యుగాలలో జరిగిన తప్పులను ప్రతీకార దృక్పథంతో సరిదిద్దేందుకు ప్రయత్నించేవారు కేవలం విధ్వంసానికి, మరింత విధ్వంసానికి, మరెంతో వినాశనానికి కారకులు అవుతారని మహాభారతం ఉద్ఘోషిస్తోంది' అని రాజ్‌మోహన్ గాంధీ గుర్తుచేశారు. భారతీయ ధర్మస్ఫూర్తిని రక్షించుకోదలిచిన వారందరూ ఆ వివేకవాణిని ఔదలదాల్చాలి.

'హిందువుల ఆత్మ గౌరవ పునరుద్ధరణ గురించి హిందుత్వశక్తులు మాట్లాడు-తున్నాయి. ముస్లింల పట్ల వ్యతిరేకత చూపడం ద్వారా మీ హిందూ అస్తిత్వాన్ని నిరూపించుకోండి అని కొత్త హిందూ వేర్పాటువాద శక్తులు నిర్దేశిస్తున్నాయి' అని ఆయన గర్హించారు. 'ప్రార్థనా స్థలాల చట్టాన్ని వ్యతిరేకిస్తున్నవారు స్వల్పంగానో లేదా బృహత్తర స్థాయిలోనే రాజకీయ ప్రయోజనాలు పొందవచ్చు గానీ, ఆ వ్యతిరేకత కొత్త భావావేశాలను సృష్టి-స్తుంది. పురాతన యుగాలలో సంభవిం-చిన తప్పులను సరిదిద్దేందుకు మరెన్నో ప్రయత్నాలు జరుగుతాయి. ఇది దేశ శ్రేయస్సుకు శుభం కాదు. ఈ సత్యాన్ని విస్మరిస్తే గత చరిత్రలో జరిగిన తప్పు-లను సరిదిద్దే పేరిట మరెన్నో పోరాటాలు ప్రజ్వరిల్లి శాంతి సామరస్యాలు సమసిపోయే ప్రమాదమున్నది' అని ఆయన హెచ్చరించారు. హిందూ ఆత్మాభిమానం, హిందూ గౌరవం అనే భావావేశాలను నగదుగా, ఓట్లుగా, జడిపించే అధికారంగా, తుపాకీగా మార్చివేసే ప్రయత్నాలు హిందూ ధర్మానికి చెడ్డ పేరు తీసుకువస్తాయని ఆయన స్పష్టం చేశారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

'ఇక చాలు, ఈ ఘర్షణలకు స్వస్తి చెబుదాం అన్నది మన జాతీయ సంకల్పం అయ్యేందుకు కృషి చేద్దాం. వివాదాలు ఉంటాయి, ఉండవచ్చు. అయితే హింసాత్మక ఘర్షణలను నివారిద్దాం. మనం సమైక్యంగా భవిష్యత్తులోకి చూపు సారిద్దాం, గతంలోకి అంతగా చూడవద్దు, గతాన్ని ఉపేక్షిద్దాం' అని రాజ్‌మోహన్ గాంధీ ప్రసంగాన్ని ముగించారు. ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం–1991ను భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న వ్యక్తే స్వయంగా బలహీనపరిచిన నేపథ్యంలో రాజ్‌మోహన్ గాంధీ వివేకశీల మాటలను మనం మళ్లీ గుర్తు చేసుకుందాం, వాటి స్ఫూర్తిని ఆవాహన చేసుకుందాం.

వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో గత కాలపు హిందూ దేవతా ప్రతిమలు ఉన్నాయని, వాటిని ఆరాధించే హక్కు తమకు ఉందని, పూజలకు అనుమతినివ్వాలని కోరుతూ ఆగస్టు 2021లో కొంత మంది హిందువులు తొలుత స్థానిక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ మేరకు జ్ఞానవాపి మసీదును సర్వే చేయాలని ఆ కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాన్ని అలహాబాద్ హైకోర్టు సమర్థించింది. దీనిపై అభ్యంతరం తెలిపినవారు మే 2022లో సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం అధ్యక్షుడుగా ఉన్న భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ఇలా వ్యాఖ్యానించారు: ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనల) చట్టం–1991 గత యుగాలలోని ఏ కాలానికి చెందిన ప్రార్థనా స్థలం మత పర స్వభావాన్ని నిర్ధారించడాన్ని అడ్డుకోదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే చారిత్రక తప్పు-లను సరిదిద్దే ప్రయత్నాలను ప్రోత్స-హించాలని కింది న్యాయస్థానాలు, హైకోర్టు న్యాయమూర్తులు కోరుకుంటే అందుకు అనుగుణమైన ఆదేశాలు జారీ చేసేందుకు వారికి స్వేచ్ఛ ఉన్నది'. దీనిపై మానవహక్కుల ఉద్యమ నేత హర్ష్ మందర్ ఇలా వ్యాఖ్యానించారు: 'సంభాల్‌లో ఆరుగురు వ్యక్తుల మరణా-నికి కారణమైన సివిల్ జడ్జి ఉత్తర్వును సీజేఐ చంద్రచూడ్ వ్యాఖ్యలు అనుమ-తించాయి. ప్రార్థనాస్థలాల మత పర స్వభావం విషయమై అనేక సవాళ్లకు సీజేఐ వ్యాఖ్యలు దారితీస్తున్నాయన్న సుప్రీంకోర్టు అబ్జర్వర్ వ్యాఖ్యలో సత్యం ఉన్నది'.

1998–2004 సంవత్సరాల మధ్య ఎన్డీఏ పాలనా కాలంలో బీజేపీ అగ్రనాయకులు అరుదుగా మాత్రమే విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం జరిగింది. 1990లో ఎల్‌కె అద్వానీ రథయాత్ర సందర్భంగా రక్తపాతం చోటు-చేసుకున్నప్పటికీ, ఎన్డీఏ ప్రభుత్వంలో హోం మంత్రిగా ఆయన ప్రకటనలు సంయమనంతో ఉండేవి. ఇతర కేబినెట్ మంత్రులు, ప్రధానమంత్రి కూడా చాలా సంయమనంతో మాట్లాడేవారు. ఇప్పుడు హిందువులు కాని భారతీయుల పట్ల విద్వేషపూరిత వ్యతిరేకతతో తమ హిందూ అస్తిత్వాన్ని నిర్వచించుకుంటున్న వారిలో చాలా శక్తిమంతమైన, అత్యు-న్నతస్థాయి రాజకీయ నాయకులు కూడా ఉంటున్నారు. కేంద్ర హోంమంత్రి, ఉత్తరప్రదేశ్, అసోం ముఖ్యమంత్రులు తమ ఉపన్యాసాలలో తరచుగా భారతీయ ముస్లింలపై తీవ్ర అపవాదులు వేయడం పరిపాటి అయిపోయింది. ప్రధానమంత్రి సైతం అప్పుడప్పుడూ ఇటువంటి వైఖరి చూపుతున్నారు. అధికార లాలసులు అయిన హిందూత్వ-వాదులు తమ ముస్లిం విద్వేష వైఖరులను సరిదిద్దుకోగల-రని ఆశించలేము. అయితే భారతీయ ధర్మ స్ఫూర్తిని రక్షిం-చుకోవాలనే వివేక వాణిని వినేందుకు సుముఖంగా ఉన్న హిందువుల కోసం మహాభారతం పఠనం నుంచి రాజ్‌మోహన్ గాంధీ తెలుసుకున్న సత్యాన్ని ఈ వ్యాసానికి ముగింపుగా మరొకసారి ఉటంకిస్తాను: "చారిత్రక తప్పు-లను ప్రతీకార వైఖరితో సరిదిద్దేందుకు ప్రయత్నించేవారు కేవలం విధ్వంసాన్ని, మరింత విధ్వంసాన్ని, మరెంతో వినాశనాన్ని మాత్రమే సృష్టిస్తారు'.

గాంధీ, రాజాజీల మనవడు అయిన రాజ్‌మోహన్ మరో చోట చేసిన ఒక వివేకశీల వ్యాఖ్యను కూడా ఉటంకిస్తాను: 'మన చరిత్రను మహాభారతం సహాయంతో దర్శించదలు-చుకోవడం, ఆ ఇతిహాస కావ్యానికి జ్ఞానదాయక భాష్యం చెప్పడానికి ప్రయత్నించడం అనుమతించదగిన కర్తవ్యమే కాకుండా, అది ఒక నిర్దేశిత విధ్యుక్త ధర్మం'.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

యాభై వసంతాల అరుణోదయం

ఏభై ఏళ్లు ఆషామాషీ కాదు, అది ఒక మైలురాయి. సంస్థని ప్రారంభించినవారు, ఆ సంస్థని నడిపిన-వారు, నేటిదాకా దానికొక ఆలంబనగా నిలిచిన వ్యక్తులు, శక్తులు ఎవరైనా వారికి అభినందనలు తెలపవలసిందే. ఇదొక విలువైన సందర్భం. సమాజానికి అవసరమైన వేడుక. 50 ఏళ్ళ పండగ – గతాన్ని మననం చేసుకుంటూ, భవిష్యత్తును తీర్చి-దిద్దే ఆవశ్యకత. ప్రజా జీవితంలో, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక రంగంలో అది ఒక కొండగుర్తు. కొన్ని విజయాలు, మరికొన్ని ప్రయత్నాలు ఏవైనా గాని వాటిని పాఠాలుగా ఆత్మ విమర్శతో ముందడుగు వేయడానికి ఉపయోగపడే ఇంధనం వంటిది ఏభైయవ వసంతం.

అనేక ప్రజా సమూహాలు కలగలిసిన సంస్థ గురించి ఆలోచిం-చినప్పుడు ఏభై ఏళ్ళ కాలం పెద్దదే. దీనిని చాలా మంది గుర్తిస్తారు. ఒక మహోత్సవంగా జరపాలని ఆశిస్తారు. ఏభై ఏళ్ళ సందర్భాన్ని 'స్వర్ణోత్సవాలు' అంటారు. ఆ పదాన్ని ఇష్టపడని-వారు 'సింపుల్'గా 50 ఏళ్ళు అంటారు. పండగ అనో, వేడుక అనో అంటారు. అరుణోదయ మాత్రం '50 వసంతాల సభలు' అంటున్నది. ప్రజలకు సంబంధించిన ఏ సంస్థ అయినా 50 ఏళ్ళు పూర్తి చేసుకోవడం పండగే. ముఖ్యంగా ఇప్పుడున్న పరిస్థితులలో.. ప్రజల కోసమే పుట్టిన సంస్థ ప్రజల చైతన్యంలో భాగమై ప్రజా జీవితాల కోసం కంకణబద్ధమైన ఆలోచనలను వెదజల్లుతూ నిలబడడం ప్రజావిజయంగా భావించాలి.

ఇప్పుడు బహిరంగంగా ప్రజా ఉద్యమాలు అవసరం. వాటి రూపకల్పన, పని విధానం ప్రజల మధ్య, విశాలాకాశం కింద పురుడు పోసుకోవాలి. కవిత్వం, గానం, గీతం వంటి వాటిని జన జీవితాల్లోంచి వెలికి తీసి ప్రజల భాషలో వినిపించాలి. అరుణోదయ తన పాత ప్రణాళికను మరింత లో చూపుతో ఇతర ప్రగతిశీల సంస్థల కన్నా గుణాత్మకంగా కొత్త చూపుతో తీసుకురావాలి.



1974 ఏప్రిల్ 14న పలు సంప్రదింపులతో జంపాల చంద్రశేఖర ప్రసాద్ చొరవతో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మే 12, 1974న లాంఛనంగా ఏర్పడింది. చలపతి, కానూరి వంటివారు, తదనంతరం గొప్ప కవిగాయక సుప్రసిద్ధుల నిర్వాహణతో దూసుకుపోయింది. ఎన్ని అవాంఛనీయ పరిస్థితులు ఎదురైనా కదం తొక్కుతూ, పదం పాడుతూ పోదాం ముందుకే... అంటూ తన ప్రయాణం సాగించింది. ఈ ప్రస్థానంలో ఎంతో మంది కవిగాయకులు, కళాకారులు ఎన్నో ఆంక్షలు ఎదుర్కొన్నారు, జైళ్లకు వెళ్ళారు. ప్రజా కళారంగాన్ని ఉవ్వెత్తున ఉద్యమంగా, ఉద్యమాలకు బాసటగా నిలిపారు. వామపక్ష భావాలతో భూమి, భుక్తి, గూడు కోసం వర్గపోరాటాలను రాశిలోనూ, వాసి-లోనూ తీర్చిదిద్దారు. ఈ క్రమంలో ఎందరో అమరులయ్యారు. గత ప్రభుత్వం హయాంలో కూడా అరుణోదయ కళాకారులను వేధింపులకు గురి చేశారు. సాంస్కృతిక సంస్థ కార్యాలయానికి తాళాలు వేశారు. కళాకారుల మీద కేసులు పెట్టారు. అయినా ప్రజల కోసం ప్రజాబాణీలను, ప్రజా సంగీతాన్ని ఆసరా చేసుకొని ప్రజల మధ్య రాగాలై, బాణీలై, గానాలై కళారూపాలై తమవంతు పాత్ర పోషించారు.

ప్రజలకు దూరమైన భావాలూ, జీవితాలూ, రాజకీయాలూ కాకుండా వారిని కేంద్రంగా చేసుకుని వారి సమస్యల కోసం వారు నిలిచిన నేలలోంచి నిలబడి కళారూపాలను సృష్టించడంలో అరుణోదయ తనదైన ముద్ర వేసింది. ముఖ్యంగా కుల, వర్గ పోరాటాలను ఎజెండాపైకి తేవడంలోనూ, ఆ అంశాలను సాహిత్యంలో, కళల్లో, కళారూపాలలో ప్రదర్శించిన అరుణోదయ ముందు నిలిచింది.

నిజానికి విద్యార్థి సంఘాలు, అరుణోదయ సంస్థలు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. ఐక్య సాంస్కృతిక కార్యాచరణ అవసరం ప్రజలు గుర్తించారు. కానీ ఎలాంటి రాజకీయ, నిర్మాణ సమస్యల వల్ల ఐక్యం కాలేకపోయాయో తెలియదు. కానీ, సాంస్కృతిక పోరాటం మాత్రం తీవ్రంగా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నిజానికి దేశీయ ప్రజాస్వామ్యం అభివృద్ధి చెంది, ఆయా ప్రజలలో ఐక్యత తీసుకురావాల్సి వుండగా గ్రూపులు, పార్టీలు విడనాడి ప్రజలను విడదీయడం జరుగుతుంది. కులాన్ని గుర్తించని ప్రగతిశీల రాజకీయవాదం ఎంత గొప్పదైనా ప్రజలను కలిపే ప్రయత్నాలలో, ఆలోచనలలో వెనుకబడిపోయారు. వివిధ వర్గాల, కులాల, ఉపకులాల మధ్య గల చిన్న చిన్న వైరుధ్యాలను రూపుమాపలేని విధంగా ప్రణాళికలను తయారు చేసుకున్నారు. ఒకవైపు కుల, మత భావన, ఆధిపత్యం సజావుగా కొనసాగు-తుంటే ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చేదెవరు?

ప్రజల సాంస్కృతిక రూపాలు, కళారంగాన్ని, శ్రమ సాంస్కృ-తిక రంగాన్ని పట్టించుకోకపోవడం ఎందువల్ల జరుగుతోంది? ఇలాంటి చాలా ప్రశ్నలకు ప్రజలకు జవాబు లభించడం లేదు. అందుకే ఈ సంక్లిష్ట సమయంలో సాంస్కృతిక రంగంపై పెను-భారం పడింది. ఈ పరిస్థితులను అర్థం చేసుకుంటూ ఒక్కో సమస్యను ప్రజలకు విడమరుస్తూ అనేక వేదికల మీద వాటిని ప్రచారం చేస్తున్న అరుణోదయ కళాకారులను అభినందించవల-సిందే. ఈ సంస్థను విమలక్క తన భుజస్కంధాలపై మోస్తూ భారమైనప్పటికీ ఆగకుండా సాగుతున్నందుకు అభినందించాలి.

అరుణోదయ తమ కళాకారులను, కార్యకర్తలను తామే కష్టపడి తయారు చేసుకోవడం గమనార్హం. గాలికి వచ్చేవాళ్లు... అలా వచ్చి ఇలా వెళతారు. కానీ, అరుణోదయ స్థిరంగా కార్య-కలాపాలను కొనసాగిస్తున్నదంటే కళాకారులను ప్రజలలోంచి వెతికి తమలో భాగం చేయడమే. ప్రజా రాశుల నుండి చేరవలసిన వాళ్ళను వెతుక్కోలేనితనం ఓటమికి దారితీస్తుంది. ప్రజాతంత్ర జనస్వామ్యం గుర్తించని సంస్థలు డీలా పడిపోతాయి. ప్రజలలో పనిచేయని రచయిత, మేధావి కృత్రిమ భావాలకు కాల్పనిక ఆలోచనలకు దగ్గరవుతారు. నాణ్యమైన ఫలితాలను సాధించలేని వ్యక్తుల వల్ల చిన్న ఉద్యమాలు కూడా విజయవంతం కావు. అవును, ఇప్పుడు బహిరంగంగా ప్రజోద్యమాలు అవసరం. వాటి రూపకల్పన, వాటి పని విధానం ప్రజల మధ్య, విశాలాకాశం కింద పురుడు పోసుకోవాలి. కొత్త కొత్తగా ఏర్ప-డిన సమస్యలు మారుతున్న సాంకేతిక అభివృద్ధి, సామాజిక చల-నాలు, ప్రజా ఆకాంక్షలను అధ్యయనం చేసి, మార్కెట్‌ను, మతాన్ని, కొత్త దోపిడీ రూపాలను మనం అర్థం చేసుకోవాలి.

విశాల హృదయంతో ప్రజా సమూహాలను వారి సమస్యల పరిష్కారానికి వారినే సిద్ధం చేయాలి. అలాంటి కృషిని అరుణోదయ కొంత చేయగలుగుతున్నందుకు సంతోషించాలి. సాంస్కృతిక కళారంగం తల్లిలా ప్రజలను చేరదీయాలి. రాజకీయ రంగం చేసే పనికన్నా ఎక్కువ శ్రమపడాలి. రాజకీయ పదజాలం ఎక్కువగా ఉపయోగించడం పాత పద్ధతి. కవిత్వం, గానం, గీతం వంటి వాటిని జీవితాల్లోంచి వెలికి తీసి ప్రజల భాషలో వినిపించాలి. ఏ నిర్మాణానికి అయినా ఒక లక్ష్యం వుంటుంది. దాని లక్ష్యాల కోసం అది పనిచేస్తుంది. ఆ స్వేచ్ఛను ఇతర వేదికలవారు హరించకూడదు. తాము చేయవలసిన పనిని ఇతరులు చేయాలని చెప్పడం సరైనది కాదు.

అరుణోదయ తన పాత ప్రణాళికను మరింత లో చూపుతో ఇతర ప్రగతిశీల సంస్థల కన్నా గుణాత్మకంగా కొత్త చూపుతో తీసుకురావాలని ఆశ. కుల సమస్యను గుర్తించ నిరాకరించిన సంస్థలు కుల సమస్యను రూపుమాపలేవు. అందుకే అరుణోదయ మీద ఆ భారం వుంది. దానిని తమ సుదీర్ఘ కాలపు అనుభవం, ప్రత్యక్ష పరిశీలన, అన్ని కులాల కళాకారులతో కలిసిపోయి ఐక్యంగా పనిచేసే తీరు భవిష్యత్తులో మార్గదర్శి కావాలి. మన దేశంలోని కుల సమస్య, దోపిడీ, ప్రజాస్వామ్య భావాలను క్రమ విధానంలో పెంచి పోషించే ఆలోచనల దిశగా ప్రయాణించాలి. బతుకమ్మ పేరుతో మహిళల సమస్యలను పర్యావరణాన్ని కాపాడుకోవాలనే పిలుపు ఇచ్చి, ఊరూరా తిరిగి పాటలు పాడి, ఆటలు ఆడటం సరికొత్త విధానం. ఇక్కడ బతుకమ్మని కాపా-డుకోవడానికి పర్యావరణ ఉద్యమాలు అవసరం. మహిళలపై జరిగే లైంగిక దోపిడీని, కార్పొరేట్లకోసం అడవిని, ఆదివాసీలను తరలించే ఆలోచనలకు అడ్డుకట్ట వేసే అడ్డుకునే ప్రచారం చేయడం జరుగుతోంది. పాత సమస్యలను కొత్త ఆలోచనలతో కొత్త ఎత్తుగడలతో ఎదుర్కోవడం అవసరం. అరుణోదయ ఈ విషయంలో ఆగకుండా తన ప్రయాణం కొనసాగిస్తోంది. అందుకు 50 ఏళ్ళ సభలు జరుపుకుంటున్న సందర్భంలో అరు-ణోదయకు అభినందనలు.

■ జయధీర్ తిరుమలరావు

(డిసెంబర్ 14న హైదరాబాద్‌లోని వీఎస్టీ ఫంక్షన్ హాలులో, 15న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ 50 వసంతాల సభలు)

'కెవెస్ సంపూర్ణ రచనలు' ఆవిష్కరణ సభ

భారత కమ్యూనిస్టు విప్లవ మహో-పాధ్యాయుడు కొండపల్లి సీతారామయ్య సంపూర్ణ రచనలు (రెండు సంపుటాలు) ఆవిష్కరణ సభ రేపు జరగనున్నది. హైదరాబాద్, బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమురయ్య హాల్‌లో సాయంత్రం 5.30 గం.లకు జరిగే సభకు డాక్టర్ శ్రీనివాస్ సభాధ్యక్షులు, టి.కృష్ణాబాయి ఆవిష్కర్త. సిహెచ్. శివారెడ్డి, అల్లం నారాయణ, ఎ.కె. ప్రభాకర్, డాక్టర్ సూరేపల్లి సుజాత, హర్ష ఠాకూర్, సుధాకర్, ఎన్.మూర్తి, తాయమ్మ కరుణ, 'మాభూమి' సంధ్య, డాక్టర్ బి.వై. వెంకటేశ్వర్లు, సాంబ-మూర్తి ఉపన్యసిస్తారు.

–కె.ఎస్. మెమోరియల్ కమిటీ

సహకారోద్యమ యోధుడి అభినందన సభ

దక్షిణ భారతదేశంలో విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకును అగ్రస్థా-నంలో నిలపడంలో సుప్రసిద్ధ సహకా-రవేత్త, మాజీ శాసనసభ్యులు మానం ఆంజనేయులు విశేష కృషి చేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా ఆ బ్యాంకుకు వివిధ హోదాలలో సేవ-లందించారు. కార్మిక సంఘాల కార్య-క్రమాలలో పాల్గొంటూ వివిధ ఉద్య-మాలకు నాయకత్వం వహించారు. పెందుర్తి నియోజకవర్గ శాసనసభ్యు-నిగా జనం మెచ్చిన కమ్యూనిస్టు నేత ఆయన. సహకార వ్యవస్థ బలోపేతా-నికి కృషి చేశారు. నాఫ్‌కాబ్ డైరెక్టర్‌గా, ఉపాధ్యక్షుడిగా జాతీయ స్థాయిలో సేవలందించారు. నేడు హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని పిల్లర్ నెం. 737, పీఎస్ఆర్ ఎంపైర్, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉదయం పది గంటలకు మానం ఆంజనేయులు అభినందన సభ జరగ-నున్నది. దాసరి శ్రీనివాసులు, వేమిరెడ్డి నరసింహారెడ్డి, పి.ఆర్.వి.పి.ఎస్ రంగ-రాజు విశిష్ట అతిథులు. రమేష్‌కుమార్ బంగ్, ఆర్.వి. రామారావు, ప్రమోద్-కుమార్ కెడియ, పొట్లూరి పాండురంగారావు ఆత్మీయ అతిథులు.

–చలసాని రాఘవేంద్రరావు
అభినందన సభ నిర్వహణ కమిటీ

తల్లీ బిడ్డ తల్లడిల్లుతున్నారు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాతా, శిశు మరణాలు పెరుగుతున్నాయి. ప్రసవం కోసం ఆస్పత్రుల్లో చేరిన గర్భిణులకు సకాలంలో సరైన వైద్యం అందించడంలో డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్లనే మరణాలు సంభవిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రెండు మూడేళ్లలో సంభవించిన మాతా శిశు మరణాలతో పోల్చితే ఈ యేడు కొంత మేరకు తగ్గినా.. వీటికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట మాత్రం పడడం లేదు. హనుమకొండ జిల్లాలో ఈ యేడు ఇప్పటివరకు ఒక మరణమే సంభవించినట్టు అధికారవర్గాలు చెబుతున్నా.. అనధికారికంగా వీటిసంఖ్య ఎక్కువే ఉంటుందని భావిస్తున్నారు. మాతా శిశుమరణాలు డాక్టర్లు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఉండదని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తోసిపుచ్చుతుండగా, బాధితుల బంధువులు మాత్రం వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని వాదిస్తున్నారు.



- ఆందోళనకర స్థాయిలో మాతాశిశు మరణాలు
- అదేం లేదంటున్న అధికారిక గణాంకాలు
- అనధికారిక లెక్కల ప్రకారం పరిస్థితి దారుణం
- అందుబాటులో ఉండని డాక్టర్లు.. పట్టించుకోని వైద్యాధికారులు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు లేమి
- ఎడాపెడా జరుగుతున్న సిజేరియన్లు
- రక్తహీనత, పోషకాహార లోపంతోనే మరణాలు



వరంగల్ మెడికల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పభుత్వ ప్రసూతి ఆస్పత్రుల్లో కనీస వసతులు లేకపోవడం, ఆధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉండకపోవడం, ఉన్నా- వాటిలో చాలావరకు పనిచేయకపోవడం, తదితర కారణాల వల్ల కూడా మాతా శిశు మరణాలు పెరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల స్థానంలో సీజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా చేయడం కూడా మరణాలకు దారి తీస్తున్నదన్న వాదనలు ఉన్నాయి. మాతా, శిశు మరణాలను నియంత్రించడం కోసం వైద్యాధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో సేవలు అందించాల్సి ఉండగా, చాలా ప్రభుత్వాస్పత్రుల్లో అది జరగడం లేదు. డాక్టర్లు విధులకు చెప్పకుండానే గైర్హాజరవుతున్నారు.

పట్టించుకోని వైద్యులు

ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణుల వివరాలను నమోదు చేసుకొని వారికి గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు నిరంతరం వైద్య పరీక్షలు జరిగేలా చూడాల్సి ఉండగా, వైద్య సిబ్బంది పెద్దగా పట్టించుకోవడం లేదు. పీహెచ్‌సీలకు, ఏరియా ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు అవసరమైన పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహించాల్సి ఉండగా, వైద్య పరికరాలు లేకపోవడంతో పరీక్షలు కూడా సరిగా నిర్వహించడం లేదు. గర్భిణుల ఆరోగ్య దృష్ట్యా, రక్తహీనత సమస్య లేకుండా అవసరమైన మందులను అందించాల్సి ఉండగా, చాలా పీహెచ్‌సీల్లో వాటి జాడే లేదు. గర్భిణులు, మాతా శిశువులు మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లో పారిశుధ్య పను లు చేపట్టాల్సి ఉండగా, వాటి ఛాయలు కూడా ఎక్కడా కనిపించడం లేదు. గ్రామాల్లో సరైన డ్రైనేజీ లేక ఎక్కడిక్కడ మురుగునీరు నిలిచిపోయి దోమల విపరీతంగా పెరు గుతున్నాయి. దీంతో సామాన్య ప్రజలతోపాటు గర్భిణులు, మాతా శిశువులు అనారోగ్యం పాలవుతున్నారు.

పోషకాహార లోపం

గర్భిణుల్లో రక్తహీనత, పోషణలోపాన్ని నివారించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అం దించటానికి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా.. ఆశించిన ఫలితాలు రావటం లేదు. ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం లేక గ్రామాల నుంచి 40, 50 కి.మీ. దూరంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులను గర్భిణులు సందర్శించినా అక్కడ కూడా మాతా శిశు మరణాలు ఆగడం లేదు. గర్భిణులు ముందస్తుగా ఆస్పత్రుల్లో చేరి ఎక్కువ రోజులు చికిత్స తీసుకుంటున్నా.. మరణాలు సంభవిస్తున్న ఘటనలు కూడా జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి. వారికి పరిస్థితులకు అనుగుణంగా వైద్యం అందకపోడం, అవసరమైతే ఇతర పెద్ద ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించి మెరుగైన వైద్యం అందేలా చూడకపోవడం ఇందుకు కారణమని తెలుస్తోంది.

అన్నీ కోతలే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ శస్త్ర చికిత్సలకు (సిజేరియన్లు) ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. గర్భిణులు, వారి కుటుంబసభ్యుల ఒత్తిడి, రిస్క్ తీసుకోవడమెందుకు అని డాక్టర్లు భావించడం వల్లనే కడుపు కోతలు ఎక్కువగా జరుగుతున్నాయి. సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యులు సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని జాతీయ, అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు చేసిన సూచనలు, ప్రభుత్వ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దీంతో సాధారణ ప్రసవాల సంఖ్య తగ్గిపోయి శస్త్రచికిత్సలు పెరిగిపోతున్నాయి. ప్రతీ తల్లి నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చేందుకు పడే కష్టం వర్ణనాతీతం. అలాంటి అమ్మ సాధారణ ప్రసవానికి నోచుకోలేకపోతోంది. కానులకు కక్కుర్తిపడే పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు చేసి బిడ్డలను బయటకు తీస్తున్నారు. ఈ పరిణామాలతో మాతా, శిశు మరణాలు సంభవిస్తున్నాయి. తల్లులు అనారోగ్యానికి గురవుతండగా పిల్లలు పాలకు దూరమవుతున్నారు.

శిశు మరణాల నివారణకు అవసరమైన వ్యాక్సీన్లు ఆస్పత్రుల్లో అందుబాటులో లేకపోవడం, ఉన్నా సకాలంలో వేయకపోవడం కూడా శిశుమరణాలకు కారణమవుతోంది. ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉంటుంది. హై రిస్క్ కేసుల్లో ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కూడా మాతా శిశు మరణాలు ఎక్కువ అవతున్నాయి.

ప్రసవాలు

హనుమకొండ జిల్లాలో ఈ యేడు ఇప్పటి వరకు 10,751 మంది గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో తమ పేర్లను నమోదు చేసుకోగా, వీరిలో సగం మంది 5,803 మంది డెలివరీ అయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 3,936, ప్రైవేటు ఆస్పత్రుల్లో 1,867 మంది ప్రసవించారు. ఒక మరణం సంభవించినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అయితే 2022 సంవత్సరంతో పోల్చితే మాతా శిశుమరణాలు తగ్గినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 2022లో ఏడు సంభవించగా, 2023-24లో ఒక్క మరణం కూడా సంభవించలేదు. 2024-25లో ఇప్పటివరకు ఒక మరణం చోటు చేసుకున్నది. అయితే అనధికారిక లెక్కలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో డెలివరీ అయినవారి సంఖ్యే అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. మాతా, శిశుమరణాలు సంభవించినా అవి అధికారికంగా నమోదు కావడం లేదు. ప్రైవేటు ఆస్పత్రులు మరణాలను దాచిపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయి. జిల్లాలో డాక్టర్లు పట్టించుకోపోవడం వల్లనే తల్లి లేదా బిడ్డ మరణించిన సంఘటనలపై కుటుంబ సభ్యులు, బంధువులు ప్రైవేటు ఆస్పత్రుల వద్ద ఆందోళన చేసిన ఉదంతాలు తరుచూ జరుగుతుండడమే ఇందుకు ఉదాహరణ.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- దశల వారీగా అర్హులకు ఇళ్ల కేటాయింపు
- జూమ్ మీటింగ్‌లో మంత్రి కొండా సురేఖ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా చేపట్టి నెలాఖరులోగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన ఇందిరమ్మ నోడల్ అధికారులు, ఇందిరమ్మ కమిటీలతో నిర్వహించిన జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో మంత్రి హైదరాబాద్ నుంచి మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న మహిళల వివరాలను సర్వేయర్లు అర్హుల వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో గత జనవరిలో నిర్వహించిన ప్రజాపాలనలో జిల్లాలో 2 లక్షల 33వేల 332 మంది మహిళలు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో గ్రామ పంచాయతీ, మునిసిపల్ స్థాయిలలో మొత్తం 393 ఇందిరమ్మ కమిటీలను, కమిటీలో ఏడుగురు సభ్యులను నియమించామన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, రేషన్‌కార్డు, సొంత ఇంటి స్థలం ఉన్నవారు, అద్దె ఇంట్లో ఉన్నవారు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ నెల 16 నుంచి 31వ తేదీలోగా సర్వే పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. వరంగల్ మహానగర పాలక సంస్థలోని 66డివిజన్లలో వార్డు ఆఫీసర్లకు యాప్‌లో వివరాల నమోదుపై శిక్షణ ఇచ్చామన్నారు. కచ్చితంగా సమాచారం సేకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ దశలవారీగా ఇళ్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. త్వరలోనే రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో జూమ్ మీటింగ్ ద్వారా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో పాటు కలెక్టరేట్‌లో నర్సంపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజిత, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జడ్పీ సీఈవో రామిరెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని

టోకరా

- పలువురి వద్ద రూ.కోటికి పైగా వసూలు
- లబోదిబోమంటున్న బాధితులు

6



మోసం చేసిన వ్యక్తులతో రాంకుమార్

నియోజకవర్గ అభివృద్ధి

కోసం కృషి చేద్దాం..

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- హనుమకొండ, వరంగల్ కలెక్టర్లతో సమీక్షా సమావేశం

6



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి

ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల దీక్షలు ఉధృతం

- ఉద్యోగసంఘాల మద్దతు, ప్రతిపక్షాల సంఘీభావం
- అమరణ నిరాహార దీక్షల వైపు నాయకుల దృష్టి

హనుమకొండ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం సర్వశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు చేస్తున్న దీక్షలు ఉధృతమవుతున్నాయి. ఏకశిలాపార్కు వద్ద 8వ రోజుకు చేరుకున్న దీక్షల్లో కేజీబీవీ ఉపాధ్యాయులు, సీఆర్పీలు, పీటీఐలు, ఎంఐఎస్‌లు, ఐఈఆర్పీలు, స్కావెంజర్‌లు శుక్రవారం పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలను అందించారు. ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులైజ్ చేయాలని, అప్పటి వరకు మినిమం టైంస్కేల్ (ఎంటీఎస్) ఇవ్వాలనే ప్రధాన లక్ష్యంతో దీక్షలు చేస్తున్నట్లు జాక్ ఛైర్మన్ దొనికెల శ్రీధర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. లేకుంటే అమరణ నిరాహార దీక్షకు కూర్చుంటామన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా తమ వేతనాలు పెరగకపోవటంతో ఆర్థిక ఇబ్బందులు, అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. విద్యాశాఖకు క్షేత్రస్థాయిలో అన్ని పనులు చేస్తూ అండగా నిలుస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోకపోవటం బాధాకరం అన్నారు. కాగా, దీక్షలకు పలు ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు తెలుపగా, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. సర్వశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గతంలో రేవంత్‌రెడ్డి ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలుపుకోవాలని సూచించారు.



ఎస్ఏ కాంట్రాక్టు ఉగ్యోగులకు సంఘీభావంగా దీక్షలో కూర్చున్న మాజీ ఎమ్మెల్యే వినయభాస్కర్

వాహనాల మరమ్మతులో

వేగం పెంచండి

- మేయర్ గుండు సుధారాణి



బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డును తనిఖీ చేస్తున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 13: వాహనాల మరమ్మతులో జాప్యం జరుగకుండా వేగం పెంచి డ్రైవర్లకు అందించాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. బాలసముద్రంలో వరంగల్ మహానగరపాలక సంస్థ నిర్వహిస్తున్న వెహికిల్‌షెడ్డును శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. సమగ్ర చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగాలంటే రవాణా వ్యవస్థ సక్రమంగా ఉండాలన్నారు. మరమ్మతుల కోసం షెడ్డుకు వచ్చే వాహనాలను త్వరితగతిన రిపేరు చేసి పంపించాలన్నారు. వాహనాల రిపేరు కాంట్రాక్టర్ సరిగా స్పందికపోతే నోటీసులు జారీ చేసి కాంట్రాక్టు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. షెడ్డులో ఉన్న స్క్రాప్‌ను వెంటనే తొలగించాలన్నారు. చెత్తను తరలించే వాహనాలకు ట్రాకింగ్ సిస్టంను అమర్చి నూతనంగా ఏర్పాటు చేసే యాప్‌కు అనుసంధానం చేయాలన్నారు. మెకానిక్‌లకు డ్రెస్‌కోడ్‌తో పాటు హెల్మెట్‌లు అందించాలన్నారు. షెడ్డు నిర్వాహణను సీఎంహెచ్‌వో, ఎస్ఈలు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, కాజీపేట డీసీ రవీందర్‌రెడ్డి, ఈఈలు మహేందర్, సంతోష్‌బాబు, డీఈలు శివానంద్, ఏఈ ఫణికుమార్‌తో పాటు స్మార్ట్ సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

2025 ఆగస్టు నాటికి కోచ్‌ఫ్యాక్టరీ పూర్తి

- రూ.720 కోట్లతో నిర్మాణం
- ఇప్పటికే 50 శాతం పనులు పూర్తి
- రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్
- కోచ్‌ఫ్యాక్టరీ పనులు పరిశీలించిన రైల్వే జీఎం



కోచ్‌ఫ్యాక్టరీ పనులను పరిశీలిస్తున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

కాజీపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రూ.720 కోట్లతో కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం పనులు 2025 ఆగస్టు నాటికి పూర్తవుతాయని రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ చెప్పారు. కాజీపేట అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ పనులను శుక్రవారం డీఆర్ఎం భరతేష్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడారు. కోచ్‌ఫ్యాక్టరీ పనులు ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. కాజీపేటలో నిర్మిస్తున్న కోచ్‌ఫ్యాక్టరీ అన్ని కోచ్‌ఫ్యాక్టరీలో ఇది అధునాతనమైన, అతిపెద్దదన్నారు. ఈ కోచ్‌ఫ్యాక్టరీలో అన్నిరకాల మెమో కోచ్‌లు, ఎంఎంటీఎస్, వందేభారత్‌తో పాటు ఇతర అధునాతనమైన కోచ్‌లు, ఇంజన్‌లు తయారు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ట్రాక్‌లను, షెడ్‌లను పరిశీలించారు. నిర్మాణ పనులు శరవేగంగా జరగాలని రైల్వే అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అంతకుముందు రైల్వే ఉన్నతాధికారులతో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీ పనులు ఇతర అంశాలపై రైల్వే అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఆ తర్వాత కాజీపేట రైల్వే స్టేషన్, ప్లాట్ ఫారాలు, లాబీ, రన్నింగ్ రూంలు పరిశీలించారు. జీఎం వెంట సీఎంపీఈ మధుసూదన్ రావు, సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) డి.రామారావు, సీనియర్ డీఎస్‌టీ ప్రియా అగర్వాల్, సీనియర్ డీసీఎం వై.బాలాజీ కిరణ్ తోపాటు అన్ని డిపార్ట్‌మెంట్‌ల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

రైల్వే జీఎంకు వినతి

కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, రైల్వే ఆస్పత్రిని సబ్ డివిజన్ ఆస్పత్రిగా ఉన్నతీకరించాలని కోరుతూ టీరైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావులు రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతి ప్రతంలో కాజీపేట టౌన్‌స్టేషన్‌ను రైల్వే కారిడార్‌గా ఉన్నతీకరించాలని, ఎలక్ట్రిక్ పీవోహెచ్‌ను నిర్మించాలని, ఇనిస్టిట్యూట్ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ వినతి ప్రతం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జేఏసీ కో-కన్వీనర్లు డి.రవీందర్, పి.రమేశ్, జి.భాస్కర్, ఎస్. లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్‌లు అనుమాల శ్రీనివాస్, టి.ప్రవీణ్, ఎం.మహేశ్, కె.ఉదయ భాస్కర్ ఉన్నారు.

రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని దగ్గర చేయాలి

- తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి
- ఆర్ఏఆర్ఎస్‌లో ఘనంగా తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయ వజ్రోత్సవాలు



వేడుకల్లో మాట్లాడుతున్న కోదండరెడ్డి

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాస్త్రవేత్తలు నిత్యం పరిశోధనలు చేస్తూ రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని దగ్గర చేయాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి అన్నారు. శుక్రవారం వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్ఏఆర్ఎస్)లో వరంగల్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయ వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కోదండరెడ్డి హాజరై మాట్లాడారు. శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు నూతన వంగడాలను రూపొందిస్తున్నందుకు, అలాగే అధునిక హంగులతో కూడిన వ్యవసాయాన్ని రైతులకు చేరువ చేసేందుకు విద్యార్థులను తీర్చి దిద్దుతున్నందుకు అధ్యాపకులను అభినందించారు. అనంతరం వరంగల్ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు ఆర్.ఉమారెడ్డి మాట్లాడుతూ.. 60 ఏళ్లుగా శాస్త్రవేత్తలు రూపొందించిన నూతన వంగడాలు, సాంకేతికలు, సాధించిన విజయాలను వివరించారు. అలాగే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. తదుపరి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.బలరామ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అందిస్తున్న విద్యా నైపుణ్యాలు, వివిధ సౌకర్యాలు, పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత శాస్త్రవేత్త ఎల్.జలపతిరావు, పద్మవేణి, భూపాల్‌రాజు, సంతోష్‌రావు, టి.రాణాప్రతాప్, జె.శోభారాణి, రైతులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ పూర్తిగా చేయలేదు

రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి మాట్లాడుతుండగా కొందరు అభ్యుదయ రైతులు లేచి అభ్యంతరం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేశామని చెబుతున్నది అబద్ధమని, కేవలం 60శాతం రైతులకే రుణమాఫీ అయిందని అన్నారు. ముందు వందశాతం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాగా, సాంకేతిక లోపాలతో కొందరికి రుణమాఫీ కాలేదని, అలాంటి వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని కోదండరెడ్డి చెప్పడంతో శాంతించారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేద్దాం..

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- వరంగల్, హనుమకొండ కలెక్టర్లతో సమీక్షా సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 13: (ఆంధ్ర జ్యోతి): పరకాల నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంద ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. వరంగల్ కలెక్టరేట్‌లో శుక్రవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదలతో కలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం సహకార మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి సోలార్ పవర్ ప్లాంట్, డెయిరీఫామ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో మహిళలకు కుట్టుశిక్షణ ఇస్తూ ఉపాధి కల్పించేలా రెండు జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద మాట్లాడుతూ.. జనవరి 7వ తేదీన టెక్స్‌టైల్ పార్కులో కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి పరకాల నియోజకవర్గం నుంచి 500 మందిని ఎంపిక చేయాలన్నారు. అదేవిధంగా జిల్లాలో పాడి గేదెల నివేదికలను సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పరకాల ఆర్డీవో నారాయణ, వరంగల్, హనుమకొండ డీఆర్‌డీవోలు కౌసల్యాదేవి, ఎం.శ్రీనివాస్, ఎల్‌డీఎం రాజు, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైనింగ్ వివరాలు సమర్పించాలి

జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న, మూసివేసిన మైనింగ్ కంపెనీల వివరాలు కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో మైనింగ్ శాఖ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మైనింగ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఆర్డీవోలు, సీపీ, మైన్స్ అండ్ జువాలజీ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు తదితర శాఖ అధికారులతో కమిటీలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మైనింగ్ అనుమతులపై కమిటీలు నివేదికలు తయారు చేసి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిన సందర్భంగా ఈ నెల 14 ఆయా విద్యాలయాల్లో నిర్వహించే కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సత్యశారద, మైనింగ్ ఏడీ రవిశంకర్, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

హసన్‌పర్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్క లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పెంబర్తిలో ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటి సర్వేను స్వయంగా పరిశీలించి ఫోన్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు అడిగిన పలు సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో అర్హులైన వారందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, రెండవ దశలో ఇంటి స్థలం లేనివారికి ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జిల్లా హౌసింగ్ నోడల్ ఆఫీసర్ రాజేందర్, ఎంపీడీవీ జె.ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు చల్ల ప్రసాద్, ఎంపీవో కట్ల కరుణాకర్‌రెడ్డి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ చైర్మన్, ప్రత్యేక అధికారి నాగవల్ల శ్రీనివాస్, కమిటీ కన్వీనర్ పరకాల హేమలత, సభ్యులు జోరుక పూల, రమాదేవి-రమేష్, గోపాల్, సునిల్, సుధాకర్, కారోబార్ సదానందం పాల్గొన్నారు.

అల్లు అర్జున్‌కు సీఎం క్షమాపణ చెప్పాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హనుమకొండ టౌన్ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యం, పోలీసుల వైఫల్యంతోనే సినియా థియేటర్ వద్ద పోలీసులు భద్రత కల్పించకపోవడంతో తొక్కిసలాటలో నిండు ప్రాణం పోయిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కక్షసాధింపు చర్యతో అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఈ విషయంలో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రభుత్వం అల్లుఅర్జున్‌పై పెట్టిన కేసును వెనక్కు తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఉక్కు ఆశలు.. ఆవిరేనా?

- ఎండమావిగా బయ్యారం ఐరన్‌ఓర్ కర్మాగారం
- కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో ఏజెన్సీలో తీవ్ర నిరాశ
- పోరాటాలకు సిద్ధమవుతున్న సాధన కమిటీ

బయ్యారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం మండలంలో ప్రభుత్వ రంగ సంస్థ ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై ఆశలు ఆవిరైనట్టేనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు తాజాగా కేంద్రం పార్లమెంట్ వేదికగా చేసిన ప్రకటన అందరినీ నిరాశకు గురిచేసింది. దశాబ్ద కాలంగా సర్వేలతో కాలయాపన చేస్తూ వచ్చిన కేంద్రప్రభుత్వం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యం కాదని పేర్కొనడంతో స్థానికంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ఎండమావిగా మారిన ఉక్కు కర్మాగారాన్ని సాధించుకునేందుకు సాధన కమిటీ పోరాటాలకు సిద్ధమవుతోంది.

ఉద్యమానికి ఉత్ప్రేరకంగా..?

'బయ్యారం ఉక్కు.. తెలంగాణ హక్కు..' అంటూ మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాలకు ఉత్ప్రేరకంగా మారిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై నాడు యూపీఏ ప్రభుత్వం స్పందించింది. ఈ అంశాన్ని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచ్చింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 13వ షెడ్యూల్‌లో బయ్యారం మండలంలో స్టీల్ అథారటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ఆధ్వర్యంలో రూ.36వేల కోట్ల వ్యయంతో ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పుతామంటూ విభజన చట్టంలో పేర్కొన్న విషయం తెలిసిందే. కానీ, నేటికి దశాబ్ద కాలం గడిచినా కార్యరూపం దాల్చకపోవడంతో ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు దక్కక యువకులు, నిరుద్యోగులు తల్లడిల్లుతున్నారు. అంతేకాక విభజన చట్టానికి భిన్నంగా బయ్యారంలో ఉక్కు కర్మాగారం నెలకొల్పడం సాధ్యం కావడంలేదని, ఖనిజం నాణ్యత లేదంటూ ఇటీవల లోక్‌సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించడంతో ఉక్కుకర్మాగారం ఆశలు అడుగంటాయి. దీంతో స్థానికంగా తీవ్ర ఆవేదన నెలకొంది. కేవలం సమీక్షలు, సర్వేల పేరుతో కాలయాపన మినహా కర్మాగారం ఏర్పాటుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

దాదాపు 30 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ఆశతో దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న స్థానిక ప్రజానీకానికి తాజా ప్రకటనతో మింగుడు పడటంలేదు. ఓ పక్క విశాఖ ఉక్కు ఫ్యాక్టరీనే కేంద్రప్రభుత్వం అమ్మకానికి పెడుతుండటం.. మరోపక్క బయ్యారం కర్మాగారం సాధ్యం కాదంటూ ప్రకటన చేయటంతో పాలుపోని స్థితిలో స్థానికులున్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం స్పందించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని బయ్యారంలో ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో స్టీల్ ఫ్యాక్టరీ నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఫ్యాక్టరీ లాభసాటి!

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీతో పోలిస్తే బయ్యారం ఉక్కు కర్మాగారం లాభసాటిగా ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. విశాఖ కర్మాగారానికి ముడి


బయ్యారంలో వెలికితీసిన ఇనుప ఖనిజం (ఫైల్)

ఖనిజంతో పాటు డోలమైట్, బొగ్గు, విద్యుత్ వనరులను తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కానీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పూర్తిస్థాయిలో ఇనుప ఖనిజం లభ్యమవుతుందని గతంలో మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ) గుర్తించిన సంగతి తెలిసిందే. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల పరిధిలో 56,690 హెక్టార్ల భూముల్లో ఇనుప ఖనిజం నిల్వ ఉన్నట్లు ఎన్‌ఎండీసీ గతంలో గుర్తించింది. దీంతో పాటు బయ్యారానికి 50 కిలోమీటర్ల పరిధిలోనే సింగరేణి కాలరీస్ బొగ్గు, మదారం డోలమైట్ ఖనిజం, మూడు జిల్లాల పరిధిలో ఇనుపఖనిజం లభ్యం కావడంతో పాటు అత్యంత సమీపాన రైలు మార్గం, విద్యుత్, నీటి సౌకర్యాలు అందుబాటులో ఉండటం, భూమి సైతం సమృద్ధిగా ఉండటం లాంటి సానుకూల అంశాలు ఉన్నా కేంద్రప్రభుత్వం విముఖత చూపటం పట్ల తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక బయ్యారంలో ఉక్కు కర్మాగారానికి ముడి ఇనుప ఖనిజాన్ని సమీపంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్‌పూర్ ఏరియా బైలడిల్లా నుంచి 180 కిలోమీటర్ల రైలు మార్గం ఏర్పాటు చేసుకొని దిగుమతి చేసుకొనే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

సెయిల్ వెనకడుపై విస్మయం..

తెలంగాణ ప్రజాప్రతినిధులు ప్రధానమంత్రిని, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను ఎన్ని పర్యాయాలు కలిసినా వారిమొర అరణ్యరోధనగానే మారింది. జీయాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెయిల్, సింగరేణి, కేంద్ర పరిశ్రమల శాఖ మెకాన్ సంస్థలు సర్వేలు, చేయడం ఫ్యాక్టరీ ఏర్పాటుకు డీపీఆర్‌లు రూపొందించినా సెయిల్ కర్మాగారం నెలకొల్పడానికి వెనుకడుగు వేయటం నాణ్యత తక్కువ ఉందంటూ సాకులు చెప్పడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే తాజాగా పార్లమెంట్ వేదికగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా సెయిల్ నిర్ణయాన్ని బలపరిచేలా ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పడం సాధ్యం కాదంటూ ప్రకటించడం ఈ ప్రాంత వాసుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి బయ్యారం ఇనుప ఖనిజం తక్కువ నాణ్యత కలిగి ఉంటే గతంలో ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు బయ్యారం ఇనుప ఖనిజం కోసం ఎందుకు వెంపర్లాడారాని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు బయ్యారం ఇనుప ఖనిజం కోసం అర్రులు చాస్తుండగా.. సెయిల్ ఎందుకు వెనకడుగు వేస్తుందన్న ప్రశ్నలు చర్చనీయాంశమైయ్యాయి.

రూ. 500 కోట్ల ఖనిజం తరలింపు..!

2004 నుంచి 2009 వరకు దాదాపు ఐదేళ్ల పాటు బయ్యారం ప్రాంతం నుంచి ప్రైవేట్ సంస్థలు సుమారు రూ.500 కోట్లు విలువ చేసే ఇనుప ఖనిజాన్ని తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబీకులు రక్షణ స్టీల్స్ పేరుతో మూడు జిల్లాల పరిధిలో ఇనుప ఖనిజం ఉన్న దాదాపు రెండు లక్షల ఎకరాల భూములు ఎందుకు కేటాయింపజేసుకున్నారని? ఎందుకు కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు లక్షలాది టన్నుల ఖనిజ సంపదను తరలించుకుపోయారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 30వేల మందికి ఉపాధి లభిస్తుందన్న ఆశతో ఉక్కు కర్మాగారం కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు. కేంద్రం వెనుకడుగు వేయటంతో ప్రైవేట్ రంగ ఉక్కు ఉత్పాదక సంస్థలు బయ్యారంలో ఉక్కు కర్మాగారం నెలకొల్పేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. గతంలో జిందాల్ లాంటి సంస్థల ప్రతినిధులు బయ్యారం ఖనిజ సంపదను పరిశీలించి, వెళ్లడమే అందుకు ఉదాహరణ. అంతేకాక ఇటీవల సైతం రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం బయ్యారం ఇనుపఖనిజ సంపద కర్మాగారం అంశాలపై నివేదిక కోసం సంబంధిత శాఖలను కోరినట్లు తెలిసింది.

ఉక్కు సాధన పోరాటాన్ని ఉధృతం చేస్తాం

కేంద్రప్రభుత్వ నిర్ణయం సమంజసం కాదు. కుంటి సాకులతో ఉక్కు పరిశ్రమను నిరాకరిస్తోంది. ఉక్కు కర్మాగారం కోసం మా పోరాటాన్ని ఉధృతం చేస్తాం. వనరులు పుష్కలంగా ఉన్నా బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ సాధ్యం కాదంటూ రాతపూర్వకంగా పేర్కొనడం హాస్యాస్పదం. విభజన చట్టంలో ముడి ఖనిజ నిల్వల ప్రస్తావనే రాలేదు. ఉక్కుపరిశ్రమ స్థాపనకు ఖనిజ నిల్వలకు సంబంధమే లేదు. ముడిఖనిజ నిల్వలు ఏం ఉన్నాయని విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేశారు. అక్కడి కంటే బయ్యారానికే తక్కువ దూరం నుంచి ఖనిజాన్ని దిగుమతి చేసుకోవచ్చు. బయ్యారం ఉక్కు పరిశ్రమ తెలంగాణ ప్రజలు సాధించుకున్న చట్టబద్ధమైన హక్కు. అది సాధ్యం కాదని ప్రకటించే హక్కు, అధికారం కేంద్ర ప్రభుత్వానికి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేదు. విభజన హామీ అమలుకు కృషి చేయాల్సిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యం కాదని పార్లమెంట్ వేదికగా ప్రకటించడం బాధ్యతా రాహిత్యమే. కేంద్రం స్పందించి బయ్యారంలో స్టీల్ పరిశ్రమ నెలకొల్పకపోతే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు.



-గౌని ఐలయ్య, ఉక్కు పరిశ్రమ సాధన కమిటీ కన్వీనర్

సరస్వతీ పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయండి

- భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు..
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

మహదేవపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నదీ పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని, వచ్చే ఏడాది జరిగే ఈ పుష్కరాలకు రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రం భక్తులు కూడా వస్తారని, వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంతి కొండా సురేఖ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది పుష్కరాలు రానున్న నేపథ్యంలో నిర్వహణకు అధికారులు అంచనా నివేదికలు తయారు చేసి పంపాలన్నారు. దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, సమాచార, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలు అవసరమయ్యే అంచనాలు తయారు చేయాలన్నారు. స్నాన ఘట్టాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

గత పుష్కరాలకు 30వేల మంది భక్తులు వచ్చారని, ఈసారి 50వేల మంది భక్తులు వచ్చే అవకాశమునట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రస్తుతం ఉన్న వారితో పాటు పుష్కరాలు జరిగే కాల పరిమితికి ప్రత్యేకంగా కొందరిని నియమించాలని కలెక్టర్, ఈవోను ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా ఇతరత్రా పనులన్నీ సక్రమంగా ఉండాలన్నారు. 12 రోజుల పాటు జరిగే ఈ పుష్కరాలకు ప్రతీ రోజు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయమై పనిచేయాలని, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తనకు నేరుగా తెలియజేయాలన్నారు. ఈ రివ్యూలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్, శ్రీధర్, తెలంగాణ టూరిజం కార్పొరే షన్ ఎండీ ప్రకాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, కాళేశ్వరం ఆలయ ఈవో మారుతి తదితరులు పాల్గొన్నారు.


రివ్యూలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

పనిచేయని ఎక్స్ రే యంత్రాలు

- దురుసుగా సమాధానం చెబుతున్న సిబ్బంది

వరంగల్ మెడికల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎంలో ఎక్స్‌రే యంత్రాలు పని చేయడం లేదు. వివిధరకాల రోగ నిర్ధారణ కోసం ఎక్స్‌రే తప్పనిసరిగా అవసరం అవుతుంటాయి. ఇక ఆర్థో విభాగంలోనైతే ఎక్స్‌రే లేనిదే ఎలాంటి చికిత్స అందించడం వీలుకాదు. రోగ నిర్ధారణలో ఇంత ప్రతిష్ఠాత్మకంగా మారిన ఈ పరీక్షలకు సంబంధించిన యంత్రాలు పనిచేయడం లేదు. రోజూ వందలాదిమంది రోగులతో కిటకిటలాడే ఎంజీఎం ఆస్పత్రి రూమ్ నెంబరు 92లో ఈ మిషన్లు ఉన్నాయి. శుక్రవారం ఉదయం రోగులు ఈ పరీక్షల కోసం రాగా, అక్కడ పనిచేసే సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని రోగులు వాపోతున్నారు. కనీసం ఎప్పటివరకు యంత్రాలు మరమ్మతు అవుతాయని కూడా చెప్పడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఎక్స్‌రే సేవలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తాడ్వాయి - మంగపేట అడవుల్లోనే పెద్దపులి

- పాదముద్రలను పరిశీలించిన కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్
- పరిసర గ్రామాల్లో భయంభయం


తాడ్వాయి అడవుల్లో పెద్దపులి పాదముద్రలను పరిశీలిస్తున్న సిబ్బంది

తాడ్వాయి/మంగపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజుల క్రితం మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి ములుగు జిల్లాలోకి ప్రవేశించిన పెద్దపులి తాడ్వాయి - మంగపేట అడవుల్లో సంచరిస్తోంది. అది రెండు రోజులుగా తాడ్వాయి మండలం పంబాపూర్-దామెరవాయి, మంగపేట మండలం కొత్తూరు మొట్లగూడెం పరిసర అటవీ ప్రాంతంలో తిరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. మూడు రోజుల పాటు సుదీర్ఘ ప్రయాణం చేసిన పులి శుక్రవారం ఒకే ప్రాంతంలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. పంబాపూర్-దామెరవాయి, కొత్తూరు మొట్లగూడెం మధ్యలోని గుట్టలు, వాగుల వెంట సంచరిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు గుర్తించారు. కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శుక్రవారం అడవుల్లోకి వెళ్లారు. నీటి తావుల వద్ద పులి పాదముద్రలను వారు గుర్తించారు. ఒకరోజు ముందే పులి అక్కడికి వచ్చివెళ్లినట్టు నిర్ధారించుకున్నారు. ఇప్పటికే ఆరు ప్రత్యేక బృందాలు పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండగా రెండు రోజులుగా పంబాపూర్ అడవుల్లోనే మకాం వేయడంతో అప్రమత్తమయ్యారు. అయితే శుక్రవారం సాయంత్రం పక్కనే ఉన్న మంగపేట మండల పరిధిలోకి వచ్చే కొత్తూరు మొట్లగూడెం అడవుల్లో పులి సంచరిస్తున్నట్లు అక్కడి ప్రజలు భయాందోళన వ్యక్తం చేశారు. చీపురుపుల్లల సేకరణకు అడవిలోకి వెళ్లిన ఓ వృద్ధుడు పొట్టయ్యకు గండిఒర్రె ప్రాంతంలో పెద్దపులి తారసపడడంతో భయంతో వణికిపోయిన అతడు గ్రామంలోకి పరుగెత్తాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు వాస్తవాలను పరిశీలిస్తున్నారు. పులి సంచరిస్తోందని, ఒంటరిగా అడవిలోకి, పొలాల వద్దకు వెళ్లవద్దంటూ కొత్తూరు మొట్లగూడెం జీపీల ఆధ్వర్యంలో చాటింపు వేయించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని టోకరా

కాశిబుగ్గ, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఎంపీ కోటాలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయగాళ్లు విసిరిన వలలో పడి కొందరు మోసపోయారు. ఆలస్యంగా విషయం తెలుసుకొని లబోదిబోమంటున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై కాశిబుగ్గకు చెందిన బాధితుడు గడ్డం రాంకుమార్ శుక్రవారం మీడియాకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

శివనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ సముద్రాల పూర్ణచందర్, ఆర్టీసీ కండక్టర్ దయాకర్, అరుణ్ ఈ ముగ్గురు కలిసి ఎంపీ కోటాలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 2019లో ప్రచారం చేశారు. వీరి మాటలు నమ్మిన రాంకుమార్‌తో పాటు జనగామకు చెందిన శ్రీనివాస్, మేడ్చల్‌కు చెందని లక్ష్మీనారాయణ, గుంటూరు, కడపకు చెందిన మరికొందరు కొంత డబ్బు నేరుగా ఇవ్వగా మరికొంత ఆన్‌లైన్ ద్వారా పంపించారు. వారిలో రాంకుమార్ రూ.4లక్షల నగదు, రూ.12లక్షలు ఆన్‌లైన్ ద్వారా పంపించారు. మిగతా వారి వద్ద కూడా రూ.20 నుంచి రూ.25లక్షల వరకు వసూలు చేశారు.

అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఐడీ కార్డులు ఇచ్చారు. కాశీలో 7నెలల శిక్షణ ఉంటుందని చెప్పి అక్కడినుంచి కాశీకి తీసు కెళ్లారు. శిక్షణ అనంతరం కొద్ది రోజులకు ఆఫర్ లెటర్ ఇచ్చి కొద్ది రోజుల్లోనే పోస్టింగ్స్ వస్తాయని నమ్మించి అక్కడి నుంచి పంపించారు. తర్వాత కొవిడ్ కారణంతో కొన్నేళ్లు నెట్టుకొచ్చారు. ఆ తర్వాత ఎన్ని రోజులైనా పోస్టింగ్ రాకపోవడంతో అనుమానం వచ్చి డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే మాయమాటలతో దాటవేస్తూ వచ్చారు. దీంతో విసుగు చెంది 2023లో బాధితులు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉంది. మరోవైపు కొద్ది రోజుల కిందట పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన ఏసీపీ వద్దకు పంపించారు. ఏసీపీ సూచన మేరకు మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదుగురి వద్ద సుమారు రూ.కోటికి పైగా వసూలు చేసి దర్జాగా రోడ్లపై తిరుగుతున్నా మాకేం న్యాయం జరగడం లేదని వాపోయారు. ఇదిలా ఉండగా బాధితుల్లో ఒకరైన జనగామకు చెందిన శ్రీనివాస్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. మరో బాధితుడు లక్ష్మీనారాయణ ఆరోగ్యం క్షీణించింది. ఇప్పటికైనా అటు కోర్టు, ఇటు పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

చిక్కడపల్లిలో కేసు నమోదైంది : మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన ఘటనపై హైదరాబద్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శివనగర్‌కు చెందిన వ్యక్తి మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలోని వ్యక్తి అయినందున మమ్మల్ని ఆశ్రయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.



ఆరోగ్య అమాత్యా.. నన్ను పట్టించుకోండి..

అయ్యా.. ఆరోగ్య మంత్రి గారూ.. మీరు బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయింది. కానీ నావైపు ఒక్కసారి కూడా కన్నెత్తి చూడలేదు. ఉత్తర తెలంగాణాలోనే పెద్ద ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన నేను అనేక సమస్యలతో సతమతం అవుతున్నాను. ఉమ్మడి వరంగల్‌జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా ఎంతో మంది వైద్యం కోసం వస్తుంటారు. కానీ అరకొర సౌకర్యాలతో నా ఘనచరిత్ర మసకబారుతోంది. రోగుల సంఖ్య పెరుగుతున్నా.. పడకల సంఖ్య పెరగడం లేదు. కనీసం పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌ను కూడా నియమించలేదు. దీంతో రోగులకు అందించే వైద్య సేవలను పర్యవేక్షించే వారు లేరు.

ఇక వైద్య ఆరోగ్య శాఖలో జరిగిన బదిలీలు నా సేవల ను మరింత దిగజార్చాయని అందరూ అంటున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిపోయే వైద్యులు నామమాత్రంగా సేవలు అందిస్తున్నారని రోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు రోగనిర్ధారణలో కీలకమైన వైడల్ టెస్టులు, ఎక్స్‌రే తీసే మిషన్లు పనిచేయకపోవడం వారికి పెద్ద శాపంగా మారింది. చివరకు పేద రోగులు నన్ను అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం నాపై దృష్టి పెట్టి గతంలో మాదిరిగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా.. నా ఘన చరిత్రను కాపాడేలా.. చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

ఇట్లు
ఎంజీఎం ఆస్పత్రి,
- వరంగల్ మెడికల్, ఆంధ్రజ్యోతి

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2427	2080
పల్లికాయ (సూక)	4320	4000
పల్లికాయ (పచ్చిది)	5850	5500
కందులు	-	-
పెసళ్లు	5666	5000
పత్తి	7010	5800
పసుపు (కాడి)	10899	10000
పసుపు (గోల)	10729	10500
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	15561	12000
తేజ ఏసీ	15500	14000
వండర్‌హాట్ ఏసీ	13000	11000
యూఎస్341ఏసీ	14500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని లష్కర్‌బజార్, కిషన్‌పుర ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, హన్‌మాన్‌నగర్, డబ్బాల ఏరియా, సగర కాలనీ, కేయూ ఫస్ట్ గేట్ ఏరియాలో ఉదయం 8.30 నుంచి 11.30 వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూశాయంపేట ఏరియాలో 11.30 నుంచి 2.30 వరకు, న్యూశాయంపేట, బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకు, ఆర్ఈసీ, వెస్ట్‌సిటీ, సోమిడి, మడికొండ, రాంపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదన్నారు.

● హసన్‌పర్తి: సబ్ స్టేషన్‌ల మెయింటెన్స్ సందర్భంగా ఎల్లాపూర్, నాగారం, దేవన్నపేట, మల్లారెడ్డిపల్లి ప్రాంతాలలో సబ్ స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ రూరల్ డీఈ బి.సామ్యానాయక్ తెలిపారు.

● వరంగల్ టౌన్: విద్యుత్ మరమ్మతుల కారణంగా వరంగల్ సీకేఎం కాలేజీ, లక్ష్మీ మెగా టౌన్‌షిప్, రంగనాయకస్వామి ఆలయ ప్రాంతం, గ్రీన్ సిటీ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటల వరకు, బొల్లికుంట సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నారు. ఈ మేరకు డీఈ శంకేసి మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

హెల్పింగ్ హ్యాండ్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజు

కాశిబుగ్గ, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా బొంగోని రాజు గౌడ్ నియమితులైనారు. కాశిబుగ్గకు చెందిన ఆయనకు సంస్థ వ్యవస్థాపకుడు శివరామకృష్ణ నియామక ప్రతిని శుక్రవారం అందించారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన సంస్థ వార్షికోత్సవంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.

రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో సర్వే చేస్తాం

వరంగల్ సిటీ, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో సర్వే చేయించి అర్హులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని వరంగల్ తహసిల్దార్ ఎండి. ఎక్బాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఆర్ నగర్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో ప్రాథమిక విచారణ చేయించామని, మరో రెండు రోజుల్లో పోలీసుల సహకారంతో మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, కార్యాలయ సిబ్బందితో స్థల పరిశీలన చేయిస్తామని తెలిపారు.

మాదిగ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ

కేయూ క్యాంపస్ డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మాదిగ ఉద్యోగుల సంఘం (ఎంఈఎఫ్) నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పోడేటి శ్రీనివాస్, సుజాత ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి.సుమన్, ఎం.ప్రవీణ్, నర్మెట్ట అయిలయ్య, కొట్టే విజయలక్ష్మి, కార్యదర్శులుగా డి.స్వాయిప్రసాద్, ఎస్.మహర్షి, కె. ఎమీలీయా, మహిళ కార్యదర్శిగా ఎస్.పద్మావతి, సహాయ కార్యదర్శులుగా ఎం.బాబు, దేవమ్మ, కోశాధికారిగా ఎస్.సుమన్, కార్యవర్గ సభ్యులుగా డి.దేవదాసు, డి.సాగర్, ఎం.శ్రీనివాస్, బి.గట్టయ్య, డి.రణధీర్, ఎం.నవీన్, ఇ.నాగరాజు, కుమార్, శోభన్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఎన్నికయ్యారు.

టెన్నికాయిట్ పోటీలను పునః ప్రవేశపెట్టాలి

కేయూ క్యాంపస్ డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేయూలో టెన్నికాయిట్ క్రీడను పునఃప్రవేశపెట్టాలని కోరుతూ హనుమకొండ జిల్లా టెన్నికాయిట్ అసోషియేషన్ నేతలు శుక్రవారం కేయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. అంతర్ కళాశాలల పోటీలతో పాటు ఆల్ ఇండియా స్థాయిలోనూ టెన్నికాయిట్ పోటీలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోషియేషన్ అధ్యక్షకార్యదర్శులు అంబేద్కర్, రాజ్‌కుమార్, వై.సురేందర్, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే నాయిని

వడ్డేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ గోకుల్ నగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో 106 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 75 మంది లబ్ధిదారులకు రూ. 29,99,500 సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చాలా పథకాల్లో రాజకీయ లబ్ధికోసం అమలు చేశారని అన్నారు. ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ తహసీల్దార్ కె.శ్రీపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, చెన్నం మధు, మామిండ్ల రాజు, ఏనుగుల మానస రాంప్రసాద్, జక్కుల రవీందర్, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, కాంగ్రెస్ శ్రేణులు బంక సరళ సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, ఎనుకొంటి పున్నం చందర్, తేళ్ల సుగుణ కిశోర్, మండల సమ్మయ్య, ఎమ్డీ అక్మల్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి..

హనుమకొండ కలెక్టరేట్: క్రిస్మస్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లపై పాస్టర్లు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పండుగరోజు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

ఎమ్మెల్యేకు తులాభారం వేసిన వ్యాపారులు..

హనుమకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలోని వివిధ వాణిజ్య సముదాయాలకు చెందిన సమస్యలను పరిష్కరించిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి శుక్రవారం హనుమకొండ చౌరస్తాలోని సీసీ రెడ్డి కాంప్లెక్స్‌లో లడ్డు, యాపిల్ పండ్లతో తులభారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగర ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. చౌరస్తాలోని సీపీ రెడ్డి కాంప్లెక్స్ నుంచి జీవన్‌లాల్ కాంప్లెక్స్ వరకు ఉన్న పుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగించడంతో వ్యాపారులు హర్షం చేశారని తెలిపారు.

బీజేపీ నాయకుల ధర్నా

లగచర్ల రైతుకు బేడీలు వేసిన ఘటనపై ఆగ్రహం


ధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కరీమాబాద్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): రిమాండ్‌లో ఉన్న లగచర్ల రైతు ఛాతి నొప్పితో బాధపడుతుంటే బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లిన ఘటనను వ్యతిరేకిస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు ధర్నాకు దిగారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బైరి నాగరాజు ఆధ్వర్యంలో ఇసుకఅడ్డా జంక్షన్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మాట్లాడుతూ రైతుకు బేడీలు వేసిన ఘటనలో కాంగ్రెస్ పభుత్వం రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కాగా, రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంబించిన సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, కుసుమ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షుడు ఎర్కుల రఘునరెడ్డి, నాయకులు కనుకుంట్ల రంజిత్, మాచర్ల దీన్‌దయాల్, మాదాసు రాజు, బైరి శ్యాం, అపురూప రజనీష్, చిలువేరు రాజేందర్, కర్నె రవీందర్, కాసు శిల్ప, ముద్దసాని కృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హతలేని డీఈవోను తొలగించాలి


డీఈవో కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న టీఎస్ఎఫ్ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అర్హత లేని వరంగల్ డీఈవో జ్ఞానేశ్వర్‌ను వెంటనే తొలగించాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని వరంగల్ డీఈవో కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సునిల్ మాట్లాడుదూ.. పాఠశాల విద్యపై కనీస అవగాహన లేని వ్యక్తికి డీఈవో బాధ్యతలు అప్పగించడాన్ని ఆయన తప్పుబట్టారు. అసంబద్ధమైన నిర్ణయాలతో సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ వారిని మనోవేదనకు గురిచేస్తున్న డీఈవోను సత్వరమే తొలగించాలన్నారు. డబ్బులు దండుకుంటూ కలెక్టర్ అనుమ తులు లేకుండానే ప్రజాప్రతినిధుల సిఫారసులం టూ అక్రమ డిప్యూటేషన్లు చేస్తున్న జ్ఞానేశ్వర్‌పై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ పాఠశాలలకు డిప్యూటేషన్‌లు వేస్తున్నాడని, ఆయనపై మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేస్తామని, ఆయనను తొలగించే వరకు టీఎస్ఎఫ్ పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సంఘం గ్రేటర్ వరంగల్ సిటీ ప్రెసిడెంట్ నాగమణితేజ, సెక్రెటరీ సాంబరాజు, నాయకులు బన్ని, కుమార్, సంతోష్, సన్నీ, కార్తీక్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ఐఎన్‌టీయూసీ పోరాటం

రాంనగర్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యలపై కొట్లాడేది ఐఎన్‌టీయూసీ (327) సంఘం ఒక్కటేనని రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో వరంగల్, నర్సంపేట డివిజన్ స్థాయి కార్మికుల సమావేశం జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన శ్రీధర్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం వరంల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గుండగాని శ్రీనువాస్, సెక్రటరీ బుచ్చయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా నీలారపు శ్రీనువాస్, శైలశ్‌కుమార్, ట్రెజరర్‌గా పంచగిరి శ్రీనువాస్‌ను ఎన్నుకున్నారు.

హసన్‌పర్తిలో టాస్క్‌ఫోర్స్ దాడులు

హసన్‌పర్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తిలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన అప్పని శ్రీధర్ ఇంట్లో నిల్వచేసిన సుమరు రూ.10వేల విలువైన అంబర్, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని హసన్‌పర్తి పోలీసులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ వట్టే చేరాలు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

7 నుంచి పీజీ దూరవిద్య సైన్స్ పరీక్షలు

కేయూ క్యాంపస్ డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఎస్సీ బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, మ్యాథ్స్ తదితర పీజీ కోర్సుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు జనవరి 7 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ తెలిపారు. శుక్రవారం వారు పరీక్షల షెడ్యూల్‌ను వెల్లడించారు. జనవరి 7, 9, 17, 20, 22 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షల కేంద్రాన్ని కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

బ్యాగ్‌ను తిరిగి అప్పగించిన పోలీసులు

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): హనుమకొండకు చెందిన తహీరా జాబిన్ అనే మహిళ శుక్రవారం మధ్యాహ్నం మండిబజార్‌కు వచ్చి తన బ్యాగ్‌ను పోగొట్టుకున్నారు. అందులో సుమారు రూ. 30 వేల నగదు ఉంది. ఈ ఘటనపై ఆమె ఇంతెజార్‌గంజ్ పోలీసులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పోగొట్టుకున్న బ్యాగ్‌ను పట్టుకొని తిరిగి అందజేశారు.

ఆటో యూనియన్ అడ్డా ప్రారంభం

వడ్డేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ఇందిరానగర్‌లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశానుసారం నూతనంగా ఏర్పాటు చేసిన కాకతీయ ఆటో డ్రైవర్స్ యూనియన్ అడ్డాను శుక్రవారం 59వ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తేళ్ల సుగుణకిశోర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 58, 59 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి సుధాకర్, రవికిరణ్, డివిజన్ ఇన్‌చార్జి కేతిడి దీపకరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు తాళ్లపెల్లి విజయ్, ఎమ్డీ ఆరీఫ్, తాళ్లపెల్లి రవీందర్, ఎమ్డీ అక్మల్, అబ్దుల్లా, ఆటో యూనియన్ అడ్డా అధ్యక్షుడు ఎమ్డీ షఫీ, కోటి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

మట్టెవాడ డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వరంగల్ పిన్నవారి వీధిలో బుధవారం జరిగిన చోరీ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బట్టల బజార్, పిన్నవారి వీధి, ఆర్ఎన్‌టీ రోడ్డు, జేపీఎన్‌రోడ్డు, స్టేషన్‌రోడ్డు, హంటర్‌రోడ్డు, ఎల్లంబజార్, పాపయ్యపేట చమన్ ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. బుధవారం ఉదయం 9.11 నుంచి 9.40 గంటల మధ్య చోరీ జరిగినట్లు నిర్ధారించారు. నిందితుడు చోరీ తర్వాత వరంగల్ స్టేషన్‌కు వెళ్లి పారిపోయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. నిందితుడు ఇతర రాష్ట్రానికి చెందిన వాడుగా భావిస్తున్నారు. తను వరంగల్‌కు ఎప్పుడు వచ్చాడు.. ఎక్కడ ఆశ్రయం పొందాడు.. అతడికి ఇంకా ఎవరైనా సహకరించారా అనే కోణంలో లోతుగా విచారణ జరుపుతున్నారు. చోరీ జరిగినప్రాంతానికి 100 మీటర్ల దూరంలోనే ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఉండటం గమనార్హం.

ఉద్యోగాలు ఇప్పిస్తానని టోకరా

● రూ.కోటికి పైగా వసూలు

● లబోదిబోమంటున్న బాధితులు


వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు రాంకుమార్

కాశిబుగ్గ, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఎంపీ కోటాలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయగాళ్లు విసిరిన వలలో పడి కొందరు మోసపోయారు. ఆలస్యంగా విషయం తెలుసుకొని లబోదిబోమంటున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటనపై కాశిబుగ్గకు చెందిన బాధితుడు గడ్డం రాంకుమార్ శుక్రవారం మీడియాకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

శివనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ సముద్రాల పూర్ణచందర్, ఆర్టీసీ కండక్టర్ దయాకర్, అరుణ్ ఈ ముగ్గురు కలిసి ఎంపీ కోటాలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 2019లో ప్రచారం చేశారు. వీరి మాటలు నమ్మిన రాంకుమార్‌తో పాటు జనగామకు చెందిన శ్రీనివాస్, మేడ్చల్‌కు చెందని లక్ష్మీనారాయణ, గుంటూరు, కడపకు చెందిన మరికొందరు కొంత డబ్బు నేరుగా ఇవ్వగా మరి కొంత ఆన్‌లైన్ ద్వారా పంపించారు. వారిలో రాంకుమార్ రూ.4లక్షల నగదు, రూ.12లక్షలు అన్‌లైన్ ద్వారా పంపించారు. మిగతా వారి వద్ద కూడా రూ.20 నుంచి రూ.25లక్షల వరకు వసూలు చేశారు. అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఐడీ కార్డులు ఇచ్చారు. కాశీలో 7నెలల శిక్షణ ఉంటుందని చెప్పి అక్కడినుంచి కాశీకి తీసుకెళ్లారు. శిక్షణ అనంతరం కొద్ది రోజులకు ఆఫర్ లెటర్ ఇచ్చి కొద్ది రోజుల్లోనే పోస్టింగ్స్ వస్తాయని నమ్మించి అక్కడి నుంచి పంపించారు. తర్వాత కొవిడ్ కారణంతో కొన్నేళ్లు నెట్టుకొచ్చారు. ఆ తర్వాత ఎన్ని రోజులైనా పోస్టింగ్ రాకపోవడంతో అనుమానం వచ్చి డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే మాయ మాటలతో దాటవేస్తూ వచ్చారు. దీంతో విసుగుచెంది 2023లో బాధితులు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉంది. మరోవైపు కొద్ది రోజుల కిందట పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన ఏసీపీ వద్దకు పంపించారు. ఏసీపీ సూచన మేరకు మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదుగురి వద్ద సుమారు రూ.కోటికి పైగా వసూలు చేసి దర్జాగా రోడ్లపై తిరుగుతున్నా మాకేం న్యాయం జరగడం లేదని వాపోయారు. ఇదిలా ఉండగా బాధితుల్లో ఒకరైన జనగామకు చెందిన శ్రీనివాస్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. మరో బాధితుడు లక్ష్మీనారాయణ ఆరోగ్యం క్షీణించింది. ఇప్పటికైనా కోర్టు, పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంలో మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్‌ను సంప్రదించగా ఈ ఘటనపై హైదరాబద్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

విద్యాశాఖ మంత్రిని నియమించరా..?

ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్ డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దారుణమని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూ రెండో గేటు వద్ద రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడాన్ని నిరసిస్తూ ఏబీఎస్ఎఫ్ నేతృత్వంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంద నరేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు న్యాయం జరుగుతుందని భావించి ఓట్లేసి గెలిపించుకుంటే ఏడాది గడిచినా విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ ఇప్పటికైనా వెంటనే మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు గౌతమ్, రాహుల్, కిరణ్, రాజ్, సాయి, సూర్యతేజ్, చైతన్య పాల్గొన్నారు.

సమాజ సంస్కరణలో అహిల్యా భాయ్ కృషి ప్రశంసనీయం

ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ జ్యోతి

హనుమకొండ కల్చరల్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : 18వ శతాబ్దంలోనే రాణి అహిల్యా బాయ్ హోల్కర్ మహిళా సాధికారత కోసం విశేషంగా కృషి చేశారని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని వివేకానంద యోగా కేంద్రంలో హిందూత్వం - సనాతనం, నిత్యనూతనం, రాణి అహిల్యా బాయ్ హోల్కర్ పుస్తకావిష్కరణ, సమీక్ష కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ జగదీష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ.. హోల్కర్ 18వ శతాబ్దంలోనే అప్పటి సమాజంలోని బాల్య వివాహాలలను తప్పు పట్టి వితంతు వివాహాలను ప్రోత్సహిస్తూ సమాజాన్ని సంస్కరించే దిశగా పని చేశారన్నారు. డాక్టర్ వడ్డి విజయ సారథి మాట్లాడుతూ.. మొఘలులు ధ్వంసం చేసిన 150కిపైగా దేవాలయాలను తన సొంత డబ్బుతో పునర్నిర్మించారన్నారు. దేశంలో మూఢ నమ్మకాలను నిర్మూలించేందుకు రాణి అహిల్యా భాయ్ ఎంతో కృషి చేశారన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్ రాంపల్లి మల్లికార్జున్ పుస్తక పరిచయం చేస్తూ గడిచిన వేయేళ్ల బానిసత్వంలో కూరుకుపోయిన మనదేశ సమస్యలన్నిటికీ ఈ పుస్తకం సమాధానం అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్తలు ఆచార్య సంజీవ, జాతీయ సాహిత్య పరిషత్ హనుమకొండ శాఖ ప్రధాన కార్యదర్శి తాడిచెర్ల రవి, హనుమకొండ మహనగర ప్రచార ప్రముఖ్ మిట్టపెల్లి వేణు, ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ కార్యవాహ డాక్టర్ గద్దె రమేష్, ఇతర సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మడికొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన కాజీపేట మండలం కడిపికొండలో చోటు చేసుకుంది. మడికొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అయోధ్యపురం గ్రామానికి చెందిన జేరిపోతుల వీరలక్ష్మి(54) కుమారుడు తరుణ్‌తో కలిసి బైక్‌పై దర్గా నుంచి అయోధ్యపుం వెళ్తున్నారు. ఈక్రమంలో రాజీవ్ గృహకల్ప వద్దకు రాగానే కాజీపేట నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న టాటా ఏసీ వాహనం ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో వీర లక్ష్మి మృతి చెందగా ఆమె కుమారుడు గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధి తుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటి ఆవరణలో గంజాయి సాగు

పట్టుకున్న యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీం

వరంగల్ క్రైం, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ఆవరణలో పెంచుతున్న గంజాయి మొక్కను పక్కా సమాచారంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీమ్ శుక్రవారం గుర్తించింది. నిందితుడిపై కేసు నమోదు చేశారు. హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన వ్యవసాయ కూలీ రైతు అట్ల వెంకటనర్సయ్య సులభంగా డబ్బుల సంపాదించాలని ఇంట్లో ఐదడుగుల గంజాయి మొక్కను పెంచుతున్నాడు. మొక్కలోని కొన్ని కొమ్మలను ఎండబెట్టి విక్రయించేందుకు సిద్ధపడుతున్నాడనే పక్కా సమాచారం మేరకు శక్రవారం యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ ఆధ్వర్యంలో ఇంటి ఆవరణను తనిఖీ చేసి, మొక్కను గుర్తించి తదుపరి చర్యలకు కోసం నిందితుడిని సుబేదారి పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశారు ఈ తనిఖీల్లో యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఆర్ఎస్సై శివ కేశవులు, ఆర్ఎస్సైలు పూర్ణ, మనోజ్, నాగరాజు పాల్గొన్నారు.

కాజీపేటలో గంజాయి పట్టివేత..

కాజీపేట: గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాజీపేట ఎస్సై ఎస్.శివకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నంకు చెందిన తోట కృష్ణ మోహన్ మధ్యప్రదేశ్‌లోని ఇటార్సీ వద్ద తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి వివిధ ప్రాంతాల్లో అమ్ముతుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం కాజీపేట ప్రధాన రహదారిపై అనుమానంగా ఉన్న అతడిని పోలీసులు పట్టుకుని తనిఖీలు చేయగా అతడి వద్ద ప్లాస్టిక్ కవర్‌లో 900 గ్రాముల గంజాయి పట్టుబడింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.23వేలు ఉంటుందని చెప్పారు.

అండర్ -14 క్రికెట్ పోటీల జిల్లా జట్టు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్ సిటీ పరిధిలో ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న అండర్-14 బాలుర ఇంటర్ స్కూల్ పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ ఎంపిక పోటీల్లో నిర్వహించారు. శుక్రవారం హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీఎస్ సుకాంత్ క్రికెట్ క్రీడా మైదానంలో హెచ్‌సీఏ అండర్-14 క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్టును ఎంపిక చేసినట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. మూడు రోజులుగా క్రీడాకారుల మధ్య నిర్వహించిన ఎంపికలో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాణించిన క్రీడాకారులను గుర్తించి హెచ్‌సీఏ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికలు నిర్వహించామన్నారు.

బాలుర క్రికెట్ జట్టు సభ్యులు వీరే..

బి.సాత్విక్ కెప్టెన్, ఒ.సుకుమార్, యు.అశ్విత్, జి.అద్వైతరెడ్డి, పి.హర్షిణ్, ఎన్.త్రికారణ్, కె.రిషి, జశ్వంత్, సీటీజీతాధ్య, ఎన్.మణిష్‌కుమార్, ఎ.రాఘవేందర్, బి.ఈశ్వర్‌తేజ్, బి.శికర్‌సాయి, ఎస్.ప్రితం, ఎస్.శ్రీతేజ్ ఎంపికైన వారిలో ఉన్నారు. కాగా, జట్టు కోచ్‌గా ఎం.డి. అఫ్జల్, మేనేజర్‌గా ప్రణయ్‌కుమార్ వ్యవహరించనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

నూనెల్లో కల్తీ జరిగితే వ్యాపారులే బాధ్యులు


వంటనూనెలను తనిఖీ చేస్తున్న అధికారి మౌనిక

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వంట నూనెల్లో కల్తీ జరిగితే వ్యాపారులే బాధ్యత వహించాలని వరంగల్ ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్ మౌనిక హెచ్చరించారు. వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ పాత బీటు బజార్‌లో వంట నూనెల కల్తీపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హోటళ్ల నిర్వాహకులు ఒకసారి వాడిన వంటనూనెలను మరోసారి వాడొద్దని, లేదంటే ఉదర క్యాన్సర్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. వ్యాపారులు రశీదులు ఇవ్వడం లేదని, కుసుమ నూనె, పల్లీ నూనెల ప్యాకింగ్‌పై పూర్తి సమాచారం ఉండడం లేదని, నువ్వుల నూనె, గానుగ నూనెల పేరిట దోపిడీ జరుగుతోం దని, ఈ విషయంలో ప్రజలను చైతన్య వంతులను చేయడానికే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్, సంయుక్త కార్యదర్శి రావు రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని పీఈటీ మృతి

వరంగల్ రైల్వేస్టేషన్‌లో విషాదఘటన


వీరన్న (ఫైల్)

గిర్మాజీపేట, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం రాత్రి రైలు ఢీకొని పీఈటీ మృతిచెందారు. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపిన ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులను తీసుకుని పార్ట్‌టైమ్ పీఈటీ గుగులోతు వీరన్న (47) ఆదిలాబాద్‌లో శనివారం నుంచి ప్రారంభమయ్యే రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలలో పాల్గొనేందుకు బయలుదేరారు. శుక్రవారం రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. విద్యార్థులను కూర్చోబెట్టి మూత్ర విసర్జన కోసమని వీరన్న ప్లాట్‌ఫాం చివరకు వెళ్లాడు. అదే సమయంలో తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్లే కృష్ణాఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫామ్‌పైకి వస్తున్న క్రమంలో వీరన్న పట్టాలు దాటుతుండగా ఢీకొని అక్కడిక్కడే మృతిచెందారు. విద్యార్థులు వెంటనే ఈ సమాచారాన్ని సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సురేందర్‌కు ఫోన్ చేసి చెప్పగా ఆయన వెంటనే రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. జీఆర్‌పీ పోలీసులు మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామానికి చెందిన వీరన్న 8 సంవత్సరాలుగా అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో పార్ట్‌టైమ్ పీఈటీగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు అమ్మాయిలు, అబ్బాయి ఉన్నారు.

టీజీఆర్‌జేసీ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

హసన్‌పర్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యాలయాన్ని క్రైస్తవ మత ప్రచార కేంద్రంగా మార్చిన హసన్‌పర్తి టీజీఆర్‌జేసీ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతిని సస్పెండ్ చేయాలని విశ్వహిందూ పరిషత్ వరంగల్ విభాగ్ సహాయకార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డు వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 ఏళ్లకు పైగా ఇదే కళాశాలలో ఎన్‌సీసీ పర్యవేక్షకురాలిగా బాధ్యతలు మొదలుపెట్టి కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ విద్యా సంస్థను మత ప్రచార సంస్థగా మార్చేసిందని ఆరోపించారు. ప్రతీ ఆదివారం కళాశాలలోనే ఒక గదిలో విద్యార్థులచే ప్రార్థనలు చేయిస్తున్నారని ఆరోపించారు. కళాశాల మెయిన్ ప్రాంగణానికే క్రిస్మస్‌కు సంబంధించిన స్టార్ గుర్తు ఏర్పాటు చేసి, క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఈ విషయంపై తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ సెక్రటరితో పాటు కలెక్టర్, వరంగల్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సొసైటీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపిం చాలని, ప్రిన్సిపాల్ ఇందుమతిని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు వెలగందుల రాజు, సందీప్‌రెడ్డి, నాగుల ప్రసాద్, నంగునూరు నాగరాజు, బండి రోహిత్ యాదవ్, కనుకుంట్ల వెంకట్, పత్తిపాక రమేష్ పాల్గొన్నారు.

టీజీఆర్‌జేసీని పరిశీలించిన ఏసీపీ

హసన్‌పర్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీజీఆర్‌జేసీ హసన్‌పర్తి బాలికల గురుకుల కళాశాల పరిసరాలను శుక్రవారం కాజీపేట ఏసీపీ తిరుమల్ పరిశీలించారు. గురువారం కళాశాలలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా జరిగిన వివాదంపై కళాశాల అధ్యాపక సిబ్బందిని, విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో నిర్వహించతలపెట్టిన గ్రూపు పరీక్షల సందర్భంగా టీజీఆర్‌జేసీలో పరీక్షా కేంద్రంలో వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంట ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు, ఎస్సై దేవేందర్, కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి, పోలీసు సిబ్బంది, అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

పత్రికి పాటంటే ప్రాణం..

- 5వేల చరణాలతో అతి పెద్ద గేయం
- 50 గంటల ఆడియోతో ప్రపంచ రికార్డు
- ఔరా అనిపిస్తున్న గాయకుడు, కళాకారుడు కుమారస్వామి


సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పాట పాడుతున్న పత్రి (ఫైల్)

పాట పాడుతున్న పత్రి కుమారస్వామి

వరంగల్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాటలంటే ఆయనకు ప్రాణం. జానపద గేయాలతో ప్రారంభమై సామాజిక సమస్యలు.. ఆధ్యాత్మిక భావనలపై అందరినీ హత్తుకునే పాటలను పాడుతూ ప్రపంచంలోనే ఎవరూ రాయని ఎవరూ పాడని అతి పెద్ద పాటను పాడి వార్తల్లోకి ఎక్కిన వ్యక్తి పత్రి కుమారస్వామి. 5 వేల పదాలతో 50 గంటల పాటు పాట పాడి ఆ ఆడియోతో ప్రపంచ రికార్డును సాధించారు. కళాకారుడిగా ప్రస్థానం ప్రారంభించిన నగరానికి చెందిన పత్రి కుమారస్వామి ఆయుర్వేద వైద్య చిట్కాలను శోధన చేస్తూ పాత్రికేయ వృత్తిని ప్రారంభించి గాయకుడిగా తన జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

విద్య, కళాకారుడిగా ప్రస్థానం

వరంగల్ కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన పత్రి కట్టయ్య, మల్లికాంబ దంపతుల కుమారుడు కుమారస్వామి చిన్నతనం నుంచే కళను నేర్చుకుంటూ విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. సీకేఎం కళాశాలలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసి లక్ష్మి ఆయుర్వేద కళాశాలలో ఆయుర్వేద శోధనతో విద్య పూర్తి చేసి కాకతీయ యూనివర్సిటీలో ఎంసీజే చదివారు. హైదరాబాద్‌లోని ఆకాశవాణి కేంద్రంలో సంగీత జానపద ఉత్సవం లో ఏ - గ్రేడ్ ఆర్టిస్టుగా 2003లో ఎంపికయ్యా'రు. ఉమ్మడి రాష్ట్రంలో జానపద సంగీత పోటీలలో ఏ - గ్రేడ్ కళాకారుడిగా కుమారస్వామి ఒక్కరే ఎంపికయ్యారు. జిల్లా , రాష్ట్రస్థాయి జానపద పాటల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు.

యాంకర్‌గా, గాయకుడిగా టీవీల్లో ప్రదర్శనలు..

గాయకుడిగా 35సంవత్సరాలుగా పూర్వ దూరదర్శన్, ప్రస్తుత యాదగిరి ఛానల్‌తో పాటు ఆకాశవాణిలో వందల కొద్ది పాటలు ఆలపించారు. ప్రపంచంలో అతి పెద్ద జాతరైన మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరలో ప్రత్యక్ష ప్రసారంలో భాగంగా అమ్మవార్ల పాటను దూరదర్శన్‌లో పాటపాడి అందర్ని మంత్రముగ్ధుల్ని చేశారు. ఇక 5 వేల పదాలను పాటగా పత్రి కుమారస్వామి 50 గంటల పాటు పాడి ప్రపంచంలోనే ప్రపంచ రికార్డులో నిలిచారు. ఈ పాటను సీఎం రేవంత్ రెడ్డి ఎదుట ఆలపించి ఆయన అభినందనలు అందుకున్నారు. ఇదే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలు నిర్వహించి పాల్గొని ప్రముఖుల మన్ననలు పొందారు. మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పత్రి ప్రదర్శనలను తిలకించి ప్రశంసించారు. 50 గంటల పాటు 5 వేల చరణాలతో రాసి పాడిన పాట అందులో ప్రతీ అక్షరం సమాజానికి ఉపయోగపడేలా రాసినట్లు పత్రి కుమారస్వామి తెలిపారు. సమాజంలో రుగ్మతలను రూపుమాపి సమాజాభివృద్ధికి తోడ్పడేలా రాసిన పత్రికి గిన్నిస్ రికార్డును అందించాలని ఆయన అభిమానులు కోరుతున్నారు.


కళాకారుడైన పత్రిని సన్మానిస్తున్న మేయర్ గుండు సుధారాణి(ఫైల్)


వంశీ ఆర్ట్స్ వారు పత్రిని సన్మానించిన దృశ్యం (ఫైల్)

కళ


పాటల పూదోట వెంకటలక్ష్మీ

- రచయితగా, గాయకురాలిగా రాణిస్తున్న అంగన్‌వాడీ టీచర్
- ఉత్తమ రచయితగా అవార్డులు, ప్రశంసలు
- 500కుపైగా జనచైతన్యగీతాల రచన


ఢిల్లీలో అంబేద్కర్ అవార్డు అందుకుంటున్న తొట్ల వెంకటలక్ష్మీ (ఫైల్)


ఢిల్లీలో అంబేద్కర్ అవార్డు అందుకుంటున్న తొట్ల వెంకటలక్ష్మీ (ఫైల్)

నెల్లికుదురు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కడుపేదరికం.. సమాజంలో జరుగుతున్న రుగ్మతలు.. అవాంఛనీయ ఘటనలు.. చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న కార్మికుల కష్టాలు.. దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు.. దోపిడీల లాంటి సంఘటనలు ఆమెను కవిగా, గాయకురాలిగా మలిచాయి. అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను గళం వినిపించేలా పురిగొల్పాయి. ఈ క్రమంలోనే సుమారు 500కుపైగా జనచైతన్య గీతాలను రచించి ఔరా అనిపించుకుంటున్నారు నెల్లికుదురు మండలంలోని వస్రాంతండాలో అంగన్‌వాడీ టీచరుగా విధులు నిర్వహిస్తున్న తొట్ల వెంకటలక్ష్మీ. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలో తొట్ల వీరయ్య, చిన్నవెంకటమ్మ దంపతుల చిన్నకూతురైన వెంకటలక్ష్మీ వివాహం అనంతరం నెల్లికుదురు మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. 20ఏళ్ల క్రితం అంగన్‌వాడీ టీచరుగా ఉద్యోగం సాధించిన ఆమెకు చిన్ననాటి నుంచి జానపద గేయాలు, గ్రామాల్లో వ్యవసాయ కూలీలు పాడేపాటలు అంటే మక్కువ. అంగన్‌వాడీలకు సరైన గుర్తింపు, వేతనాలు లేకపోవడంతో వేతనాలు పెంచాలని సమ్మెలు, ధర్నాలు ర్యాలీలు చేస్తున్న క్రమంలో ఆమె స్వయంగా పాటలు రాసి, బాణీలు కట్టి, సమ్మెలలో పాటలు పాడటం మొదలుపెట్టారు. అనంతరం తెలంగాణ ఉద్యమ సమయంలో ఆమెలో దాగిఉన్న కళ బయట కొచ్చింది. రాష్ట్రం సిద్ధించాక తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న క్రమంలో వందలాదిగా బతుకమ్మ పాటలు రాసి పుస్తకం రచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిరోజు విదులు నిర్వహిస్తూ తీరిక సమయంలో పాటలు రచిస్తూ ఢిల్లీలో, హైదరాబాద్‌లో పలువురి మన్ననలు, ప్రశంసలు పొందారు. ఇప్పటి వరకు 500 వరకు వివిధ రకాల జనచైతన్య గీతాలు రచించి, పుస్తకం ముద్రించింది. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై పాటలు రచించి, మహిళలలో చైతన్యం రగిలించి, నిరక్ష్యరాస్యత నిర్మూలనపై మహిళలతో నృత్యాలు వేయిస్తూ మహిళలు అన్నిరంగాలలో రాణించాలని ఉత్తేజపరుస్తూ వాగ్గేయకారిణిగా ముందుకు సాగుతున్నారు.



పలు అవార్డులు సొంతం

2015లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సాహితీవేత్త అవార్డుతో పాటు రూ.10,116 నగదు పురస్కారం అందుకున్నారు. 2016లో ఢిల్లీలో సావిత్రిబాయి పూలే అవార్డు, 2017లో ఢిల్లీలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అవార్డు, అదే ఏడాది జిల్లా స్థాయి ఉత్తమ గాయని అవార్డు అందుకున్నారు. 2017లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల జిల్లాస్థాయిలో ప్రశంస పత్రం అందుకున్నారు.

నిరక్ష్యరాస్యత నిర్మూలనకు కృషి



పాటలు, నృత్యాలతో నిరక్షరాస్యత నిర్మూలనకు నా వంత కృషిచేస్తా. నిరక్షరాస్యతతో సమాంజంలో అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నాయి. ఇప్పటికీ చాలామంది ఆడపిల్లలు ఉన్నత చదువులకు నోచుకోవడం లేదు. చిన్న తనంలోనే వివాహాలు చేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను కోల్పోతున్నారు. మహిళ కళాబృందాన్ని ఏర్పాటు చేసి జానపద పాటలతో నృత్యాలతో బాల్యవివాహాల నివారణపై మార్పు తీసుకరావడానికి కృషి చేస్తున్నా. దాతలు ఆర్థికంగా సహకరిస్తే నేను రచించిన పాటలను ఆల్బంగా తయారు చేసి, అన్నివర్గాల ప్రజలను ఆలోచింపజేసేలా ప్రదర్శిస్తా.

- వెంకటలక్ష్మీ

అలెర్ట్

మైనర్లూ.. బండ్లు నడపొద్దు

- నగరంలో యథేచ్ఛగా మైనర్ డ్రైవింగ్
- మితిమీరిన వేగంతో ప్రమాదాల పాలవుతున్న వైనం
- తల్లిదండ్రులూ జాగ్రత్త పడాల్సిందే..



మట్టెవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు నడపడమంటే.. హ్యాండిల్ పట్టుకోవడమో.. స్టీరింగ్ తిప్పడమో వస్తే సరిపోదు. రోడ్డురవాణా శాఖ నిబంధన లు తెలిసిఉండాలి. లేదంటే ప్రమాదాలకు గురవక తప్పదు. ఇక మైనర్ డ్రైవింగ్ అయితే పోలీసులు తీసుకునే చర్యలను ఎదుర్కో వాల్సిందే. నగరంలో రోజురోజుకూ వాహనాలు నడిపే పిల్లల సంఖ్య ఎక్కువవుతోంది. పదేళ్ల నుంచి 15 ఏళ్ల బాలబాలికలు కార్లు, ద్విచక్రవాహనాలతో రోడ్లపైకి దూసుకువెళ్తున్నారు. రయ్ మంటూ డ్రైవింగ్ చూస్తూ.. రాంగ్ రూట్లలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులునమోదు చేస్తున్నా అలాంటి వారిలో మార్పు రావడం లేదని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. కొందరు తల్లిదండ్రులు మైనారిటీ తీరిందా లేదా? రోడ్డు నిబంధనలు వారికి తెలుసా లేదా అనేది కూడా చూడకుండా తమ పిల్లలకు ఖరీదైన వాహనాలను కొనిస్తున్నారు. దాంతో పిల్లలు ఉత్సాహంతో మితిమీరిన వేగంతో వారు ప్రమాదాల బారిన పడి ప్రాణాలపైకి తెచ్చుకోవడంతో పాటు.. ఎదుటి వారిని కూడా ప్రమాదాలకు గురిచేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు.

పిల్లల చేతికి వాహనాలు..

ప్రమాదకరమని తెలిసినా కొందరు తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇస్తున్నా రు. మైనర్‌లు వాహనాలు నడిపితే అనర్థాలు తప్పవని పోలీస్ అధికారులు చెపుతున్నా పట్టించుకోవడం లేదు. ఫలితంగా ట్రాఫిక్ మధ్య వాహనాలు నడిపే అనుభవం లేకపోవడం, వాహనాన్ని అదుపు చేసే శక్తి సామర్థ్యాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేగాకుండా ఇటీవల ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో అనేక మంది పట్టుబడ్డారు. వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినా డ్రైవింగ్ మాత్రం మానుకోవడం లేదన్నది అర్థమవుతోంది. మైనర్‌ల డ్రైవింగ్‌తో నగరంలో అనేక అనర్థాలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం వరంగల్‌లో ఓ మైనర్ స్కూటీ నడుపుతూ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా మరో బాలుడు బైక్ నడుపుతూ ఓ వృద్ధుడిని ఢీకొట్టడంతో ఆ వృద్ధుడి కాలు విరిగింది. ఈ ఘటనలో ఆ మైనర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి.

ఈ ఏడాది నగరంలో నమోదైన మైనర్ డ్రైవింగ్ కేసులిలా..

వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీస్ పరిధిలో మైనర్ల డ్రైవింగ్ రోజురోజుకూ పెరుగుతోంది. వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 104 కేసులు, హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 176, కాజీపేట పరిధిలో 17 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా 297 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదైనట్టు ట్రాఫిక్ పోలీసుల రికార్డులు చెబుతున్నాయి.

డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే...

మోటార్ వెహికిల్ చట్టం ప్రకారం సెక్షన్ నంబర్ 181 కింద జరిమానా విధిస్తారు. సెక్షన్ 180కింద వాహన యాజమానికి సైతం జరిమానా విధిస్తారు. తల్లిదండ్రులపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు. తల్లిదండ్రులు జువైనల్ జస్టిస్ బోర్డు లేదంటే కోర్టుకు, లేకపోతే పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది.

కొత్తరకం దేశీయ పత్తి రకాల సృష్టి

వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల కృషి


పత్తి మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు 13 : (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కొత్తరకం దేశీయ పత్తి రకాల(వెరైటీ)లను సృష్టిస్తున్నారు. నీటి వసతి లేకున్నా.. పంట ఎండిపోకుండా, చీడపీడల నుంచి తట్టుకునేలా అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ అధిక దిగుబడులిచ్చేలా పత్తి రకాలను సృష్టిస్తున్నారు. ఈ రకమైన పత్తిని స్థానిక పరిశోధన కేంద్రంలో ఆరేళ్లుగా ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. మరి కొన్నాళ్ల పాటు పరీక్షిం చి అత్యుత్తమ ఫలితాలు వచ్చిన తరువాత రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ రకాలు రైతులకు అందుబాటులోకి వస్తే బయటి విత్తనాలు కొనే అవసరం ఉండదు. సాగు చేసిన పంట నుంచే గింజలను తీసి తిరిగి విత్తుకోవచ్చు. హైబ్రిడ్ కొత్త వంగడాల విత్తనాలను సాగు చేసే రైతులకు ఈ అవకాశం ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తెలంగాణలో పత్తి సాగుకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని అంటు న్నారు. ఇప్పుడు అభివృద్ధి చేసే కొత్త రకాలు రైతులకు ఆమోదయోగ్యంగా ఉంటాయని చెబు తున్నారు. ఈ కొత్తరకాలను తొలుత ఈ పరి శోధన కేంద్రంలోని ఉమ్మడి ఖమ్మం, మెదక్, వరంగల్ జిల్లాలో ప్రయోగాలు చేసి దశలవారీగా రాష్ట్రమంతా విస్తరించేలా ప్రయత్నం చేస్తు న్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

- త్వరలో చేతికి రానున్న మొదటి పంట
- కనిపించని మార్కెటింగ్ జాడ
- ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలదే బాధ్యత అంటున్న అధికారులు
- ఇప్పటికీ ప్రారంభం కాని ప్యాక్టరీల ఏర్పాటు ప్రక్రియ
- రాష్ట్ర వ్యాప్తంగా 1.99 లక్షల ఎకరాల్లో సాగు



సాగు సరే... పరిశ్రమ ఏది?



త్రిశంకు స్వర్గంలో ఆయిల్‌పామ్ రైతులు



(ఆంధ్రజ్యోతి భూపాలపల్లి) : రాష్ట్రంలో ఆయిల్‌పామ్ మొదటి పంట చేతికొస్తోంది. అయినా పంట కోత, ఫ్యాక్టరీలకు తరలింపు, మార్కెటింగ్ వంటి అంశాలు రైతన్నలను గందరగోళానికి గురిచేస్తున్నాయి. నాలుగేళ్లుగా ప్రభుత్వం చెప్పినట్లుగా ఆయిల్ ఎక్స్ట్రాక్షన్ , రిఫైనరీల ఏర్పాటు ఇంకా కొలిక్కి రాలేదు. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో 2020-21లో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో మొత్తం 1.99లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఇందుకు ప్రభుత్వం వివిధ ఏజెన్సీలతో మొక్కల పంపిణీ మొదలుకొని రైతుల పంట కొనుగోలు వరకు ఆయా ఏజెన్సీలకే బాధ్యతలను అప్పగిస్తూ ఒప్పందం చేసుకుంది.. ఈ క్రమంలో రాష్ట్రంలోని మొత్తం 14 ఏజెన్సీలు రిఫైనరీల ఏర్పాటుకోసం అంగీకారం కుదుర్చుకుంది. అయితే మొక్కలు నాటిన మూడేళ్ల తర్వాత ఆయిల్ హార్వెస్టింగ్ జరిగే అవకాశం ఉంటుందని ముందే తెలిసినా ఇప్పటి వరకు ఆయా ఏజెన్సీలు పరిశ్రమల స్థాపించడంలో పూర్తిగా విఫలమయ్యాయి. ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా సహా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ గెలలు కోతకు వచ్చినట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

భూపాలపల్లి జిల్లాలో సాగు చేసిన మొత్తం 3650 ఎకరాలకు ఈ ఏడాది దాదాపు 353ఎకరాల్లో మొదటి సారి ఆయిల్ పామ్ గెలలు హార్వెస్టింగ్ జరుగనున్నాయి. రైతులు, అధికారుల మాటలనుబట్టి మరో రెండు నెలల్లో ఈ పంట హార్వెస్టింగ్ పూర్తి కావాల్సి ఉంది. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ రైతుల నుంచి పంటను కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆ సంస్థ మొక్కలు అందజేయడం మొదలుకొని ఉత్పత్తి కొనుగోలు వరకూ బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. రైతులకు మొక్కల సరాఫరా చేసినందుకు ఒక్కో మొక్కపై రూ. 193ను సబ్సిడీగా అందజేస్తోంది. ఈ లెక్కన ఒక్కో ఎకరాకు 57 మొక్కలకు రూ. 11,001ను ఖర్చు చేస్తోంది. జిల్లాలో మొదటిసారి ఆయిల్‌పామ్ చేతికొస్తుందని రైతులు ఆనందించే లోపు ఇంకా ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకాలేదన్నా సమాచారం ఆందోళనకు గురిచేస్తోంది. రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది.

పరిశ్రమల మంత్రి ఇలాకాలోనే పరిశ్రమ కరువు



పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న భూపాలపల్లి జిల్లాలోనే ఆయిల్‌పామ్ పరిశ్రమకు మోక్షం కలగలేదు. ఓ వైపు పంట చేతికొస్తున్నా, ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ పరిశ్రమ నిర్మాణాన్ని ప్రారంభించకుండా తాత్సారం చేయడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. భూపాలపల్లి జిల్లాలో రైతులు పండించే ఆయిల్‌పామ్‌ను సేకరించి రిఫైన్ చేయడం కోసం జిల్లాలోని చిట్యాల మండలం నైన్‌పాకలో రిఫైనరీని ఏర్పాటు చేయాలని తలపెట్టినా ఇప్పటికీ అక్కడ ఎలాంటి నిర్మాణాలు ప్రారంభం కాలేదు. అయితే రిఫైనరీ ఫ్యాక్టరీ నడవాలంటే కనీసం 20వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉండాలని, అప్పుడే నిరంతరం దిగుబడులు వస్తే తప్ప పరిశ్రమ నడిచే పరిస్థితి ఉండదని అంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో 3650 ఎకరాల్లో మాత్రమే పంట సాగు చేయగా ఇందులో ఈ ఏడాది 353ఎకరాలకు సంబంధించి మాత్రమే పంట కోతకు వచ్చే పరిస్థితి ఉంది. దీంతో సంస్థ వేచిచూసే ధోరణి అనుసరిస్తోందని తెలుస్తోంది. జిల్లాలో పరిశ్రమల స్థాపించేందుకు ముందుకు వచ్చిన సువెన్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పంటను కొనుగోలు చేస్తుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రైతులను అయోమయానికి గురి చేస్తోంది. ఇదిలా ఉండగా మొదటి కోత జరిగిన 24గంటల్లోపే ఆయిల్‌పామ్ గెలలను ఫ్యాక్టరీకి తరలించాల్సి ఉంటుందని, లేని పక్షంలో నూనె శాతం తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలో రెండు మినహా ఎక్కడా పరిశ్రమలు నిర్మాణం కాకపోవడంతో మొదటి పంటను రైతులు వదులుకోవాల్సిందేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

బానపొట్ట బాధిస్తోందా?

బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోవడంవల్ల పొట్ట గుండ్రంగా పెద్దగా కనిపిస్తుంది. దీనినే బానపొట్టగా పరిగణిస్తుంటారు. దీనివల్ల శరీరాకృతి అందంగా కనిపించదు. అంతేకాకుండా గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. యాంటీ ఆక్సిడెంట్లు, పీచుపదార్థాలు, ఇతర పోషకాలు అధికంగా ఉన్న పండ్లు తరచూ తినడంవల్ల బానపొట్టను మెల్లగా తగ్గించవచ్చు. ఆ పండ్ల వివరాలు...

యాపిల్



యాపిల్ పండులో చాలా తక్కువ క్యాలరీలు, అత్యధికంగా పీచుపదార్థాలు ఉంటాయి. ఇవి పొట్టలోని కొవ్వులను కరిగించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతిరోజూ ఒక యాపిల్ పండు తినడం వల్ల అందులోని పెక్టిన్ సమ్మేళనాలు జీర్ణక్రియ నెమ్మదిగా జరిగేలా చేస్తాయి. దీనివల్ల ఆకలి తగ్గి ఆహారం తినాలనిపించదు. దీంతో పొట్టలోని కొవ్వు కరగడం మొదలవుతుంది.

నల్ల ద్రాక్ష



నల్ల ద్రాక్ష, స్ట్రాబెర్రీ, రాస్‌బెర్రీ పండ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. యాంటీ ఆక్సీడెంట్లు, సి విటమిన్, పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ఈ పండ్లను రోజూ తినడం వల్ల కొవ్వులకు సంబంధించిన జీవక్రియలు వేగంగా జరుగుతాయి. దీనివల్ల కడుపు ఉబ్బరం తగ్గుతుంది.

నారింజ



ఈ పండులో క్యాలరీలు ఉండవు. సి విటమిన్, బీటా కెరొటిన్లు, ఫినోలిక్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి పొట్టలోని అన్ని రకాల కొవ్వులను వేగంగా కరిగిస్తాయి. ప్రతిరోజూ కనీసం రెండు నారింజ పండ్లు తినడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.

అవకాడో



దీనిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు కడుపులో ఇన్‌ఫ్లమేషన్‌ని నివారిస్తాయి. కొవ్వులను కరిగించే హార్మోన్లను ఉత్తేజితం చేస్తాయి. అవకాడోలోని విభిన్నమైన పీచుపదార్థాలు పొట్టను పరిశుభ్రం చేస్తాయి. ప్రతిరోజూ ఈ పండు తినడం వల్ల బానపొట్ట నుంచి విముక్తి పొందవచ్చు.

బొప్పాయి



ఈ పండులో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను వేగవంతం చేసి కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. కడుపులో ఎటువంటి పదార్థాలు నిల్వ ఉండకుండా చేస్తుంది. బొప్పాయిలోని పీచు పదార్థాలు ప్రేగులను పరిశుభ్రం చేస్తాయి. ప్రతిరోజూ ఒక కప్పు బొప్పాయి పండు ముక్కలు తినడం వల్ల పొట్టలోని కొవ్వులు క్రమంగా కరిగిపోతాయి.

పంపర పనస



ఈ పండులో కూడా సిట్రస్ జాతి ఎంజైమ్‌లు, విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించి రక్తంలో చక్కెరలు పెరగకుండా చేస్తాయి. దీనివల్ల శరీరం పూర్తిస్థాయిలో శక్తిని వినియోగించుకుంటుంది. పంపర పనస పండు రసం తాగడం వల్ల ఉదరంలో నిల్వ ఉన్న కొవ్వులు క్రమంగా కరిగి బానపొట్ట తగ్గుతుంది.

పుచ్చపండు




దీనిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఈ పండు తిన్న వెంటనే కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీనిలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. పుచ్చపండులో ఉండే ఆర్జినైన్ అనే అమైనోయాసిడ్ కొవ్వులను వేగంగా కరిగిస్తుంది. రోజుకి రెండు కప్పుల ముక్కలు తినడం వల్ల శరీరానికి కావాల్సిన తేమ అందుతుంది. ఆకలి నియంత్రణలో ఉండి బానపొట్ట కరుగుతుంది.

దానిమ్మ



దానిమ్మ గింజల్లో పాలిఫెనాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. దీంతో కడుపులోని కొవ్వులు కూడా కరిగిపోతాయి.

అనాస



ఈ పండులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది పొట్టలో పేరుకున్న కొవ్వులను కరిగిస్తుంది. జీర్ణాశయం పనితీరుని మెరుగుపరుస్తుంది. కడుపులో తయారయ్యే వాయువులను బయటికి పంపుతుంది. ఈ పండు తిన్నపుడు దీనికి ఉన్న అరుదైన తీయదనం వల్ల కొన్ని రోజుల వరకు ఇతర తీపి పదార్థాలను తినాలనిపించదు. శరీర బరువు క్రమంగా తగ్గి పొట్ట పరిమాణం మామూలు స్థాయికి వస్తుంది.

అరటి



అరటి పండులో అధికంగా పొటాషియం ఉంటుంది. ఇది శరీరంలో అదనంగా నీరు నిల్వ ఉండకుండా చేస్తుంది. దీనివల్ల శరీర భాగాల్లో చేరిన కొవ్వులన్నీ కరిగిపోతాయి. ప్రతిరోజూ ఉదయాన్నే రెండు అరటిపండ్లు తింటే ఆకలి నియంత్రణలో ఉంటుంది. శరీరమంతా తేలికగా ఉన్న భావన కలుగుతుంది.



శీతాకాలం చికెన్!

శీతాకాలంలో సాధారణం కన్నా ఎక్కువ రోగ నిరోధకశక్తి అవసరమవుతుంది. దీన్ని పెంపొందించుకోవటంలో ప్రొటీన్ కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఈ ప్రొటీన్‌ను మనకు అధికంగా అందించేది చికెన్. అందుకే చికెన్‌తో ఎలాంటి వంటలు చేసుకోవచ్చో చూద్దాం.

మెంతి చికెన్

కావాల్సిన పదార్థాలు

ఎముకలు లేని చికెన్ ముక్కలు- అరకేజీ, తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, టమోటా ముక్కలు- ఒక కప్పు, తరిగిన మెంతికూర- ఒక కప్పు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు స్పూనులు, నిమ్మరసం- ఒక చెంచా, ఎర్ర కారం- ఒక చెంచా, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక చెంచా, పెరుగు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, నూనె- పావు కప్పు, ఏలకులు- నాలుగు, దాల్చిన చెక్క- అర ఇంచు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

జాగ్రత్తలు

- మెంతికూర అందుబాటులో లేకపోతే ఎండబెట్టిన మెంతికూర (కసూరి మేతి) షాపుల్లో దొరుకుతుంది. దానిని వాడవచ్చు.
- తాజా చికెన్‌తో చేస్తే మంచి రుచి వస్తుంది.

తయారీ విధానం

- ఒక గిన్నెలో చికెన్ ముక్కలను తీసుకొని నిమ్మరసం, ఎర్రకారం, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు వేసి కలపాలి. దీనిపై మూత పెట్టి 20 నిమిషాలు ఉంచాలి.
- మరొక గిన్నెలో పెరుగు, ఎర్రకారం, ధనియాల పొడి, ఉప్పు వేసి కలపాలి.
- ఒక మూకుడులో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు వేయించాలి. ఈ ముక్కలు చల్లారిన తర్వాత మిక్సీ గిన్నెలో వేసి ముద్దగా చేయాలి.
- ఉల్లిపాయ ముక్కలు వేయించిన మూకుడులోనే నానబెట్టిన చికెన్ ముక్కలను వేసి బంగారు రంగు వచ్చేదాకా వేయించాలి. వాటిని బయటకు తీసి చల్లార్చాలి.
- ఈ మూకుడులోనే ఏలకులు, దాల్చిన చెక్క, టమోటా ముక్కలు, మెంతికూర, పచ్చి మిర్చి ముక్కలు వేయాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముద్దను కూడా వేయాలి. ఈ మిశ్రమంలో వేయించిన చికెన్ ముక్కలు వేసి తగినంత ఉప్పు, తగినన్ని నీళ్లు పోసి ఉడికించాలి.

చికెన్ నీంబూ ధనియా షోర్బా



కావాల్సిన పదార్థాలు:

చికెన్ ముక్కలు- 50 గ్రాములు, అల్లం వెల్లుల్లి పేస్ట్- పావు చెంచా, ధనియాలు- ఒక చెంచా, నిమ్మరసం- ఒక చిన్న కప్పు, క్రీమ్- రెండు చెంచాలు, వెన్న- అర చెంచా, పసుపు- పావు చెంచా, పచ్చి మిర్చి పేస్ట్- అర చెంచా, కార్న్‌ఫ్లోర్- ఒక చెంచా, ఉప్పు- తగినంత

జాగ్రత్తలు

- సూప్ కన్నా షోర్బా చిక్కగా ఉంటుంది. అందువల్ల ఎక్కువ నీళ్లు పోయకూడదు.
- అల్లం వెల్లుల్లి పేస్ట్ అందుబాటులో లేక వేయకపోయినా మంచి రుచి వస్తుంది.

తయారీ విధానం

- ఒక గిన్నెలో మూడు పెద్ద కప్పుల నీళ్ల తీసుకొని సన్నని సెగపై మరిగించాలి. నీళ్ల పొంగిన తర్వాత వాటిలో చికెన్ ముక్కలు వేయాలి.
- చికెన్ ముక్కలు కొద్దిగా మగ్గిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, ధనియాలు, పచ్చిమిర్చి పేస్ట్, క్రీమ్, వెన్న, నిమ్మరసం వేసి ఉడకనివ్వాలి.
- ఆ తర్వాత ఉప్పు, కార్న్‌ఫ్లోర్ వేయాలి. దగ్గర పడిన తర్వాత దింపేయాలి.

ఆలూ చికెన్ పులుసు



కావాల్సిన పదార్థాలు

చికెన్ ముక్కలు: ఒక కేజీ, తెల్ల వెనిగర్ - నాలుగు చెంచాలు, బంగాళదుంప ముక్కలు- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అరకప్పు, వెల్లుల్లి ముక్కలు- ఒక చెంచా, అల్లం ముక్కలు- ఒక చెంచా, పచ్చిమిరపకాయ ముక్కలు- రెండు చెంచాలు, ఏలకులు- నాలుగు, లవంగాలు- నాలుగు, దాల్చిన చెక్క- ఒక ఇంచు, కొబ్బరి పాలు- రెండు కప్పులు, కరివేపాకు- ఒక రెబ్బ, నూనె- పావు కప్పు, ఉప్పు- తగినంత

జాగ్రత్తలు

- ఈ పులుసు దోసెలలో తింటే బాగుంటుంది.
- పోపు పెట్టే సమయంలో కేవలం కరివేపాకు మాత్రమే వేయాలి. ఆవాలు, మెంతులు వంటివి వేయకూడదు.

తయారీ విధానం

- కుక్కర్‌లో చికెన్ ముక్కలు, బంగాళదుంప ముక్కలు, తెల్ల వెనిగర్, ఉప్పు వేసి ఒక కూత వచ్చే దాకా ఉడికించాలి.
- ఒక మూకుడులో నాలుగు స్పూన్ల నూనె వేసి వేడి చేయాలి. ఉల్లిపాయ ముక్కలు, అల్లం, వెల్లుల్లి ముక్కలు, పచ్చి మిరపకాయ ముక్కలు వేసి వేయించాలి. ఇవి బాగా వేగిన తర్వాత ఏలకులు, లవంగాలు, దాల్చిన చెక్క వేసి వేయించాలి.
- ఈ మిశ్రమంలో చికెన్ ముక్కలు, బంగాళ దుంప ముక్కలు, కొబ్బరి పాలు పోసి ఉడకబెట్టాలి.
- ఈ మిశ్రమం బాగా ఉడికిన తర్వాత ఉప్పు వేయాలి. వేరే చిన్న మూకుడులో కొద్దిగా నూనెను వేడి చేసి కరివేపాకు వేయించి.. మిశ్రమంలో పోపు పెట్టాలి.

క్యాన్సర్‌ను జయించి... వ్యాపారంలో రాణించి

ఆమె ప్రాణాంతకమైన క్యాన్సర్ బారిన పడింది. అంతలోనే భర్తకూ అదే వ్యాధని తెలిసింది. అయినా కుంగిపోలేదు. వ్యాపకంగా ఉన్న పచ్చళ్ల తయారీని విస్తరించింది. పిల్లల భవిష్యత్తు కోసం మనోధైర్యంతో ముందుకు సాగుతూ ఒక సంస్థను నెలకొల్పింది. తద్వారా మహిళలకు జీవనోపాధి కల్పించి... వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్న లవీనా జైన్ అంతరంగం ఇది.

"మాది మీరట్. మా ఆయన సందీప్ జైన్. మాకు ఇద్దరు పిల్లలు. బాబు కిన్షుక్, పాప కృతిక. నలుగురం సొంత ఇంట్లో సంతోషంగా ఉండేవాళ్లం. పచ్చళ్లు పెట్టడం, స్క్వాష్‌లు తయారు చేయడమంటే నాకు చాలా ఇష్టం. వీటిని నిల్వ చేసే విధానాలకు సంబంధించి చిన్న కోర్సు కూడా పూర్తిచేశా. పచ్చళ్లు, ఊరగాయలు, జామ్‌లను విభిన్న రుచుల్లో రకరకాలుగా తయారుచేసి బంధువులకు, స్నేహితులకు పంచుతుండేదాన్ని. రుచి అమోఘమని, చిన్నపాటి వ్యాపారాన్ని ప్రారంభిస్తే మంచి పేరు, డబ్బు వస్తాయని చెబుతుండేవారు. వాళ్ల పొగడ్తలకు చాలా ఆనందం వేసేది.

బాధను భరిస్తూ...

"అంతా సంతోషంగా సాగుతుందని అనుకుంటుండగానే జీవితం అనుకోని మలుపు తిరిగింది. అనారోగ్యంగా అనిపిస్తే నేను, ఆయన ఆసుపత్రికి వెళ్లాం. ఇద్దరికీ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు వైద్యులు. కాళ్ల కింద భూమి కదులుతున్నట్లు అనిపించింది. పిల్లలు గుర్తుకువచ్చి కన్నీళ్లు ఆగలేదు. ఎలాగైనా ఈ కష్టం నుంచి గట్టెక్కాలని బలంగా నిర్ణయించుకున్నాం. బంధువులంతా ఇంటిని అమ్మేయమన్నారు. దానికి నా మనసు అంగీకరించలేదు. మావద్ద ఉన్న కొద్దిపాటి సొమ్ముతోనే కీమోథెరపీ చేయించుకోవాలనుకున్నాం. చాలా బాధ అనుభవించాం. సరిగ్గా ఈ సమయంలోనే ప్రభుత్వం 'ఫుడ్ ప్రిజర్వేషన్ ట్రెయినింగ్'ను ప్రారంభించింది. వెంటనే అందులో చేరా. కీమోథెరపీ సెషన్ పూర్తయిన వెంటనే తరగతులకు హాజరయ్యా.

నోటి మాటతోనే...

"క్రమంగా క్యాన్సర్ నుంచి ఇద్దరం కోలుకున్నాం. నాకున్న పరిజ్ఞానంతో పచ్చళ్లు, జామ్‌ల వ్యాపారాన్ని ప్రారంభించాలనుకున్నా. అప్పుడు నా దగ్గర 1500 రూపాయలు మాత్రమే ఉన్నాయి. ఆ డబ్బుతోనే మొదట లెమన్ స్క్వాష్, తండాయి తయారు చేశా. పిల్లల సహకారంతో పాత గాజు సీసాల్లో వీటిని నింపాను. ఆ రోజుల్లో మహిళలు ఎక్కువగా కిట్టీ పార్టీలు చేసుకునేవాళ్లు. అక్కడికి ఈ సీసాలు తీసుకెళ్లి అమ్మకానికి పెట్టేదాన్ని. ఇంట్లో తయారు చేసినవి అనగానే వాళ్లు ఆసక్తి చూపేవారు. రుచి కూడా నచ్చడంతో విరగబడి కొనేవాళ్లు. క్రమంగా ఊరగాయలు, స్క్వాష్‌లు కూడా తయారుచేసి నా ఉత్పత్తులను పరిచయం చేసేందుకు స్టాల్స్ ప్రారంభించా. మొదట వచ్చిన పెద్ద ఆర్డర్... రెండు కిలోల మామిడికాయ పచ్చడి. ఆ నోటా ఈ నోటా విని ఆర్డర్లు పెరిగాయి."



ప్రపంచ వ్యాప్తంగా...

మేము కష్టాల్లో ఉన్నపుడు అందరూ వెన్ను చూపినవాళ్లే. కొద్దిమంది మాత్రమే నాపై నమ్మకంతో మద్దతుగా నిలిచారు. వారి సహకారంతోనే ప్రస్తుతం 39 లక్షల టర్నోవర్ సాధించా. త్వరలో 50 లక్షల మార్క్ దాటాలనే లక్ష్యంతో ఉన్నా. కొనుగోలుదారులకు ఎప్పటికప్పుడు కొత్త రుచులు పరిచయం చేయడమంటే నాకు చాలా ఇష్టం. ఇదే నా గెలుపు సూత్రం కూడా! మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా విభిన్న ఉత్పత్తుల తయారీ కోసం రోజూ ప్రయోగాలు చేస్తుంటా. ప్రపంచవ్యాప్తంగా మా ఉత్పత్తులు విస్తరించాలన్నదే నా ఆశయం.

నాణ్యతకే పెద్ద పీట...

"వ్యాపారం విస్తరిస్తుండడంతో ఇంట్లోనే 'తృప్తి ఫుడ్స్' పేరుతో ఒక యూనిట్ ప్రారంభించా. పిల్లలు, భర్త పూర్తి సహకారం అందించారు. యూనిట్ పనుల్లో సహాయం కోసం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలను నియమించుకున్నా. ఇప్పటికీ అందరం కలిసి ఒకే కుటుంబంలా పనిచేస్తాం. కాలానుగుణంగా లభించే పండ్లు, కాయలతో ఉత్పత్తులను నిర్ణయించి తయారుచేస్తాం. అందుకు స్థానిక మార్కెట్ల నుంచి తాజాగా ఉన్నవాటిని మాత్రమే ఎంచుకుని కొనుక్కొస్తాం. ఉత్పత్తుల నిల్వ కోసం ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి ప్రకారమే సోడియం బెంజోయేట్‌ని కలుపుతాం. కృత్రిమ రంగులు అసలు కలపం. పెద్ద ఆర్డర్లు వచ్చినపుడు వాటి తయారీ, నిల్వ, ప్యాకింగ్ అంశాల్లో చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రస్తుతం మా యూనిట్ నుంచి 70 రకాలు తయారు చేస్తున్నాం. కారం, ఇతర మసాలా పొడులను సంప్రదాయ పద్ధతుల్లోనే సిద్ధం చేసుకుంటాం. ఇక్కడ పనిచేయడానికి వచ్చే మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తాం. ప్రతి ఉత్పత్తినీ నిర్దేశించిన కొలతల ప్రకారం మాత్రమే తయారయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటాం. అందుకే మేం పెట్టిన పచ్చళ్లు, ఊరగాయలు తిన్నవాళ్లు 'అచ్చం అమ్మమ్మ చేసినట్లే ఉన్నాయి' అంటుంటారు. ఇది మాకెంతో సంతృప్తినిస్తుంది.

అదే అందరికీ ఇష్టం...

మా ఉత్పత్తుల్లో 'హింగ్ అచార్' బాగా ప్రాచుర్యం పొందింది. యూనిట్ మొత్తం అమ్మకాల్లో మూడొంతులు దీనిదే. లీచీ స్క్వాష్, యాపిల్ జామ్, కీవీ జామ్, పైనాపిల్ క్రష్, స్ట్రాబెర్రీ స్క్వాష్‌లకు మంచి ఆదరణ ఉంది. స్థానికంగా నిర్వహించే ఎగ్జిబిషన్లు, ప్రత్యేక ఈవెంట్లలో స్టాల్స్ పెడుతుంటాం. మీరట్‌లో నాలుగు రిటైల్ అవుట్‌లెట్లు ప్రారంభించాం. ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లో కూడా మా ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. అమెజాన్ నుంచి కూడా కొనుక్కోవచ్చు. విదేశాలకు వెళ్లే కుటుంబాలు మా ఉత్పత్తులను వెంట తీసుకెళుతుంటే మాకు ఎంతో గర్వంగా అనిపిస్తుంటుంది."



తెలుగు నాట పులగానికి సాటి లేదు

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

తెలుగు నేలకు సంబంధించినంతవరకూ పెసలు మన మొదటి పప్పు ధాన్యం. ఆ సమయంలో పెసర చేనుని పైరు అనేవారు. తరువాతి కాలంలో అన్ని పంటచేలనూ పైరు అనటం మొదలుపెట్టారు. పెసల తర్వాతే మనకు కందిపప్పు తదితర పప్పుధాన్యాలు తెలిశాయి. మొదట్లో అన్నంలో పెసరపప్పును కలుపుకొని తినేవారు. వరి బియ్యాన్ని, పెసరపప్పును కలిపి వండటం ఆ సమయంలో ఒక కొత్త ప్రయోగం. దేవుడికి మహానివేదన పెట్టే సమయంలో ప్రతి రోజూ పంచభక్ష్య పరమాన్నాలు పెట్టలేరుగా! దానికి బదులుగా పెసరపప్పు అన్నం నివేదనగా పెట్టేవారు. ఈ పెసరపప్పు అన్నంను సంస్కృత పాకశాస్త్ర గ్రంథాల్లో, వైద్య గ్రంథాల్లో- కృశర అని పిలుస్తారు. కొన్ని చోట్ల ముద్గౌదనం (పప్పన్నం) అని కూడా కనిపిస్తుంది. ఇక పెసరపప్పు పసిడి వర్ణంలో ఉంటుంది కాబట్టి దీనిని తెలుగులో పులగం అని పిలవటం మొదలుపెట్టారు.



'భోజన కుతూహలం' గ్రంథంలో ఈ కృశర గురించి "తండులా దాలిసంయుక్తా లవణార్ద్రకహింగుభి.. యుక్తాశ్చ సలిలె సిద్ధా కృశరా కథితా బుధై" అని పేర్కొంటారు. తండులా దాలిసంయుక్తా అంటే పెసరపప్పు, బియ్యం కలిపి వండినది అని.. "లవణార్ద్రక హింగుభి" అంటే సైంధవలవణం, అల్లంముక్కలు, ఇంగువ వగైరా కలిపినది అని.. "సలిలె సిద్ధా కృశరా కథితా బుధై" అంటే చాలినంత నెయ్యి వేసి వండితే దాన్ని కృశరా అని మేధావులు పిలుస్తారని.. "శుక్రలా" అంటే పురుషుల్లో జీవకణాలను పెంచే సమర్థత దీనికి ఉందని.. "బల్యా గురు పిత్త కఫప్రదా" అంటే బలకరం, ఆలస్యంగా అరిగి ఎక్కువ సేపు ఆకలి వెయ్యకుండా.. కఫదోషాన్ని పోగొడుతుందని.. "బహువిష్టంభి" అంటే నీళ్లవిరేచనాలను, అతిమూత్రాన్ని ఆపుతుందని.. "మలమూత్రకరీ" అంటే మలమూత్రాలు సులభంగా అయ్యేలా చేస్తుందని.. "బుద్ధివివర్ధకా" అంటే జ్ఞాపకశక్తిని పెంచేదిగా ఉంటుందని అర్థం.

పిల్లలకు...

ఎదిగే పిల్లలకు పులగాన్ని మించిన ఆహార పదార్థం ఇంకొకటి లేదు. తల్లి దండ్రులు తమ పిల్లలకు ఉదయాన్న ఈ కమ్మని కృశరా అనే పులగాన్ని పెట్టి పంపిస్తే పిల్లలు చురుకుగా ఉంటారు. కడుపులో మంట, అల్సర్లు, అమీబియాసిస్, కడుపు ఉబ్బరం లాంటి బాధల్ని ఈ పులగం తగ్గిస్తుంది. దీనిని తిన్న తరువాత బెల్లం పానకం గానీ నిమ్మరసం షర్బత్తు గానీ మజ్జిగ గానీ తాగితే తేలికగా అరుగుతుంది. ఇక ఈ పులగాన్ని రెండు రకాలుగా చేసుకోవచ్చు. మొదటిది కారం (కట్టు) పులగం. రెండోది తీపి పులగం. ఇక్కడ ఒక మరో విషయాన్ని కూడా చెప్పాలి. పులగం, పొంగలి ఒకటి కావు. ఒక కప్పు బియ్యం, ఒక కప్పు పెసరపప్పును రెండు కప్పుల నీటిలో ఉడికించి చేసేది పులగం. ఒక కప్పు బియ్యపు పిండి, ఒక కప్పు పెసరపప్పులను రెండు కప్పుల నీళ్లలో వేసి చేసేది పొంగలి. దీనిలో ఎవరికి కావాల్సినంత నెయ్యి వారు వేసుకోవచ్చు. ఇక తీపి పులగం విషయానికి వస్తే- బియ్యం, పెసరపప్పు, బెల్లం, కొబ్బరి, మిరియాలు, నెయ్యి, ఆవుపాలు వీటిని తగుపాళ్లలో కలిపి సన్నని సెగపై ఉడికించాలి. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. తినటానికి చాలా రుచిగా కూడా ఉంటుంది.

మేకప్

కనువిందైన అందం

మేకప్‌లో భిన్నమైన పోకడలు పుట్టుకొస్తూనే ఉంటాయి. కాలానుగుణంగా మారిపోతున్న ఈ పోకడలను సందర్భానికి తగ్గట్టు అనుసరిస్తూ ఉండాలి. ప్రస్తుతం వాడుకలో ఉన్న మేకప్ పోకడలు ఇవే!

గ్లామర్ మేకప్

మందపాటి పెదవులు, మెరుపులీనే చర్మం, తీర్చిదిద్దిన కళ్లు ఈ మేకప్ రహస్యాలు. ప్రత్యేకించి సంప్రదాయ వస్త్రధారణకు అద్భుతంగా నప్పే ఈ తరహా మేకప్‌లో ఐషాడోల కోసం భిన్నమైన రంగులను ఎంచుకుంటూ ఉంటారు. ఎమరాల్డ్ గ్రీన్, శాఫైర్ బ్లూ, రూడీ రెడ్ రంగుల ఐషాడోలు ఈ తరహా మేకప్‌లో ప్రధాన పాత్ర పోషిస్తూ ఉంటాయి. అయితే కళ్లలోని లోపలి కొలకులకు బంగారం లేదా రాగి రంగు ఐషాడో అద్దుకోవడం వల్ల గ్లామర్ రెట్టింపవుతుంది.

లిప్ కలర్స్

ముదురు రంగు లిప్‌స్టిక్స్ ఊపందుకున్నాయి. డీప్ ప్లమ్, క్లాసిక్ రెడ్, వైబ్రెంట్ కోరల్ రంగుల లిప్‌స్టిక్‌లతో మేకప్‌కు రెట్టింపు ఆకర్షణ దక్కుతుంది. సంప్రదాయ వేడుకలకు బోల్డ్ లిప్‌స్టిక్స్ చక్కగా నప్పుతాయి. అంతకంటే సున్నితమైన రంగులను ఇష్టపడేవారు టింటెడ్ లిప్‌బామ్ లేదా గ్లాస్ వాడుకోవచ్చు.

కోల్ రిమ్మ్‌డ్ ఐస్

నల్లని కాటుక కళ్లకు రోజులు చెల్లాయి. టీల్, పర్పుల్, గోల్డ్ లైనర్ల హవా మొదలైంది. ఈ లైనర్లకు మందపాటి కృత్రిమ కనురెప్పలను జోడించి కవ్వించే కళ్లను తీర్చిదిద్దుకునే ధోరణి మొదలైంది. అయితే ఈ లైనర్ల అందం చెక్కుచెదరకుండా ఉండడం కోసం తడికి కారిపోకుండా ఉండే ఐలైనర్స్‌నే ఎంచుకోవాలి.



ఎయిర్‌పోర్ట్ మెట్రో తీరే వేరయా!

నగరం నలుమూలల నుంచి వెళ్లేలా స్వతంత్ర కారిడార్‌గా నిర్మాణం .. 1.5 కి.మీ.ల మార్గం అండర్‌గ్రౌండ్‌లో..

- మార్చి నాటికి రెండో దశ మెట్రో అనుమతులు
- రద్దీ ఆధారంగా స్టేషన్ల నిర్మాణం
- నెలవారీ పాస్‌లు తీసుకొస్తాం
- ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో 'హైదరాబాద్ మెట్రో' ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెట్రో రెండోదశలో భాగంగా చేపట్టనున్న ఎయిర్‌పోర్ట్ కారిడార్.. విభిన్నంగా ఉండనుందని, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కోచ్‌ల డిజైన్ ఉంటుందని, లగేజీ కోసం ర్యాక్‌లు, ఎస్కలేటర్లు, స్కైవాక్ వంటి సదుపాయాలు ఉంటాయని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్), హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. నగరం నలుమూలల నుంచి ఎయిర్‌పోర్టుకు సులువైన, చవకైన రవాణా కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఈ మేరకు ఇండిపెండెంట్ కారిడార్‌గా ఎయిర్‌పోర్ట్ కారిడార్‌ను తీర్చిదిద్దుతామన్నారు. 36.8 కి.మీ.లు ఉన్న ఈ మార్గంలో 1.5 కి.మీ.లు అండర్‌గ్రౌండ్ మెట్రో ఉంటుందన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఎన్వీఎస్ రెడ్డి రెండోదశ మెట్రోకు సంబంధించి పలు వివరాలు వెల్లడించారు. మెట్రో రెండో దశలో స్వదేశీ కోచ్‌లు ఉంటాయని, 'మేకిన్ ఇండియా' పథకంలో భాగంగా 80% వరకూ దేశీయ ఉత్పత్తులనే తీసుకుంటున్నామని వెల్లడించారు. ఐదు కొత్త కారిడార్లకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదంతో నెల క్రితమే కేంద్రానికి సమర్పించామని.. వచ్చే ఏడాది మార్చిలోపు డీపీఆర్‌కు ఆమోదం లభిస్తుందని పేర్కొన్నారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే అన్ని కారిడార్ల పనులను ఒకేసారి ప్రారంభించి 2028లోపు పూర్తి చేస్తామన్నారు. ఇంటర్వ్యూ పూర్తివివరాలు..

రెండో దశ విస్తరణపై ప్రభుత్వం స్పందన ఎలా ఉంది?

ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న అంశాల్లో మూసీ ప్రాజెక్టుతోపాటు మెట్రో విస్తరణ కూడా ఉంది. బెంగళూరులో వాహనాల రద్దీ పెరిగి కొన్ని సందర్భాల్లో ఒకటిన్నర కి.మీ.ల దూరానికి 2-3 గంటల సమయం పడుతోంది. అలాంటి పరిస్థితి మనకు రాకుండా ఉండాలంటే మెట్రో విస్తరణ అవసరమని చెప్పడంతో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. రెండో దశ అనుమతుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి.. కేంద్రమంత్రులను వరుసగా కలుసుకుని వీలైనంత వేగంగా అనుమతులు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు.



రెండో దశలో భూసేకరణ సమస్యలున్నాయా?

రెండో దశలో 5 కారిడార్లను 76.4 కి.మీ.ల మేర ప్రతిపాదించాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. మొదటి దశ మాదిరిగా రెండో దశకు భూసేకరణ సమస్యలు లేవు. కేవలం పాతబస్తీ కారిడార్‌లో మాత్రమే 1100 స్థలాలను (ప్రాపర్టీస్‌ను) సేకరించాల్సి వస్తోంది. వీటిలో ఇప్పటికే 900 స్థలాలకు సంబంధించి హైదరాబాద్ కలెక్టర్ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చాం. మిగిలినవాటికి త్వరలో ఇస్తాం. ఓల్డ్‌సిటీలో ఒక్క ప్రార్థనా మందిరానికీ ఇబ్బంది కలుగకుండా మెట్రోను నిర్మిస్తాం.

రెండో దశలో డిపోలు ఎక్కడ ఏర్పాటు చేస్తారు?

ప్రభుత్వ స్థలాల్లోనే ఏర్పాటు చేస్తాం. రాయదుర్గ్-నియోపోలీస్ మార్గంలో ఒకటి, పటాన్‌చెరు-మియాపూర్ మార్గంలో ఒకటి (ప్రస్తుతం ఉన్నదానికి అదనంగా), ఎయిర్‌పోర్టు రూట్‌లో మరొకటి ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.

ఎయిర్‌పోర్టు కారిడార్ ఎలా?

నగరం నలుమూలల నుంచి ఎయిర్‌పోర్టుకు సులువైన, చవకైన రవాణా కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అందుకే దీనిని ఇండిపెండెంట్ కారిడార్‌గా తీర్చి దిద్దుతున్నాం. 36.8 కి.మీ.లు ఉన్న ఈ మార్గంలో 1.5 కి.మీ.లు అండర్‌గ్రౌండ్ మెట్రో ఉంటుంది. ఎయిర్‌పోర్టుకు సుమారు 5-6 కి.మీ.ల దూరంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నెమ్మదిగా భూమి మీదకు తీసుకొస్తాం. ఇక్కడ కట్ అండ్ కవర్ (భూమిని కాలువలాగా తవ్వి కప్పడం) విధానంలో నిర్మిస్తాం. అండర్‌గ్రౌండ్‌లో 20 మీటర్ల వరకూ భూమిని తవ్వి నిర్మిస్తాం. ట్రక్‌ను టర్మినల్ స్టేషన్‌కి తీసుకెళ్తాం. ఈ కారిడార్‌ను ప్లాట్‌ఫాం టు ప్లాట్‌ఫాం డిజైన్‌లో నిర్మిస్తాం. భవిష్యత్‌లో పార్కింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. అన్ని స్టేషన్ల వద్ద విద్యుత్ వాహనాల (ఈవీ) చార్జింగ్ స్టేషన్లు నెలకొల్పుతాం.

రెండో దశలో సవాళ్లేమిటి?

రాయదుర్గ్-మైండ్‌స్పేస్, బైరామల్‌గూడ-హయత్‌నగర్, ఓల్డ్‌సిటీలో దారుల్‌షిఫా ప్రాంతాల్లో మెట్రో నిర్మాణం కిష్టంగా ఉండనుంది. మైండ్‌స్పేస్ దాటిన తర్వాత అండర్‌పాస్, బయోడైవర్సిటీ వద్ద ఫ్లై ఓవర్ ఉంది. అలాగే బైరామల్‌గూడ వద్ద ఫ్లైఓవర్ ఉంది. పాతబస్తీలో 106 ప్రార్థనా మందిరాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశాం. ఎక్కడ మలుపులు తీసుకోవాలనే దానిని పరిశీలించాం. కాబట్టి, వేటికీ ఇబ్బంది లేకుండా పనులు చేసే విధంగా డీపీఆర్ తయారు చేశాం.

టికెట్ రేట్లు ఎలా ఉంటాయి?

ప్రభుత్వమే రెండో దశ నిర్మాణం చేపడుతుండడంతో నిధులకు సమస్య ఉండదు. జైకా, ఏడీబీ లాంటి అంతర్జాతీయ బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు కేంద్రం సావరీన్ గ్యారెంటీ ఇస్తుండడంతో ఆర్థిక వనరులకు ఢోకా లేదు. కాబట్టి టికెట్ చార్జీలు పెరగవు. ఈసారి నెలవారీ పాస్‌లు తీసుకొస్తాం. వీటికి చాలా డిమాండ్ ఉంది.

ప్రజల సహకారం ?

మొదటి దశలో మెట్రో వద్దని చాలామంది అంటే.. ఇప్పుడు మాకు కావాలంటే మాకు కావాలని కోరుతున్నారు. మొదటి దశలో అనుభవం లేకపోవడంతో కొంత ఇబ్బందికి గురయ్యాం. నాపై కోర్టులో వందలాది మంది కేసులు వేశారు. అయినా.. భయపడకుండా ముందుకుసాగి పూర్తి చేశాం. ఇప్పుడు అటువంటి సమస్యలు లేవు.

ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని ఎలా అభివృద్ధి చేస్తారు?

మల్టీమోడల్ ఇంటిగ్రేషన్ ట్రాన్స్‌పోర్టు కింద ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని అభివృద్ధి చేస్తాం. ప్రతి స్టేషన్ నుంచి ఉదయం, రాత్రివేళల్లో ప్రయాణికులకు తక్కువ ధరతో రవాణా సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

మెటీరియల్ యార్డులను ఎక్కడ ఏర్పాటు చేస్తారు?

మొదటి దశలో సెగ్మెంటల్ విధానంలో మెట్రో పిల్లర్లను నిర్మిస్తే.. ఇప్పుడు యూ-గిడ్డర్ విధానంలో చేపడుతున్నాం. ఇందులో రెండు పిల్లర్ల మధ్య ఒకే గిడ్డర్ పెడతాం. ఫస్ట్‌ఫేజ్‌లో ఉప్పల్, కుత్బుల్లాపూర్‌లో కాస్టింగ్ (పిల్లర్లు, వయాడక్టుల తయారీ) యార్డులు ఏర్పాటు చేశాం. రెండో దశలో 5 కారిడార్లకు కావాల్సిన మెటీరియల్ అవసరం ఉండడంతో 6 చోట్ల యార్డులను ఏర్పాటు చేయనున్నాం. మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో రెండు, ఎయిర్‌పోర్టు మార్గంలో రెండు, కోకాపేట్ వద్ద ఒకటి, ఎల్బీనగర్ ఒక యార్డు ఉంటాయి.

స్టేషన్ల డిజైన్ ఎలా ఉండబోతోంది?

మొదటి దశలో అన్ని స్టేషన్లను ఒకే మాదిరిగా నిర్మించడంతో కొన్ని చోట్ల రద్దీ లేకుండా కనిపిస్తోంది. రాయదుర్గ్, అమీర్‌పేట్, నాగోల్, ఎల్బీనగర్, మియాపూర్ స్టేషన్లలో ప్రయాణికులు కిక్కిరిసి ఉంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రెండో దశలో మార్పులు చేస్తాం. ఎక్కువ మంది రాకపోకలు సాగించే స్టేషన్లను పెద్దగా నిర్మించాలని, జనం తక్కువ ఉండే చోట చిన్నగా నిర్మించాలని భావిస్తున్నాం. రాయదుర్గ్, ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, ఎయిర్‌పోర్టు కార్గో, టర్మినల్ స్టేషన్లను విశాలంగా నిర్మిస్తాం. అన్ని స్టేషన్లలో టాయిలెట్ల సదుపాయం కల్పిస్తాం. ఎయిర్‌పోర్టులో కలిగే భావన కలిగేలా కొత్త మెట్రో స్టేషన్లను తీర్చిదిద్దుతాం.

మెట్రోపై కాలుష్య ప్రభావం ఉందా?

వాహనాలు పెరిగి కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. దీంతో మొదటి దశలో తిరుగుతున్న రైళ్లకు సంబంధించిన సున్నిత పరికరాలు పాడైపోతున్నాయి. మియాపూర్ డిపోలో మెయింటనెన్స్ పనులు కాస్త తక్కువగా జరుగుతున్నప్పటికీ.. నాగోల్ డిపోలో ప్రతిరోజు వందలాది మంది సిబ్బంది పనిచేయాల్సి వస్తోంది. వాహనాల వినియోగాన్ని తగ్గించి కాలుష్యాన్ని అరికట్టాలంటే మెట్రో ఒక్కటే మెరుగైన సాధనం.

మెట్రోలో ఇప్పటి వరకు ప్రమాదాలు జరిగాయా?

ప్రైవేట్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో చేపట్టిన మెట్రో ప్రాజెక్టు ప్రపంచంలో కేవలం హైదరాబాద్‌లోనే ఉంది. పిల్లర్ల నుంచి ట్రాక్‌ల వరకు అన్నింటిని పకడ్బందీగా చేపట్టాం కాబట్టే మన వద్ద ఇప్పటివరకు ఒక్క యాక్సిడెంట్ కూడా జరగలేదు. ప్రమాదరహిత ప్రయాణాన్ని అందిస్తుండటంతో మాకు స్కాట్‌లాండ్‌కు చెందిన రాయల్ సొసైటీ వరుసగా మూడేళ్లుగా అవార్డులు అందజేస్తోంది.

మీ హయాంలోనే రెండు దశల నిర్మాణం జరగటంపై ఎలా భావిస్తున్నారు?

హైదరాబాద్ లాంటి మహానగరంలో మెట్రో పనులు నా హయాంలో జరగడం, జరుగుతుండడం చాలా సంతోషిస్తోంది. మొదటి దశలో, రెండో దశలో నేనే ఎండీగా ఉండడం ఆలిండియా రికార్డు. ప్రభుత్వాల సహకారంతోనే సమర్థంగా పనులు చేపడుతున్నా. విశ్వనగరంగా రూపుదిద్దుకుంటున్న హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ చాలా అవసరం. 2028లోగా రెండోదశను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

రెండో దశలో కోచ్‌లు ఎలా ఉంటాయి?

మొదటి దశ మాదిరిగానే రెండో దశ కోచ్‌లుంటాయి. అయితే, ఎయిర్‌పోర్టు కారిడార్ మెట్రోలో మాత్రం మార్పులు ఉంటాయి. ప్రయాణికులు లగేజీని తీసుకెళ్లేందుకు, కూర్చునేందుకు ఆ కోచ్‌లు ప్రత్యేక డిజైన్‌తో ఉంటాయి. లగేజీ ర్యాక్‌లు, ఎస్కలేటర్లు భిన్నంగా ఉంటాయి. రైలు నేరుగా ఎయిర్‌పోర్టు టర్మినల్‌కు వెళ్తుండటంతో అండర్‌గ్రౌండ్ ట్రాక్‌తోపాటు ఎయిర్‌పోర్టు కార్గో వరకు ఫుల్ ఏసీ సౌకర్యం ఉంటుంది. కాగా, నాగోల్ నుంచి రైలు ప్రారంభమవుతుండటంతో నాగోల్ క్రాస్‌రోడ్డులో స్టేషన్‌ను ఏర్పాటు చేస్తాం. ప్లాట్‌ఫాం నుంచి ప్లాట్‌ఫాంకు స్కైవాక్‌ను ఏర్పాటు చేస్తాం. దీని ద్వారా లగేజీని సులువుగా తీసుకెళ్లటానికి వీలవుతుంది. మెట్రో మొదటి దశలో 80% ముడిసరుకులను విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నాం. ట్రాక్‌ను పారిస్ నుంచి తీసుకొచ్చాం. కోచ్‌లు, ట్రాక్షన్ వైర్లు, సిగ్నలింగ్ పరికరాలను వివిధ దేశాల నుంచి తీసుకురావడంతో ఖర్చులు బాగా పెరిగాయి. అయితే, ప్రధాని మోదీ చేపట్టిన 'మేకిన్ ఇండియా'లో భాగంగా రైళ్లకు సంబంధించిన దాదాపు 80 రకాల ఉత్పత్తులను మన దేశంలోనే తయారు చేస్తున్నారు. దిగుమతులపై కస్టమ్స్ సుంకం ఉంటుంది కాబట్టి, ధరలు అధికంగా ఉంటాయి. స్వదేశీ ఉత్పత్తులపై ఆ సుంకం ఉండదు కాబట్టి, వ్యయం భారీగా తగ్గుతోంది. తద్వారా మెట్రో నిర్మాణ ఖర్చులు ఆదా అవుతున్నాయి. కేవలం 20% ముఖ్యమైన ఉత్పత్తులను మాత్రమే విదేశాల నుంచి తీసుకురావాల్సి ఉంటుంది.

మోహన్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ

జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్‌కు నో

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై దాడి కేసులో సినీనటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు ముందస్తు బెయిలు ఇవ్వడానికి న్యాయస్థానం నిరాకరించింది. మోహన్‌బాబుకు, ఆయన కుమారుడు మంచు మనోజ్‌కు ఏర్పడిన కుటుంబ వివాదాన్ని కవర్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టుపై మోహన్‌బాబు దాడి చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. మోహన్‌బాబు తరపు న్యాయవాది వాదిస్తూ.. మనోజ్‌తోపాటు కొంతమంది అసాంఘిక శక్తులు మోహన్‌బాబు ఇంటి ప్రాంగణంలోకి దూసుకొచ్చారన్నారు. వారు జర్నలిస్టులని తెలియదని, ఇంట్లోకి దూసుకొచ్చిన వారిని అడ్డుకునే ప్రయత్నంలో ఘర్షణ జరిగిందని పేర్కొన్నారు. అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. పోలీసుల తరపు న్యాయవాది వాదిస్తూ.. మంచు మనోజ్ ఆహ్వానం మేరకు జర్నలిస్టులు అక్కడికి వచ్చారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ముందస్తు బెయిలు ఇచ్చేందుకు నిరాకరించింది.

మోహన్‌బాబు కేసులో దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబుపై నమోదైన కేసుకు సంబంధించి రాచకొండ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే సాంకేతిక ఆధారాలు సేకరించిన పోలీసులు.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కాగా, మోహన్‌బాబు పరారీలో ఉన్నారని, అయన కోసం ఐదు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మోహన్‌బాబును అరెస్టు చేయడానికి పోలీసులు జల్‌పల్లిలోని ఆయన నివాసానికి వెళ్లగా.. అక్కడ మోహన్‌బాబు లేరని, ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారని వార్తలు వెలువడ్డాయి. దీనిపై పహాడీషరీఫ్ పోలీసులను వివరణ కోరగా.. అలాంటిదేమీ లేదని, ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉందని, విచారణ ముగిసిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

జర్నలిస్టుకు మోహన్‌బాబు క్షమాపణలు

జర్నలిస్టుపై దాడికి పాల్పడిన ఘటనపై మోహన్‌బాబు మరోసారి స్పందించారు. గాయపడిన జర్నలిస్టుకు క్షమాపణలు తెలియజేస్తూ ఎక్స్‌లో శుక్రవారం పోస్టు పెట్టారు. ఓ లేఖను కూడా విడుదల చేశారు. 'జర్నలిస్టు సోదరుడికి బాధ కలిగించినందుకు చాలా ఆవేదనగా ఉంది. ఆ రోజు దాదాపు 50 మంది వ్యక్తులు ఇంట్లోకి వచ్చారు. నేను సహనాన్ని కోల్పోయాను. ఈ గందరగోళం మధ్య మీడియా ప్రతినిధులు అనుకోకుండా వచ్చారు. ఓ జర్నలిస్టుకు గాయం అయింది. ఇది చాలా దురదృష్టకరం. క్షమించమని హృదయపూర్వకంగా కోరుతున్నా. గాయపడిన జర్నలిస్టు కోలుకోవాలని కోరుకుంటున్నా' అని మోహన్‌బాబు పేర్కొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ రంజిత్

మోహన్‌బాబు చేతిలో గాయపడిన జర్నలిస్ట్ రంజిత్ యశోద అస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కంటి, చెవిభాగంలో జైగోమేటిక్ బోన్ సర్జరీ చేసిన వైద్యులు స్టీల్ ప్లేట్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

కొత్త కబురు



తమిళ హీరో విక్రమ్ నటిస్తున్న కొత్త చిత్రం ఖరారైంది. శాంతి పిక్చర్స్ సంస్థ అధినేత అరుణ్ విశ్వ నిర్మించే ఈ చిత్రానికి మడోన్ అశ్విన్ దర్శకుడు. కొత్త తరహా కథాంశంతో రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో విక్రమ్ పాత్ర వినూత్నంగా ఉండబోతోందని దర్శకుడు అశ్విన్ చెప్పారు. ఈ సందర్భంగా నిర్మాత అరుణ్ మాట్లాడుతూ 'హీరోగా విక్రమ్ ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తినిస్తుంది. ఎన్నో అద్భుతమైన పాత్రలు పోషించిన ఆయనతో సినిమా తీయడం ఆనందంగా ఉంది. అలాగే 'మండేలా', 'మా వీరన్' చిత్రాల దర్శకుడు అశ్విన్‌తో కలసి మరో సారి పని చేస్తున్నాం. త్వరలో షూటింగ్ ప్రారంభమవుతుంది' అని చెప్పారు.

ఇరవై ఏళ్ల తర్వాత మళ్లీ..



తమిళ హీరో సూర్య నటించే 45వ చిత్రం ఇటీవలే ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ పొల్లాచ్చిలో జరుగుతోంది. ఇందులో హీరోయిన్‌గా త్రిష నటిస్తున్నట్లు చిత్ర నిర్మాతలు ఎస్.ఆర్. ప్రకాశ్ బాబు, ఎస్.ఆర్. ప్రభు చెప్పారు. దాదాపు ఇరవై ఏళ్ల తర్వాత మళ్లీ సూర్య, త్రిష ఇందులో జంటగా నటిస్తుండడం విశేషం. పేరు నిర్ణయించని ఈ సినిమాలో సూర్య, త్రిష ఇద్దరూ లాయర్ పాత్రలు పోషిస్తుండడం మరో విశేషం. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆర్జే బాలాజీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.

రామ్‌చరణ్‌కు 'రంగస్థలం'... నరేశ్‌కి 'బచ్చలమల్లి'

నిర్మాత రాజేశ్ దండా



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ జంటగా నటించిన చిత్రం 'బచ్చలమల్లి', సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత రాజేష్ దండా మీడియాతో ముచ్చటిస్తూ' బచ్చలమల్లి 80వ దశకంలోని కథ. చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ కథను మూడేళ్ల క్రితమే విన్నాను. సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశాను. ఇది ఫ్యామిలీ యాక్షన్ డ్రామా. క్యారెక్టర్ డ్రివెన్ సినిమా ఇది. ఈ మూవీ డైరెక్టర్ ఊరు తుని. ఆ ఊర్లో బచ్చలమల్లి అనే వ్యక్తి ఉండేవాడు. అతని రియల్ లైఫ్‌లో జరిగిన ఒక సంఘటనను మాత్రమే తీసుకుని అల్లిన కథ. మిగతాదంతా ఫిక్షన్. రామ్‌చరణ్‌కి 'రంగస్థలం' ఎలాగో, నరేశ్‌కి 'బచ్చలమల్లి' అలాంటి సినిమా అవుతుంది. కథ ప్రకారం సహజమైన లోకేషన్లలో తీయాలని అన్నవరం, తుని చుట్టుపక్కల గ్రామాల్లో చిత్రీకరించాం. మూర్ఖత్వం హద్దులు దాటితే ఎలా ఉంటుందో.. అలాంటి పాత్రలో నరేశ్ నటించారు. జీవితంలో తప్పులు చేయొచ్చు. సరిదిద్దుకోలేని తప్పులు చేస్తే ఏంటీ అనేది చిత్ర కథ' అని చెప్పారు.

భక్తులు చనిపోతే దేవుళ్లను అరెస్టు చేస్తారా?



అల్లు అర్జున్ అరెస్టుపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తనదైనశైలిలో స్పందిస్తూ నాలుగు ప్రశ్నలు వేశారు. అవి ఏమిటంటే..
1. పుష్కరాలు, బ్రహ్మోత్సవాల తోపులాటలో భక్తులు చనిపోతే దేవుళ్లను అరెస్టు చేస్తారా? 2. ఎన్నికల ప్రచారాల తొక్కిసలాటలో ఎవరైనా మరణిస్తే రాజకీయ నాయకులని అరెస్టు చేస్తారా?
3. సినిమాల ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఎవరైనా చనిపోతే హీరో, హీరోయిన్లని అరెస్టు చేస్తారా? 4. భద్రత ఏర్పాట్లను పోలీసులు, నిర్వాహకులు తప్ప హీరోలు, నాయకులు ఎలా కంట్రోల్ చేస్తారు?

నవ్య | చిత్రజ్యోతి

అల్లు అర్జున్‌ని అరెస్ట్ చేయడం సరికాదంటూ మొదట బాలీవుడ్ నుంచి వరుణ్ ధావన్ స్పందించారు. ఆ తర్వాతే టాలీవుడు సెలబ్రిటీలు ట్వీట్ చేశారు.

హృదయ విదారక ఘటన



సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే అత్యుత్సాహం సాధారణ పౌరుల రక్షణలో కూడా చూపించాలని కోరుకుంటున్నా. మనం మంచి సమాజంలో జీవించాలి. ఇదొక దురదృష్టకర ఘటన. దీని నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. ఇకపై మరిన్ని జాగ్రత్తలు పాటించి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇక్కడ మనందరి తప్పు ఉంది. ఒక వ్యక్తిని నిందించడం కరెక్ట్ కాదు. - నాని

నమ్మలేక పోతున్నా



ప్రస్తుతం జరుగుతున్నది నమ్మలేక పోతున్నా. జరిగిన సంఘటన దురదృష్టకరం, చాలా బాధాకరం. అయితే, తప్పంతా ఒక వ్యక్తిపైకి నెట్టడం సమంజసం కాదు. - రష్మిక

బాధాకరం



సంధ్యా థియేటర్ వద్ద జరిగిన ఘటన బాధాకరం. మరిన్ని జాగ్రతలు తీసుకుని ఉండాల్సింది. ఈ ఘటనకు అల్లు అర్జున్‌ని బాధ్యుడిగా చేయడం దారుణం. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. - అనిల్ రావిపూడి

దురదృష్టకరం



థియేటర్ వద్ద ఘటన దురదృష్టకరం. ఒక తల్లి ఆ రోజు ప్రాణాలు కోల్పోయింది. కానీ ఈ రోజు అల్లు అర్జున్ పట్ల జరిగింది మాత్రం చాలా కఠినమైన చర్య. - అడవి శేష్

అన్యాయం



ఈ ఘటన బాధాకరం. భద్రతాపరమైన, ఇతర అంశాలను నటీనటులు ఒక్కరే చూసుకోలేరు. జాగ్రత్తగా ఉండాలని మాత్రమే వాళ్ల చుట్టు పక్కల వారికి సూచిస్తుంటారు. ఒక వ్యక్తిని మాత్రమే నిందించడం అన్యాయం. - వరుణ్ ధావన్

జవాబు చెప్పాలి



అల్లు అర్జున్ ఏమైనా టెర్రరిస్టా? ఇంట్లోకి దూరి అరెస్ట్ చేయడం ఏమిటి? ఈ అరెస్టుపై రేవంత్ రెడ్డి అందరికీ జవాబు చెప్పాలి. - రవి కిషన్

మహిళ చనిపోతే కేసు పెట్టరా?

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేసి, అమ్ముకుని డబ్బులు సంపాదించుకుంటారని తెలిపారు. అంతేకానీ, "వాళ్లేమైనా పాకిస్థాన్ బార్డర్‌కు వెళ్లి దేశం కోసం యుద్ధం గెలిచి వచ్చారా? సినిమా తీశారు. పైసలు సంపాదించారు" అని చెప్పారు. దీంట్లో 'మీకు, మాకు ఏం వస్తుంది?' అని రేవంత్ ప్రశ్నించారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన 'ఇండియా టుడే' చర్చా వేదికలో అల్లు అర్జున్ అరెస్టుపై అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం ప్రకారం దేశ ప్రధానికైనా, సామాన్యుడికైనా ఒకే చట్టమని స్పష్టం చేశారు. రాజ్యాంగంతో చెలగాటమాడితే ఎవరైనా జైలుకు వెళ్లాల్సిందేనని హెచ్చరించారు. పుష్ప-2 సినిమా విడుదల రోజు ముందస్తు ప్రదర్శన (బెనిఫిట్ షో)కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆ ప్రదర్శనకు రూ.300 టికెట్‌ను రూ.1300కు పెంచుకునే వెసులుబాటు కల్పించింది. ఆ ప్రదర్శన సమయంలో థియేటర్ వద్ద ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు లేకుండానే హీరో అల్లు అర్జున్ అక్కడికి వెళ్లారు. తొక్కిసలాట జరిగింది. ఒక మహిళ చనిపోయింది. ఆమె కొడుకు 13 రోజులుగా ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ ఘటనలో పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. థియేటర్ యాజమాన్యంతోపాటు పలువురిని అరెస్టు చేశారు. పదిరోజుల తర్వాత అల్లు అర్జున్ ఇంటికి పోలీసులు వెళ్లారు. అరెస్ట్ చేసి, కోర్టులో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఇదంతా చట్ట ప్రకారమే జరిగింది" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇదంతా పక్కన పెడితే, ఆ ఘటనలో ఒక నిండు ప్రాణం పోయిందని గుర్తించాలన్నారు. ఒక మహిళ చనిపోయిన తర్వాత కూడా కేసులు పెట్టకపోతే ప్రజలెలా ఊరుకుంటారని ప్రశ్నించారు. తమ పాలనలో సినిమా హీరోకు ఒక రాజ్యాంగం, సామాన్యుడికి మరో రాజ్యాంగం.. అనే చర్చ మొదలవుతుందని చెప్పారు. నేరం చేసిందెవరన్నదే ముఖ్యమని, వాళ్లు సినిమా హీరోలా? రాజకీయ నేతలా? అన్నది తమకు అనవసరమని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమే అన్నారు. "అల్లు అర్జున్ కారులో థియేటర్‌కి వెళ్లి సినిమా చూసి వెళ్లిపోతే సమస్యే ఉండేది కాదు. అలా కాకుండా కారెక్కి అభివాదాలు చేస్తూ, అభిమానుల్లో గందరగోళం సృష్టించారు. దీనివల్లే అక్కడ పరిస్థితి అదుపు తప్పింది. తొక్కిసలాట జరిగింది. అల్లు



అర్జున్‌ను ఈ కేసులో ఏ11గా పేర్కొన్నారు. అయినా ఒక మహిళ మరణానికి బాధ్యత ఎవరు తీసుకుంటారు? తొమ్మిదేళ్ల బాబు చావు బతుకులతో పోరాడుతున్నాడు. ఇందులో ప్రభుత్వం, పోలీసుల బాధ్యత ఏదో మీరే చెప్పండి. ఇది అల్లు అర్జున్ చిత్రం. ఆయన కావాలంటే స్టూడియోలో లేదా ఇంట్లో ప్రత్యేక ప్రదర్శన వేయించుకొని చూడొచ్చు. అలాకాకుండా ప్రజల్లోకి వెళ్లి చూడాలంటే పోలీసులకు సమాచారమివ్వాలి. ఎలాంటి సమాచారం లేకుండా నేను ఏదైనా కార్యక్రమానికి హాజరైతే, అక్కడ ఏమైనా జరిగితే.. నాపైనా కేసు నమోదు చేసే అవకాశం ఉంది" అని రేవంత్ అన్నారు.

చిన్నప్పటి నుంచే తెలుసు..

అల్లు అర్జున్ తనకు చిన్నప్పటి నుంచే తెలుసని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆయన మేనమామ చిరంజీవి కాంగ్రెస్ నేత అని, అర్జున్‌కు పిల్లనిచ్చిన మామ చంద్రశేఖర్‌రెడ్డిది కూడా కాంగ్రెస్ కుటుంబమేనని గుర్తుచేశారు. చంద్రశేఖర్‌రెడ్డి తరఫున అల్లు అర్జున్ తనకు బంధువే అవుతారన్నారు. అయినప్పటికీ చుట్టరికం, బంధాలతో పట్టింపు లేదని, ఈ వ్యవహారంలో పోలీసులు చట్టాన్ని అమలు చేశారని చెప్పారు. మరో ప్రశ్నకు సమాధానమిస్తూ చట్ట ప్రకారం ఎవరైనా ఆందోళనలు చేయొచ్చని, అయితే అనుమతి లేకుండా ఆందోళనకు దిగితే జైలుకు వెళ్లాల్సిందేనని హెచ్చరించారు. మీడియా సమావేశంలో అల్లు అర్జున్ తెలంగాణ సీఎం పేరు మరిచిపోయారనే అరెస్టు చేశారంటూ వార్తలు వస్తున్నాయని అడగ్గా.. అవన్నీ ఊహాగానాలేనని రేవంత్ పేర్కొన్నారు. అలాగే, తాను వ్యక్తిగతంగా సూపర్ స్టార్ కృష్ణ అభిమానినని, ఆయనిప్పుడు లేరని రేవంత్ చెప్పారు. ఇప్పుడు ఉన్నవాళ్లలో ఏ హీరో అంటే ఇష్టమని యాంకర్ అడగ్గా.. తానే ఒక స్టార్ అని, స్వయంగా స్టార్‌గా ఎదిగానని బదులిచ్చారు.

అప్పుడు రాజుల తల్లి.. ఇప్పుడు కిసాన్ తల్లి..

"బీఆర్ఎస్ హయాంలో పెట్టిన తెలంగాణ తల్లి విగ్రహం రాజుల తల్లిలా ఉండేది. మేం ఆవిష్కరించిన విగ్రహం రైతుల తల్లి. మేం రైతు బిడ్డలం కాబట్టి కిసాన్ తల్లిని రూపొందించుకున్నాం" అని రేవంత్ తెలిపారు. విగ్రహంలోని చెయ్యి.. కాంగ్రెస్ గుర్తును పోలి ఉందన్న విమర్శలను ఆయన కొట్టిపారేశారు. భారత మాత చిత్రం, గౌతమ బుద్ధ, షిరిడీ సాయి విగ్రహాల్లోనూ చెయ్యి ఇలాగే ఉంటుందని గుర్తుచేశారు. రాజ్యాంగం, సామాన్య ప్రజలతో పెట్టుకుంటే కచ్చితంగా జైలుకు పంపిస్తామని పునరుద్ఘాటించారు.

రుణమాఫీని ఏ రాష్ట్రంలో చేశారో చెప్పండి

ప్రతి పేదవాడి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానన్న మోదీ గ్యారెంటీ ఏమైందని రేవంత్ ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు అవుతున్నా ఆ హామీని ఎందుకు నిలబెట్టుకోలేదని నిలదీశారు. కానీ, తమ సర్కారు ఏడాదిలోనే అనేక హామీలు అమలు చేసిందన్నారు. కేవలం 10 నెలల్లోనే 25,35,000 మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇలా చేశారా? అని నిలదీశారు. ఏడాదిలో 55,143 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి రూ.4వేల కోట్లు చెల్లించిందని గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సుతో మెట్రోకు నష్టం వాటిల్లుతుందన్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. ఈ విషయంలో మెట్రో సీఎఫ్‌వో రాజకీయ ప్రేరేపిత ప్రకటన చేశారన్నారు. ఇతర పార్టీలతో కలిసి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరించారని తెలిపారు. అందుకే ఆయన్ని అరెస్ట్ చేయాలని ఆదేశించామని గుర్తుచేశారు. ఆయన ముంబై పారిపోయారన్నారు.

తెలంగాణకు నేను బాధ్యుడిని.. దేశానికి కాదు కదా?

తెలంగాణకు మాత్రమే తాను బాధ్యుడినని, హరియాణా, మహారాష్ట్రలో కాంగ్రెస్ ఓటమి గురించి ఆ రాష్ట్ర నేతల్ని అడగాలని రేవంత్ సూచించారు. 'ఒకవేళ మాట్లాడాల్సి వస్తే కాంగ్రెస్ అధినేత రాహుల్ వద్ద మాట్లాడతాను తప్ప ఈ రాహుల్ దగ్గర మాట్లాడను' అంటూ నవ్వులు పూయించారు. ఎన్నికల్లో ఓటమిపై రాహుల్‌తో పోస్ట్‌మార్టం చేస్తే బాగుంటుంది తప్ప ఆజ్‌తక్ జర్నలిస్ట్ రాహుల్ కన్వల్‌తో పంచనామా ఏం బాగుంటుంది? అని వ్యాఖ్యానించారు. దేశం, రైతుల కోసం బీజేపీ అజెండా ఏమిటో ప్రజల ముందు ఉంచాలన్నారు. బీజేపీ చెప్పేదానికి, చేసేదానికి సంబంధం ఉండదని, దాన్ని ప్రజలకు వివరించడం వల్లే తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు సాధ్యమైందని వివరించారు. "నా కంటే ముందు ఇదే సీట్లో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ కూర్చున్నారని చెప్పారు కదా? ఆయన మూడుసార్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో 750మంది రైతులు ప్రాణాలు అర్పించారు. మరణించిన వారి కుటుంబాలను కలవడానికి కూడా మోదీ ప్రయత్నించలేదు. నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటున్నామని ప్రకటించేసి.. క్షమాపణల పేరుతో ఓట్లు అడుక్కున్నారు. కేంద్ర మంత్రి కొడుకు ఉత్తరప్రదేశ్‌లో రైతులపైకి వాహనం ఎక్కించి హత్య చేశాడు. ఇప్పుడా కేసు ఏమైంది? ఇదీ.. అసలైన బీజేపీ రంగు, ముఖం. ఇదంతా ప్రజలకు తెలియజేస్తే చాలు. వారే ఆ పార్టీని ఓడిస్తారు" అని రేవంత్ రెడ్డి తెలిపారు.

ఆర్ఆర్ ట్యాక్స్‌పై ఆధారం ఉందా

రాహుల్, రేవంత్ ట్యాక్స్ (ఆర్ఆర్ ట్యాక్స్) పేరుతో ఆరోపణలు చేస్తున్న నరేంద్ర మోదీ, దీనికి సంబంధించి ఒక్క ఆధారం ఉన్నా చూపాలని డిమాండ్ చేశారు. మోదీ బీజేపీ నాయకుడిగా ఇలాంటి ఆరోపణలు చేస్తే పర్వాలేదని, దేశ ప్రధానిగా ఉండి ఇలా మాట్లాడడం సరికాదన్నారు.

ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యాన్ని అందించాం..

తెలంగాణ ప్రజలకు ఏడాది పాలనలోనే ఆరు గ్యారెంటీలతోపాటు ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యాన్ని అందించామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇదే బీఆర్ఎస్‌కు, తమకు ఉన్న తేడా అని వివరించారు. "కేసీఆర్ హయాంలో ప్రజా భవన్‌ని గడీగా మార్చారు. నేను ప్రమాణం చేసిన వెంటనే గడీ గేట్లను బద్దలు కొట్టాను. రోజుకు 1000 మంది తమ గోడును చెప్పుకొంటున్నారు. కేసీఆర్ పదేళ్లలో 10 సార్లు కూడా సచివాలయానికి రాలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు దశలవారీగా జీతాలిచ్చారు. కానీ మేం ఒకటో తేదీనే జీతాలిస్తున్నాం. రాష్ట్రంలో కోల్పోయిన ప్రజాస్వామ్యాన్ని మళ్లీ తిరిగి తెచ్చాం. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వపు మొదటి విజయం. వైబ్రెంట్ గుజరాత్‌కు పోటీగా రైజింగ్ తెలంగాణ పేరుతో కౌంటర్ ప్రాడక్ట్‌ను సిద్ధం చేశాం. ఏడాదిలోగా గుజరాత్‌ను వెనక్కి నెట్టి, రైజింగ్ తెలంగాణను ముందుకు తీసుకెళతాం. మా అధినేత రాహుల్‌దీ, నాదీ ఒకటే లైన్. అర్థం చేసుకోవడంలోనే ఇబ్బంది ఉంది. అదానీ, బిర్లా ఎవరైనా పోరాడే గ్రౌండ్ ఒక్కటే ఉండాలి. అందరికీ సమాన అవకాశాలు ఉండాలన్నదే మా లక్ష్యం. ముంబై విమానాశ్రయాన్ని తెలుగు రాష్ట్రాలకు చెందిన జీవీకే కంపెనీ నిర్మించింది. కానీ, ఈడీ, ఐటీ, సీబీఐ జీవీకేపై దాడులు చేసి కేసులు పెట్టాయి. ముంబై విమానాశ్రయం అదానీకి అప్పగించగానే ఆ కేసులన్నీ మాఫీ అయ్యాయి. నిజంగా అమెరికా ఆరోపణల్లో నిజం లేకపోతే అదానీ ముడుపుల వ్యవహారంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటుకు మోదీ ఎందుకు వెనకడుగు వేస్తున్నారు" అని రేవంత్ ప్రశ్నించారు.

మంత్రివర్గ విస్తరణపై చర్చలేమీ లేవు: రేవంత్

చట్టం ముందు అందరూ సమానులేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రులను కలవడానికి వెళ్లిన సీఎంను మీడియా ప్రతినిధులు కలిశారు. అల్లు అర్జున్ అరెస్టు, ఇతర ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. "చట్టం తన పని తాను చేసుకుపోతుంది. అందులో నా జోక్యమేమీ ఉండదు. చట్టం ముందు అందరూ సమానులే. తొక్కిసలాటలో ఒకరు చనిపోయినందునే పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. మోహన్‌బాబు విషయంలో కోర్టు ఉత్తర్వులున్నాయి కదా? పోలీసులు తమ పని తాము చేసుకుంటూ వెళతారు. ఓవైపు పార్లమెంట్, మరోవైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. మంత్రివర్గ విస్తరణపై చర్చలేమీ లేవు. అభివృద్ధి, సంక్షేమంపైనే ఎక్కువ దృష్టి. క్యాబినెట్ విస్తరణ జరగాలంటే పీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి, ముఖ్యనేతలతో చర్చలు జరగాలి కదా?" అని రేవంత్ అన్నారు.

వెనకబడిన జిల్లాల గ్రాంట్ 1800 కోట్లు ఇవ్వండి

- ఉమ్మడి సంస్థల నిర్వహణ వ్యయం రూ.408 కోట్లు ఇప్పించండి
- కోచ్ ఫ్యాక్టరీని త్వరగా పూర్తి చేయండి
- కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ వినతి

న్యూఢిల్లీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన రైల్వే ప్రాజెక్టులనూ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో శుక్రవారం ఆయన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి.. తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని వెనకబడిన జిల్లాలకు ఇచ్చే గ్రాంట్ రూ.1800 కోట్లు పెండింగ్‌లో ఉందని, ఆ మొత్తాన్ని తక్షణమే విడుదల చేయాలని నిర్మలా సీతారామన్‌ను కోరారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌లోని హైకోర్టు, రాజ్‌భవన్, లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ తదితర ఉమ్మడి సంస్థల నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.703.43 కోట్లు భరించిందని, అందులో ఆంధ్రప్రదేశ్ వాటా రూ.408.49 కోట్లను చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఆ డబ్బు చెల్లింపునకు ఏపీ సమ్మతించినా.. నేటికీ ఇవ్వలేదని, ఆ నిధులను వడ్డీతో సహా చెల్లించేలా ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య రుణాల పంపిణీలో తెలంగాణ నుంచి రూ.2,547.07 కోట్ల రికవరీకి కేంద్రం ఏకపక్షంగా ఆదేశాలిచ్చిందని రేవంత్ తెలిపారు. దీనిపై పునఃసమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను 2014-15లో కేంద్రం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కేటాయించిందని తెలిపారు. పునర్విభజన చట్టంలోని జనాభా ప్రాతిపదికన ఆ మొత్తంలో ఏపీ నుంచి తెలంగాణకు రూ.495.20 కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉందన్నారు. వాటిని ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.



కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం రేవంత్ రెడ్డి

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని త్వరగా పూర్తి చేయండి

కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీని త్వరగా పూర్తిచేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సీఎం రేవంత్ కోరారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం స్వయంగా తాను లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. వికారాబాద్-కృష్ణా స్టేషన్ మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలు మార్గం నిర్మించాలని కోరారు. దీనివల్ల దక్షిణ తెలంగాణలో వెనకబడిన ప్రాంతాలైన పరిగి, కొడంగల్, చిట్లపల్లె, టేకల్ కోడ్, రావులపల్లి, మాటూరు, దౌల్తాబాద్, దామరగిద్ద, నారాయణపేట్, మక్తల్ అభివృద్ధి చెందుతాయని చెప్పారు. కల్వకుర్తి-మాచర్ల మధ్య నూతన రైలు మార్గం నిర్మిస్తే సిమెంట్ పరిశ్రమలతోపాటు అటవీ ఉత్పత్తుల విక్రయానికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ మార్గంతో సికింద్రాబాద్, గుంటూరు, డోన్‌ను అనుసంధానం చేయవచ్చని, తద్వారా శ్రీశైలం వెళ్లే భక్తుల ప్రయాణం సులభతరం అవుతుందని చెప్పారు. డోర్నకల్-మిర్యాలగూడ, డోర్నకల్-గద్వాల ప్రతిపాదిత రైలు మార్గాలను పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు రైలు మార్గాల్లో భూముల సేకరణ రైల్వే శాఖకు భారంగా మారుతుందని, ఆ మార్గాలను మార్చి డోర్నకల్ నుంచి వెన్నారం-మన్నెగూడెం-అబ్బాయిపాలెం-మరిపెడ మీదుగా మోతె వరకు వేస్తే.. 19 కి.మీ. దూరం కూడా తగ్గుతుందన్నారు.



ఫార్ములా-ఈ రేస్.. కేటీఆర్‌పై కేసు?

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్న తర్వాత ఏసీబీ దర్యాప్తు, కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ అనుమతించినట్లు తెలుస్తోంది. ఏసీబీ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఏసీబీ కోర్టుకు పంపించే కసరత్తు ప్రారంభించారు. ఆ తర్వాత కేటీఆర్‌కు నోటీసులు జారీ కానున్నాయి.

నాలుగేళ్లకు ఒప్పందం..

హైదరాబాద్‌లో నాలుగేళ్ల పాటు ఫార్ములా-ఈ రేస్ నిర్వహణకు సంబంధించి ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో), ఎస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ కలిసి పురపాలక శాఖ అధికారులు 2022 అక్టోబరు 25న త్రైపాక్షిక ఒప్పందం చేసుకున్నారు. దీంతో 2023 ఫిబ్రవరిలో తొలి ఫార్ములా-ఈ రేస్ నిర్వహించారు. ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో ఈ ఒప్పందం నుంచి ప్రమోటర్ కంపెనీ వైదొలగింది. దీంతో 2024లో రెండో సెషన్ రేస్ నుంచి హైదరాబాద్ పేరును ఎఫ్ఈవో తొలగించింది. రంగంలోకి దిగిన నాటి మంత్రి కేటీఆర్.. 2024లో కూడా హైదరాబాద్‌లోనే రేస్ నిర్వహించాలని, నోడల్ ఏజెన్సీగా హెచ్ఎండీఏ ఉంటుందని ఎఫ్ఈవోకు తెలిపారు. దీంతో ఎఫ్ఈవోతో పురపాలక సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. రేస్ నిర్వహణకు సుమారు రూ.100 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. వెంటనే పురపాలక శాఖ రూ.55 కోట్లు ఎఫ్ఈవోకు చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రేస్‌పై ఆరా తీసింది. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.55 కోట్లు చెల్లించడాన్ని తీవ్రంగా పరిగణించింది. నాటి పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద కుమార్‌ను బదిలీ చేసి విచారణకు ఆదేశించింది. రూ.55 కోట్ల చెల్లింపులపై వివరణ ఇవ్వాలని అర్వింద్‌కుమార్‌కు సీఎస్ శాంతికుమారి మెమో ఇవ్వగా.. నాటి మంత్రి కేటీఆర్ మౌఖిక ఆదేశాలతోనే నిధులు చెల్లించినట్లు అర్వింద్‌కుమార్ జవాబిచ్చారు. ఒక విదేశీ కంపెనీకి, విదేశీ కరెన్సీలో నిధుల చెల్లింపు జరిగినప్పుడు పాటించాల్సిన నిబంధనలను నాటి అధికారులు పాటించకపోవడంతో ప్రభుత్వం ఏసీబీ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలోనే అర్వింద్‌కుమార్‌తో పాటు పలువురు పురపాలకశాఖ అధికారుల నుంచి ఏసీబీ వివరాలు సేకరించింది. తాజాగా గవర్నర్ అనుమతులు రావడంతో ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియ పూర్తయిన వెంటనే కేటీఆర్‌తో పాటు కొందరు అధికారులకు నోటీసులు ఇవ్వడానికి ఏసీబీ కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.

రైతులను పూజించే ప్రభుత్వం మాది..

సంక్రాంతి తర్వాత రైతు భరోసా.. కాలువలు తెగితే అధికారులపై చర్యలు.. ఐదేళ్లపాటు సన్నాలకు 500 బోనస్

- త్వరలోనే కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ: ఉత్తమ్
- నిజాంసాగర్ నీటిని విడుదల చేసిన మంత్రి

(నిజాంసాగర్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)/నిజాంసాగర్/ముప్కాల్/హుజూర్‌నగర్/మేళ్లచెర్వు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులను పూజించే ప్రభుత్వం తమదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఇక నుంచి పంట బీమాతో పాటు సంక్రాంతి తర్వాత రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. మానవ తప్పిదాలతో కాలువలు తెగితే ఊరుకోమని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త లష్కర్‌లను నియమించబోతున్నామన్నారు. త్వరలోనే 1,300 మంది ఉద్యోగాలను భర్తీ చేయనున్నామని, దీనికోసం నియామక ప్రక్రియ చేపట్టాలని టీజీపీఎస్సీకి లేఖ రాశామని తెలిపారు. శుక్రవారం ఆయన కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతారావు, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి విడుదల చేశారు. ఆ తర్వాత శ్రీరాంసాగర్ ప్రాజెక్టును మంత్రి సందర్శించారు. అనంతరం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో చింతలపాలెం వద్ద గ్రామీణ రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఉత్తమ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్ల పాటు నీటిపారుదల శాఖను నిర్వీర్యం చేసిందన్నారు. తెలంగాణను తాకట్టు పెట్టి 1.81 లక్షల కోట్ల రుణాలు తీసుకుని కాళేశ్వరం పేరిట ప్రాజెక్టులను నిర్మించినా ఒరిగిందేమి లేదని విమర్శించారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఉత్తమ్. పక్కన పోచారం, లక్ష్మీకాంతారావు

ఐదేళ్ల పాటు సన్నాలకు బోనస్..

రైతాంగానికి రానున్న ఐదేళ్ల పాటు కూడా సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ఉత్తమ్ ప్రకటించారు. నిన్న, మొన్న కట్టిన డ్యామ్‌లు కూలిపోయాయని, బీసీ (బెనిఫిట్ కాస్ట్ రేషియో) బాగుంటే ఏ ప్రాజెక్టు అయినా చేపడతామన్నారు. ఏ ప్రభుత్వం చేయనంతా ఏడాది కాలంలో తాము చేశామన్నారు. 10 నెలల్లో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని.. రూ.4 వేల కోట్ల విలువ చేసే ప్రయాణాలు ఆర్టీసీ బస్సుల్లో మహిళలు చేశారని వివరించారు. త్వరలోనే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని.. సన్న బియ్యం పంపిణీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభమైందని, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు కూడా మంజూరు చేస్తామన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూడికతీత చేపట్టి, నిల్వను పునరుద్ధరిస్తామని వెల్లడించారు. రూ.వందల కోట్లతో కృష్ణానదిపై కొత్త ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తామని, కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకుంటామని చెప్పారు. ప్రాజెక్టుల కింద చివరి ఎకరా వరకు నీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. హుజూర్‌నగర్‌ను రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ఒక్క ఏడాదిలోనే కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో రూ.500 కోట్లతో గ్రామీణ రహదారులను నిర్మిస్తున్నామన్నారు.

నేడు సీఎం, మంత్రుల హాస్టళ్ల పరిశీలన

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల హాస్టళ్లను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పరిశీలించనున్నారు. అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వసతి గృహాల పరిస్థితులను అంచనా వేయనున్నారు. ఆహార పదార్థాల నాణ్యత, హాస్టళ్ల పరిసరాలను పరిశీలిస్తారు. గురుకుల హాస్టళ్లలో మరింత ప్రామాణికమైన, నాణ్యమైన ఆహారాన్ని, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో భాగంగా శనివారం హాస్టళ్లను పరిశీలించాలని నిర్ణయించారు.

రేపు సాయంత్రం క్యాబినెట్ భేటీ..?

నేడు ఆర్వోఆర్ తుది ముసాయిదాపై సీఎం సమీక్ష

ఎల్లుండి సభలో కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని ఆమోదించే అవకాశం

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి మళ్లీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందు ఉన్న ముఖ్యమైన బిల్లులు, కీలక అంశాలపై చర్చించేందుకు ఆదివారం సాయంత్రం క్యాబినెట్ సమావేశం ఉంటుందనే చర్చ అధికారుల్లో జరుగుతోంది. ఈ సమావేశంలో త్వరలో తీసుకురానున్న కొత్త ఆర్వోఆర్ చట్టం-2024 చర్చకు రానున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శనివారం సీఎం ఎ.రేవంత్ రెడ్డి ఆర్వోఆర్ తుది ముసాయిదాపై సమీక్షించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందుకు సంబంధించి రెండు రోజుల క్రితమే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఆర్వోఆర్ ముసాయిదాపై సీఎం సమీక్ష పూర్తయిన తరువాత ఆదివారం క్యాబినెట్‌లో చర్చించి.. ఇందుకు సంబంధించిన చట్టాన్ని సోమవారం సభలో ఆమోదించే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. పంచాయతీరాజ్ సవరణ బిల్లు కూడా సభలో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధమైనట్లు తెలిసింది.



తెలంగాణ విద్యుత్ పొదుపు వేడుకల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క

2030 నాటికి 20 గిగావాట్ల హరిత విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం: భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 2030 నాటికి 20 గిగావాట్ల హరిత విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా పెట్టుకున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20 దాకా జరిగే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీజీరెడ్‌కో) రూపొందించిన 2025 సంవత్సరం ఇంధన పొదుపు క్యాలెండర్‌ను ఆయన శుక్రవారం ప్రజాభవన్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. 2030 నాటికి 20 గిగావాట్లు, 2035 నాటికి 40 గిగావాట్ల హరిత విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏడాది కాలంగా రెడ్‌కో అమలు చేసిన కార్యక్రమాలను ఆ సంస్థ సీఎండీ వి.అనిల వివరించారు. చల్లని పైకప్పు(కూల్ రూఫ్ పాలసీ) విధానాన్ని దేశంలో అమలు చేస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణయేనని గుర్తుచేశారు.

పదేళ్లలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

- రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రానున్న పది సంవత్సరాల్లో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. కృత్రిమ మేధ, సెమీ కండక్టర్స్, క్వాంటమ్ కంప్యూటింగ్‌లు ఇందుకోసం చోదక శక్తులుగా దోహదం చేస్తాయన్నారు. కృత్రిమ మేధలో దిగ్గజ సంస్థ 'ఫెనామ్' శుక్రవారం హైటెక్‌సిటీలో నిర్వహించిన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కృత్రిమ మేధ, ఆటోమేషన్ వినియోగం ద్వారా విప్లవాత్మక మార్పులు సృష్టించడంలో ఉన్న అవకాశాలపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి 500 మందికి పైగా హెచ్ఆర్ నిపుణులు, సీఈవోలు, ఆవిష్కర్తలు హాజరయ్యారు.

కుల గణన సర్వేలో ఎస్సీ, ఎస్టీ బీసీ సంఘాలు భాగస్వాములు కావాలి

- సంక్షేమ పథకాల అమలుకు సర్వే సమాచారం కీలకం
- మంత్రి పొన్నం ప్రభాకర్
- మంత్రితో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల భేటీ

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వేను విజయవంతం చేసేందుకు కుల సంఘాలు, దళిత, గిరిజన, బీసీ సంఘాలు భాగస్వాములు కావాలని బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ప్రభుత్వం ఆయా వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు సర్వే సమాచారం కీలకమని చెప్పారు. కులాల వారీగా సంఖ్య తెలియకుంటే వారికి రావాల్సిన పథకాలు, రిజర్వేషన్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుందన్నారు. సంచార జాతులు, ఇతర అన్ని వర్గాల వారు సమాచారమిచ్చేలా కుల సంఘాల నాయకులు బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి పొన్నంతో బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, భాగ్యలక్ష్మి సమావేశమై సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తాజా పరిస్థితిపై చర్చించారు. సర్వేలో ఇంకా సమాచారమివ్వని వారుంటే ఆయా కుల సంఘాల ప్రతినిధులు చొరవ తీసుకుని సర్వే బృందాలకు సమాచారం ఇవ్వాలని మంత్రి కోరారు. పట్టణ ప్రాంతంలో రాజకీయ నాయకులు, అధికారులు, వ్యాపారులు చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు సమాజాన్ని ప్రభావితం చేసే ముఖ్యులు సర్వేలో భాగస్వాములు కావాలని కోరారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ.. సుమారు 85వేల మంది ఎన్యుమరేటర్లతో సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బీసీలకు సంబంధించి ఏ నిర్ణయం తీసుకోవాలన్నా సర్వే సమాచారం ఒక ప్రధాన ఆధారం అవుతుందన్నారు.

త్యాగానికి మారుపేరు యేసుక్రీస్తు: మంత్రి పొన్నం

త్యాగానికి మారుపేరైన యేసుక్రీస్తు సమాజంలో అందరికీ క్షమాగుణం ఉండాలని ప్రబోధించారని, లోకకల్యాణం కోసం అందరూ యేసు ప్రభువుకు ప్రార్థనలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సచివాలయంలో క్రిస్టియన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సచివాలయం చర్చిలో జరిగిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సెక్యులర్ భావాలతో అన్ని మతాలను గౌరవిస్తుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నంకు ఆశీర్వచనం చేస్తూ బ్రదర్ అనిల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ మైనారిటీ నాయకుడు అనిల్ థామస్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, క్రిస్టియన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు చిట్టి బాబు, లాల్ బహదూర్ శాస్త్రి, సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో రైల్వే తయారీ యూనిట్ పనులు పరిశీలించిన జీఎం

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో చేపట్టిన రైల్వే తయారీ యూనిట్ పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు వేగం పెంచాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్ తదితర ఉన్నతాధికారులతో కలిసి ఆయన శుక్రవారం ఖాజీపేట రైల్వే తయారీ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైల్వే డివిజనల్ అధికారులు పనుల పురోగతిపై సమగ్ర నివేదికను సమర్పించారు. జీఎం పనులు వేగవంతం చేయాలని సూచించారు.

సీనియర్లకు టెస్టు

రోహిత్, విరాట్‌లపై తీవ్ర ఒత్తిడి

నేటి నుంచి ఆసీస్‌తో మూడో టెస్టు


జైస్వాల్, గిల్

ఉదయం 5.50 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అత్యంత కీలక మ్యాచ్‌కు అంతా సిద్ధం. ఆరంభ టెస్టులో భారత్.. ఆ తర్వాత అడిలైడ్‌లో ఆసీస్ విజయాలతో సిరీస్ ప్రస్తుతానికి 1-1తో సమంగా ఉంది. ఈనేపథ్యంలో శనివారం నుంచి ఇరు జట్ల మధ్య స్థానిక గాబా మైదానంలో మూడో టెస్టు జరుగనుంది. నాలుగేళ్ల క్రితం ఇదే మైదానంలో రిషభ్ పంత్ వీరోచిత ఆటతీరు అభిమానులకు గుర్తుండే ఉంటుంది. మూడు దశాబ్దాల తర్వాత ఆసీస్‌కు ఓటమి రుచి చూపించింది. ఆ విజయంతో సిరీస్‌నే పట్టేసింది. ఆ గెలుపు ఉత్సాహంతోనే టీమిండియా ఈసారి కూడా బరిలోకి దిగాలనుకుంటోంది. ఎందుకంటే.. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు సిరీస్ దక్కించుకునే అవకాశాలు మరింత మెరుగవుతాయి. అయితే ఇప్పటిదాకా సాగిన రెండు మ్యాచ్‌లకన్నా ఈ వేదికపై బంతి ఎక్కువ పేస్, బౌన్స్‌తో బ్యాటర్లకు సవాల్ విసరనుంది. మరోవైపు గాబాలో భారత్‌కు మెరుగైన రికార్డేమీ లేదు. ఇక్కడ ఆడిన ఏడు టెస్టుల్లో ఒక్కటే (2020-21) గెలిచి ఐదింట్లో ఓడింది. అటు డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశించాలన్నా ఈ టెస్టులో కచ్చితంగా నెగ్గాల్సి ఉంటుంది.

రో-కో మెరిసేనా?

కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పేలవ ఫామ్ అభిమానులనే కాకుండా టీమ్ మేనేజ్‌మెంట్‌ను కూడా ఆందోళనలో పడేస్తోంది. జట్టును ముందుండి నడిపించాల్సిన ఈ జోడీ ఎలాంటి పోరాటమూ లేకుండా ఆసీస్ బౌలర్లకు దాసోహం కావడం బ్యాటింగ్‌పై ప్రభావం చూపిస్తోంది. కేవలం రెండు టెస్టుల అనుభవం కలిగిన యువ బ్యాటర్ నితీశ్ కుమార్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపిస్తున్న చోట అపార అనుభవం కలిగిన రో-కో తమకు ఆటే తెలీదన్నట్టు పెవిలియన్‌కు చేరడం జట్టుకు ఏమాత్రం మంచిది కాదు. ఈ ఏడాది సీజన్‌లో రోహిత్, కోహ్లీ తొలి ఇన్నింగ్స్ సగటు వరుసగా 6.88, 10గా ఉండడం గమనార్హం. పెర్త్‌లో సెంచరీతో కోహ్లీ కాస్త టచ్‌లోకి వచ్చినట్టు కనిపించినా.. రోహిత్ నుంచి కెప్టెన్ ఇన్నింగ్స్ రావాల్సి ఉంది. అది జరిగితే జట్టుకే కాదు అతడి నాయకత్వ పటిమకు కూడా నిదర్శనంగా నిలుస్తుంది. వీరిద్దరికీ ఇదే చివరి ఆసీస్ పర్యటనగా భావిస్తున్న తరుణంలో ఈ సిరీస్‌ను కచ్చితంగా భారత్ ఖాతాలో వేయాల్సిన అవసరం ఉంది. తమ బలహీనతల్ని అధిగమిస్తూ తాజా టెస్టులో చెలరేగాలని ప్రతీ అభిమాని కోరుకుంటున్నాడు. అయితే రోహిత్ ఓపెనర్‌గానా లేక మిడిలార్డర్‌లో వస్తాడా? అనే విషయంలో స్పష్టత లేదు. ఇక జైస్వాల్, పంత్‌తో పాటు గిల్ కూడా నిలకడగా ఆడితే భారీ స్కోరు సాధించగలుగుతుంది. స్పిన్ విభాగంలో అశ్విన్ స్థానంలో సుందర్, జడేజాలలో ఒకరిని తీసుకోవచ్చు. మూడో పేసర్‌గా ఆకాశ్‌దీప్‌ను ఆడిస్తారనే కథనాలు వినిపిస్తున్నాయి. కానీ రోహిత్ మాత్రం రాణా వైపే మొగ్గుచూపిస్తున్నట్టు సమాచారం. బుమ్రా, సిరాజ్‌లపై పేస్ భారం పడనుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్, పంత్, రాహుల్, నితీశ్ కుమార్, సుందర్/అశ్విన్, ఆకాశ్‌దీప్, సిరాజ్, బుమ్రా.

ఆస్ట్రేలియా: ఖవాజా, మెక్‌స్వీనే, లబుషేన్, స్మిత్, హెడ్, మార్ష్, క్యారీ, కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, లియోన్, హాజెల్‌వుడ్.

జట్టులోకి హాజెల్‌వుడ్

భారత్‌తో పోలిస్తే ఆస్ట్రేలియా బ్యాటింగ్ మెరుగ్గానే ఉంది. ట్రావిస్ హెడ్ టీమిండియా బౌలర్లపై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. అయితే రెండు టెస్టుల్లో 19 పరుగులు మాత్రమే చేసిన వెటరన్ స్టీవ్ స్మిత్ ఆకట్టుకోలేకపోతున్నాడు. గత 24 ఇన్నింగ్స్‌ల్లో ఒక్క శతకం కూడా నమోదుచేయలేకపోయాడు. లబుషేన్ పింక్ బాల్ టెస్టులో హాఫ్ సెంచరీతో ఫామ్ చాటుకున్నాడు. ఓపెనర్ మెక్‌స్వీనే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నాడు. కొత్త బంతితో బుమ్రా తొలి స్పెల్‌ను జాగ్రత్తగా ఆడి, మిగతా బౌలర్లపై ఎదురుదాడికి దిగాలని ఆసీస్ భావిస్తోంది. గాబాలో పేసర్లు స్టార్క్ 47, కెప్టెన్ కమిన్స్ 40 వికెట్లు తీయడం విశేషం. ఇక హాజెల్‌వుడ్ రాకతో ఆసీస్ పేస్ బలం మరింత పెరగనుంది.


ప్రాక్టీస్‌లో ఆసీస్ ఆటగాళ్లు

పిచ్, వాతావరణం

గాబా సహజంగా పేసర్లకు అనుకూలిస్తుంటుంది. ఈసారి కూడా బౌన్సీ పిచ్‌ను సిద్ధం చేసినట్టు క్యూరేటర్ తెలిపాడు. అయితే టెస్టుకు వరుణుడి నుంచి ముప్పు పొంచి ఉంది. తొలి మూడు రోజులు ఆకాశం మేఘావృతంగా ఉండనుంది. అలాగే నేడు వర్షం కురిసే అవకాశం 88 శాతంగా ఉండనుంది.

ట్రీసా-గాయత్రి జోడీ అవుట్

హాంగ్జౌ: వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత మహిళల బ్యాడ్మింటన్ జోడీ ట్రీసా జాలీ-గాయత్రి జోడీ పోరాటం ముగిసింది. శుక్రవారం గ్రూప్ 'ఎ'లో జరిగిన చివరి మ్యాచ్‌లో నమీ మట్సుయమ-చిహరు (జపాన్) చేతిలో 17-21, 13-21 తేడాతో భారత్ జోడీ ఓటమిపాలై సెమీస్ బెర్త్ కోల్పోయింది. ట్రీసా జాలీ-గాయత్రి మాత్రమే భారత్ నుంచి ఈ టోర్నీకి అర్హత సాధించగా.. తొలి మ్యాచ్‌లో ఓడిన వీరు రెండో మ్యాచ్‌లో గెలిచి సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకోగలిగారు. కానీ కీలక పోరులో ఓటమితో ఇంటిముఖం పట్టారు.

అఫ్ఘాన్ ఘనవిజయం

హరారే: అఫ్ఘానిస్థాన్ జట్టు జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 153 పరుగులు చేసింది. అనంతరం జింబాబ్వే 17.4 ఓవర్లలో కేవలం 103 పరుగులకే ఆలౌటైంది. నవీనుల్ హక్, రషీద్‌ఖాన్ మూడేసి వికెట్లు తీశారు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లోని తొలి వన్డేలో జింబాబ్వే నెగ్గింది.

చిత్తుగా ఓడిన బెంగళూరు

పుణె: పుణెరి పల్టన్‌తో జరిగిన ప్రొ కబడ్డీ మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ ఘోర పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో పల్టన్ 56-18 పాయింట్ల తేడాతో బుల్స్‌ను చిత్తుచేసింది. ఆడిన 18 మ్యాచ్‌ల్లో 15 ఓడిన బెంగళూరు పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 42-38 పాయింట్లతో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది.

ఎదురు చూపులు ఫలించాయి

ట్రోఫీ అందుకున్న గుకేష్




అమ్మానాన్నలతో..

సింగపూర్: సరికొత్త వరల్డ్ చెస్ చాంపియన్ గుకేష్ శుక్రవారం సగర్వంగా ట్రోఫీని అందుకున్నాడు. సాయంత్రం ఆహ్లాదకరంగా సాగిన ముగింపు కార్యక్రమంలో ఫిడే అధ్యక్షుడు అర్కేడి వోర్కోవిచ్ గోల్డ్ మెడల్‌తో పాటు ట్రోఫీని ప్రదానం చేశాడు. ఆ వెంటనే దీన్ని గుకేష్ తన తల్లిదండ్రులకు అప్పగించాడు. గురువారమే ముగిసిన ఈ టోర్నీలో 18 ఏళ్ల గుకేష్ చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించిన విషయం తెలిసిందే. తద్వారా అతిపిన్న వయస్సులోనే జగజ్జేతగా నిలవడంతో పాటు ఆనంద్ తర్వాత ఈ రికార్డు సాధించిన మరో భారత చెస్ ఆటగాడయ్యాడు. 'ఈ క్షణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. ప్రతీ రోజు ఉదయం చాంపియన్ కావాలన్న కలతోనే లేచేవాణ్ణి. ఎట్టకేలకు సాధించగలిగాను. ట్రోఫీని పట్టుకుని నిలిచిన ఈ క్షణాన.. జీవితంలో ఇంతకుమించి ఇంకేం కావాలనిపిస్తోంది' అని గుకేష్ అన్నాడు. అటు ఎన్నో త్యాగాల తర్వాత తమకు దక్కిన అద్భుతమైన ఆనంద క్షణాలివి అంటూ గుకేష్ తల్లి పద్మాకుమారి భావోద్వేగానికి గురయ్యారు. విజేతగా నిలిచాడనే వార్త తెలిశాక నమ్మలేకపోయానని, పది నిమిషాలపాటు ఆనందంతో ఏడ్చేశానని తెలిపారు. కుమారుడు ట్రోఫీని అందుకునే మధురక్షణాల్ని తనివితీరా చూసేందుకు ఆమె హుటాహుటిన సింగపూర్ బయల్దేరి వెళ్లారు. మరోవైపు అత్యున్నత శిఖరాన్ని అధిరోహించేందుకు ఎదురైన అడ్డంకులను చిన్నవయస్సులోనే గుకేష్ అధిగమించాడని మాజీ చాంపియన్ కాస్పరోవ్ కొనియాడాడు. అంతకుముందు గుకేష్ చాంపియన్ హోదాలో శుక్రవారం ఉదయం నుంచి బిజీబిజీగా గడిపాడు. రాత్రంతా నిద్ర లేకపోవడంతో కళ్లు ఎర్రగా మారినా.. చెదరని చిరునవ్వుతో అభిమానులకు ఆటోగ్రాఫ్‌లివ్వడం కనిపించింది.

గుకేష్‌కు రూ.5 కోట్లు


తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేష్‌కు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ రూ. 5 కోట్ల నగదు బహుమతిని ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విజేతగా నిలిచిన గుకేష్‌కు రూ. 11.45 కోట్ల ప్రైజ్‌మనీ లభించిన విషయం విదితమే.

ఫైనల్లో ముంబై, ఎంపీ

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ

బెంగళూరు: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో మధ్యప్రదేశ్, ముంబై జట్లు ఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యాయి. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో వెటరన్ ఆటగాడు అజింక్యా రహానె (98) అదరగొట్టడంతో ముంబై 6 వికెట్లతో బరోడాను ఓడించింది. తొలుత బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 158 పరుగులు చేసింది. శివాలిక్ (36 నాటౌట్), శాశ్వత్ రావత్ (33), కెప్టెన్ క్రునాల్ (30) ఫర్వాలేదనిపించారు. ఛేదనలో రహానెకు తోడు సారథి శ్రేయాస్ అయ్యర్ (46) ఆకట్టుకోవడంతో ముంబై 17.2 ఓవర్లలో 164/4 స్కోరు చేసి గెలిచింది. ఫైనల్ ఆదివారం జరగనుంది. ఇక మరో సెమీస్‌లో ఎంపీ 7 వికెట్లతో ఢిల్లీపై గెలిచింది. మొదట ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 146 పరుగులు చేసింది. అనూజ్ రావత్ (33 నాటౌట్) టాప్ స్కోరర్. ఛేదనలో కెప్టెన్ రజత్ పటీదార్ (66 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో సత్తా చాటడంతో ఎంపీ 15.4 ఓవర్లలో 152/3 స్కోరు చేసి గెలిచింది. హర్‌ప్రీత్ సింగ్ (46 నాటౌట్), హరీశ్ గాఫ్లీ (30) రాణించారు.


రహానె (98)

అదరగొట్టిన జంగూ

● బంగ్లాపై విండీస్ గెలుపు

● 3-0తో సిరీస్ కైవసం

సెయింట్‌కిట్స్: వికెట్‌కీపర్ బ్యాటర్ ఆమిర్ జంగూ (83 బంతుల్లో 104 నాటౌట్) అరంగేట్రంలోనే సెంచరీతో అదరగొట్టడంతో బంగ్లాదేశ్‌తో జరిగిన మూడో వన్డేలో వెస్టిండీస్ విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను విండీస్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలుత బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 321 రన్స్ చేసింది. ఛేదనలో వెస్టిండీస్ 45.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 325 పరుగులతో విజయం సాధించింది. కార్టీ 95 పరుగులు చేశాడు. ఇక ఆమిర్ కేవలం 80 బంతుల్లోనే శతకం పూర్తిచేసి అరంగేట్రంలో వేగంగా సెంచరీ చేసిన వెస్టిండీస్ ఆటగాడిగా రికార్డు పుటల్లోకి ఎక్కాడు. అలాగే వెస్టిండీస్ తరఫున ఓపెనర్ డెస్మండ్ హేన్స్ (1978లో) తర్వాత అరంగేట్రంలో సెంచరీ చేసిన రెండో ఆటగాడిగా నిలిచాడు.

అన్వయ్ ద్రవిడ్ అజేయ శతకం



మూలపాడు (ఆంధ్రప్రదేశ్): బ్యాటింగ్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ (100 నాటౌట్) విజయ్ మర్చంట్ ట్రోఫీలో అజేయ శతకంతో విజృంభించాడు. జార్ఖండ్‌తో శుక్రవారం ఇక్కడ ముగిసిన మూడ్రోజుల మ్యాచ్‌లో కర్ణాటక తరఫున నాలుగో నెంబర్ ఆటగాడిగా బరిలోకి దిగిన అన్వయ్ 10 ఫోర్లు, 2 సిక్సర్లతో సెంచరీ సాధించాడు. ఫలితంగా కర్ణాటక 123.3 ఓవర్లలో 441/4 స్కోరుతో చివరిరోజును ముగించింది. అంతకుముందు జార్ఖండ్ 387 పరుగులకు ఆలౌటైంది. ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది.



ప్రపంచ సంపన్నుల్లో అంబానీ కుటుంబం

రూ. 8.44 లక్షల కోట్లతో ఎనిమిదో స్థానం

షాపూర్జీ పల్లోంజీ కుటుంబానికీ చోటు: బ్లూమ్‌బర్గ్

న్యూయార్క్: ప్రపంచ కుబేర కుటుంబాల సంపద ఏటికేటికీ పెరిగి పోతోంది. అమెరికా రిటైల్ దిగ్గజం 'వాల్‌మార్ట్' వ్యవస్థాపకులు వాల్టన్ కుటుంబం ఈ విషయంలో 43,240 కోట్ల డాలర్ల (సుమారు రూ.36.65 లక్షల కోట్లు) సంపదతో ప్రపంచంలోనే అత్యంత సంపన్న కుటుంబంగా నిలిచింది. ఇది ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన టెస్లా అధినేత ఎలాన్ మస్క్ వ్యక్తిగత సంపద (44,700 కోట్ల డాలర్లు) కంటే కొద్దిగా తక్కువ. పశ్చిమాసియాలోని రాజ కుటుంబాల అందరి సంపదలతో పోలిస్తే మాత్రం వాల్టన్ కుటుంబ ఆస్తులే ఎక్కువ. దీనికి సంబంధించి బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ తాజాగా 'ప్రపంచ సంపన్న కుటుంబాలు, 2024' పేరుతో ఒక జాబితా విడుదల చేసింది.

అంబానీలకూ చోటు: ఈ జాబితాలో మన దేశానికి చెందిన రెండు కుటుంబాలకు చోటు దక్కింది. అంబానీ కుటుంబం 9,960 కోట్ల డాలర్ల (సుమారు రూ.8.44 లక్షల కోట్లు) సంపదతో ఎనిమిదో స్థానం సంపాదించింది. ఆ తర్వాత 4,140 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.5 లక్షల కోట్లు) సంపదతో షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన మిస్త్రీ కుటుంబం 23వ స్థానంలో నిలిచింది.

ప్రజలు శాట్‌ను ఆశ్రయించకుండా జాగ్రత్తపడాల్సింది సెబీనే

ఈడీ సుందరేశన్



ముంబై: ప్రజలు విభేదించలేని విధంగా, తన నిర్ణయాలను సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్)లో సవాలు చేయాల్సిన అవసరం లేకుండా నియమావళిని రూపొందించాల్సిన బాధ్యత మార్కెట్ నియంత్రణ మండలి సెబీదేనని ఈ నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) వీ సుందరేశన్ అన్నారు. సెబీకి మూడు దశాబ్దాలకు పైగా సేవలందిస్తోన్న సుందరేశన్.. ప్రపంచ హిందూ ఎకనామిక్ ఫోరమ్‌లో శుక్రవారం ప్రసంగించారు. మూలధన పెట్టుబడుల రాకకు తోడ్పడటంతో పాటు ఇన్వెస్టర్లలో భరోసా నింపడమే సెబీ ప్రాథమిక బాధ్యతని ఆయన ఈ సందర్భంగా అన్నారు. "సెబీ మైదానంలోని అంపైర్. కాగా, శాట్ థర్డ్ అంపైర్. మైదానంలోని అంపైర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ థర్డ్ అంపైర్‌ను ఆశ్రయించకుండా చూడాల్సిన బాధ్యత మైదానంలోని అంపైర్‌దే"నని ఆయన అభిప్రాయపడ్డారు. అంపైర్ (సెబీ) నిష్పక్షపాతంగా వ్యవహరిస్తేనే ఆట (మార్కెట్లో కార్యకలాపాలు) సజావుగా సాగుతుంది. తత్ఫలితంగా మన మార్కెట్‌పై ఇన్వెస్టర్లలో భరోసా పెరుగుతుందన్నారు. గడిచిన కొన్ని త్రైమాసికాల్లో సెబీ జారీ చేసిన పలు ఆదేశాలపై శాట్ స్టే విధించడం లేదా రద్దు చేయడం జరిగిన నేపథ్యంలో సుందరేశన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఆల్గో ట్రేడింగ్‌లోకి రిటైల్ మదుపరులు

ఆల్గోరిథమిక్ ట్రేడింగ్‌లో రిటైల్ మదుపరులు సైతం తగిన భద్రతతో పాల్గొనేందుకు అనుమతించాలని సెబీ ప్రతిపాదించింది. ఇందులో స్టాక్ బ్రోకర్లు, ఎక్స్ఛేంజీల పాత్ర, బాధ్యతలను నిర్దేశిస్తూ నియంత్రణ నియమావళితో కూడిన చర్చాపత్రాన్ని విడుదల చేసింది. తాజా ప్రతిపాదనలపై వచ్చే నెల 3 నాటికి ప్రజల నుంచి అభిప్రాయాలు కోరింది. ఆల్గో ట్రేడింగ్‌లో వేగంగా ఆర్డర్ల ఎగ్జిక్యూషన్‌తో పాటు లావాదేవీల వ్యయం తగ్గి, ద్రవ్య లభ్యత కూడా మెరుగుపడుతుంది. మార్కెట్ దక్షతతోపాటు పారదర్శకతను పెంచేందుకు డైరెక్ట్ మార్కెట్ యాక్సెస్ (డీఎంఏ) వసతి ద్వారా సెబీ 2008లో ఆల్గో ట్రేడింగ్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఈ వసతి సంస్థాగత ఇన్వెస్టర్లకు మాత్రమే అందుబాటులో ఉంది.

బిజినెస్



శక్తిమంత నిర్మల

ఫోర్బ్స్ అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో కేంద్ర ఆర్థిక మంత్రి

కిరణ్ మజుందార్ షా, రోష్నీ నాడార్‌కూ స్థానం

న్యూఢిల్లీ: ప్రపంచ సంపన్నుల జాబితాలోనే కాదు, అత్యంత శక్తిమంతులైన మహిళల జాబితాలోనూ భారతీయులు దూసుకుపోతున్నారు. ఫోర్బ్స్ పత్రిక ప్రకటించిన ప్రపంచంలో అత్యంత శక్తిమంతులైన మహిళల తాజా జాబితాలో ముగ్గురు భారతీయులకు స్థానం దొరికింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్, హెచ్‌సీఎల్ కార్పొరేషన్ సీఈఓ రోష్నీ నాడార్ మల్హోత్రా, బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా ఈ జాబితాలో స్థానం సంపాదించారు. ప్రపంచంలో అత్యంత శక్తిమంతులైన మహిళల్లో నిర్మలా సీతారామన్‌కు 28వ స్థానం, రోష్నీ నాడార్ మల్హోత్రాకు 81వ స్థానం, కిరణ్ మజుందార్ షాకు 82వ స్థానం దక్కాయి. ఈయూ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ప్రెసిడెంట్ క్రిస్టినా లగార్డె, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఈ జాబితాలో అగ్రస్థానం సంపాదించారు.

ఐటీ కంపెనీలకు హెచ్-1బీ వీసాల కష్టాలు

సగానికి తగ్గిన వీసాల ఆమోదం

న్యూఢిల్లీ: భారత ఐటీ కంపెనీలు అమెరికాలో గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. దేశంలోని ఏడు అగ్రశ్రేణి ఐటీ సంస్థలకు హెచ్-1బీ వీసాల జారీని అమెరికా కఠినం చేసింది. దీంతో ఈ వీసాలపై తక్కువ జీతాలకు తమ ఉద్యోగులను అమెరికా పంపించి ప్రాజెక్టులు పూర్తి చేయడం భారత కంపెనీలకు కష్టంగా మారింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో అమెరికా ప్రభుత్వం ఈ కంపెనీలకు 14,792 హెచ్-1బీ వీసాలు జారీ చేసింది. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24) ఇది ఏకంగా 7,299కు పడిపోయింది. నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ (ఎన్ఎఫ్ఏపీ) అనే సంస్థ ఈ వివరాలు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం అమెరికా ఆమోదించిన మొత్తం హెచ్-1బీ వీసాల్లో భారతీయుల వాటా కేవలం 5.2 శాతం మాత్రమే. ప్రస్తుతం మొత్తం అమెరికా ఉద్యోగుల్లో హెచ్-1బీ వీసాలపై పని చేస్తున్న భారతీయుల శాతం కేవలం 0.004 శాతం మాత్రమే. డొనాల్డ్ ట్రంప్ రెండో జమానాలో హెచ్-1బీ వీసాల జారీని కఠినం చేస్తే ఇది మరింత పడిపోతుందని భావిస్తున్నారు. దీంతో అమెరికాలో ప్రాజెక్టులు చేపడుతున్న భారత కంపెనీలు అధిక జీతాలు ఇచ్చి స్థానికుల్ని ఉద్యోగాల్లో నియమించుకోక తప్పడం లేదు. ప్రాజెక్టులు సన్నగిల్లిన తరుణంలో ఇది తమపై అదనపు భారం మోపడమేనని కంపెనీలు వాపోతున్నాయి.

-1,207 నుంచి +924 వరకు

ఇంట్రాడేలో 2,131 పాయింట్ల శ్రేణిలో ఊగిసలాడిన సెన్సెక్స్

ముంబై: వారాంతంలో ప్రామాణిక ఈక్విటీ సూచీలు భారీ ఒడుదుడుకులకు లోనయ్యాయి. శుక్రవారం నష్టాలతో ట్రేడింగ్ ఆరంభించిన సెన్సెక్స్.. ఒక దశలో 1,207.14 పాయింట్లకు వరకు క్షీణించి 80,000 స్థాయికి జారుకుంది. ఆ దశలో టెలికాం, ఐటీ, టెక్, బ్యాంకింగ్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్‌లో వాల్యూ బైయింగ్‌కు పాల్పడటంతో సూచీలు భారీ నష్టాల నుంచి పూర్తిగా తేరుకుని లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ ఒక దశలో 924 పాయింట్ల మేర వృద్ధి చెంది 82,214 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివర్లో సూచీ 843.16 పాయింట్ల లాభంతో 82,133.12 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 2,131 పాయింట్ల శ్రేణిలో ఊగిసలాడింది. నిఫ్టీ విషయానికొస్తే, ఆరంభ సెషన్‌లో 368 పాయింట్ల వరకు పతనమైన సూచీ మళ్లీ లాభాల్లోకి చేరుకుని 219.60 పాయింట్ల వృద్ధితో 24,768.30 వద్ద ముగిసింది. దాంతో మార్కెట్ సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ రూ.1.27 లక్షల కోట్ల పెరుగుదలతో రూ.459.42 లక్షల కోట్లకు చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 26 రాణించాయి. ఎయిర్‌టెల్ షేరు 4.39 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఐటీసీ, కోటక్ బ్యాంక్ స్టాక్స్ రెండు శాతానికి పైగా పెరిగాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.29 శాతం వరకు నష్టపోయాయి. రంగాలవారీ సూచీల్లో టెలికాం 2.13 శాతం ఎగబాకగా.. టెక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ ఇండెక్స్‌లు ఒక శాతానికి పైగా పెరిగాయి. బ్యాంకింగ్, ఐటీ సూచీలు అర శాతానికి పైగా లాభపడ్డాయి.

● డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసలు పెరిగి రూ.84.80 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో లాభాలు, ధరల సూచీ తగ్గుదల వంటి అంశాలు ఇందుకు దోహదపడ్డాయి.

● ఈ నెల 6తో ముగిసిన వారంలో విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 323.5 కోట్ల డాలర్ల మేర తగ్గి 65,485.7 కోట్ల డాలర్లకు పరిమితమైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

మొబిక్విక్ ఐపీఓకు 120 రెట్ల స్పందన

ఫిన్ టెక్ కంపెనీ మొబిక్విక్ సిస్టమ్స్ లిమిటెడ్ ఐపీఓకు భారీ స్పందన లభించింది. శుక్రవారంతో ముగిసిన ఈ రూ.572 కోట్ల ఐపీఓకు ఏకంగా 119.38 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కేటాయించిన షేర్లకు అత్యధికంగా 134.67 రెట్ల బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీల వాటా షేర్లకు 119.50 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 108.95 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.

● విశాల్ మెగామార్ట్ ఐపీఓ సైతం చివరి రోజు నాటికి 27.28 రెట్ల బిడ్లను ఆకర్షించగలిగింది. హైదరాబాద్‌కు చెందిన సాయి లైఫ్ సైన్సెస్ ఇష్యూ 10.26 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

● ప్యాకేజింగ్ యంత్రాల తయారీదారు మమత మెషినరీ రూ.179 కోట్ల ఐపీఓ ఈ నెల 19న ప్రారంభమై 23న ముగియనుంది. ఐపీఓ షేర్ల విక్రయ ధరల శ్రేణిని కంపెనీ రూ.230-243గా నిర్ణయించింది.

భారత్‌తో ఎంఎఫ్ఎన్‌కు స్విట్జర్లాండ్ కటీఫ్

న్యూఢిల్లీ: భారత-స్విట్జర్లాండ్ వాణిజ్య బంధానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ద్వంద్వ పన్నుల ఎగవేత నిరోధక ఒప్పందం (డీటీఏఏ)లో భాగంగా భారత్‌కు ఇచ్చిన 'అత్యంత ప్రాధాన్యతా దేశం' (ఎంఎఫ్ఎన్) హోదా క్లాజును వచ్చే ఏడాది జనవరి 1 నుంచి రద్దు చేస్తున్నట్టు స్విట్జర్లాండ్ ప్రభుత్వం ప్రకటించింది. భారత్.. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) గ్రూప్‌లో చేరక ముందే ఏదైనా దేశంతో డీటీఏఏ ఒప్పందం కుదుర్చుకున్నంత మాత్రాన ఆ దేశానికి ఆటోమేటిగ్గా ఎంఎఫ్ఎన్ హోదా వచ్చినట్టు కాదని గత ఏడాది సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దీంతో స్విట్జర్లాండ్ ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఈ నిర్ణయంతో రెండు దేశాల కంపెనీలపై పన్నుల భారం పెరగడమేగాక, భారత్‌లో స్విట్జర్లాండ్ పెట్టుబడులపైనా ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

అశోక్ లేలాండ్ వాహన ధరలు పెంపు

చెన్నై: హిందూజా గ్రూప్ కంపెనీ అశోక్ లేలాండ్ వాహనాల ధరలు జనవరి 1 నుంచి 3 శాతం పెరగనున్నాయి. అధిక కమోడిటీ ధరలు, ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తగ్గించుకునేందుకు వాహనాల ధరలు పెంచక తప్పడంలేదని కంపెనీ వెల్లడించింది. కాగా, నవంబరు నెలలో ఆటోమొబైల్ అమ్మకాల్లో 4 శాతం వృద్ధి నమోదైంది. ఈ కంపెనీలు గత నవంబరులో మార్కెట్లోకి పంపిన వాహనాలు 3,33,833 కాగా ఈ నవంబరులో 3,47,522 వాహనాలు పంపినట్లు భారత ఆటోమొబైల్ పరిశ్రమ సమాఖ్య సియామ్ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,870 ▼	72,300 ▼	1.01.000 ▼
విజయవాడ	79,500 ▼	73,300 ▼	92,500 ▼
విశాఖపట్నం	77,330 ▼	70,890 ▼	90,900 ▼
రాజమండ్రి	78,870 ▼	72,300 ▼	92,900 ▼
ప్రొద్దుటూరు	79,200 ▼	73,340 ▼	93,000 ▼
ముంబై	76,922 ▼	70,461 ▼	89,976 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ



హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	633	విశాఖపట్నం	620

డజను గుడ్లు రూ. 84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	91	విజయవాడ	99
వరంగల్	91	గుంటూరు	99
కరీంనగర్	91	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	87
కర్నూలు	91	నెల్లూరు	87
విశాఖపట్నం	103	అనంతపురం	87
గోదావరి	99		





గాంధీ ఆస్పత్రి వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న అల్లు అర్జున్

జైల్లో పుష్ప

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. దీంతో రాత్రంతా ఆయన జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా, అల్లు అర్జున్ అరెస్టు దగ్గర్నుంచి రాత్రి విడుదల వాయిదా పడేదాకా రోజంతా హైడ్రామా నడిచింది. ఆయన అరెస్టు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పలువురు సినీ ప్రముఖులు అల్లు అర్జున్‌కు సంఘీభావం ప్రకటించగా.. అరెస్టును ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీతోపాటు ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ తప్పుబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.

తెల్లవారితే పుష్ప-2 సినిమా విడుదలవుతుందనగా.. ఈ నెల 4వ తేదీ రాత్రి హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో ప్రీమియర్ షో వేయడం, ఆ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి(35) మృతి చెందడం, ఆమె కుమారుడు శ్రీతేజ్ (13) అపస్మారక స్థితికి చేరుకొని చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వీరితోపాటు తొక్కిసలాటలో మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యంతోపాటు.. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రీమియర్ షో వీక్షించడానికి హీరో అల్లు అర్జున్ రావడం కూడా కారణమని పోలీసులు భావించారు. ఈ మేరకు ఆయనపై 105 (హత్య కిందకు రాని ప్రాణ నష్టం), 118(1) (ప్రమాదకరంగా వ్యవహరించడం, వేరే వ్యక్తులు గాయపడేందుకు కారణం కావడం) రెడ్‌విత్ 3(5), నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి ఏ11గా చేర్చారు. అల్లు అర్జున్ నేరుగా థియేటర్‌లోకి వెళ్లకుండా, బయట క్రిస్టల్ హోటల్ నుంచి ఓపెన్ టాప్ కారులో అభిమానులకు అభివాదం చేసుకుంటూ రావడంతో ఒక్కసారిగా వందలాది అభిమానులు ఆయనవైపు చొచ్చుకొని రావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో మహిళ మృతి చెంది, ఆయన కొడుకు తీవ్ర గాయాలపాలయ్యారని సెంట్రల్ జోన్ డీసీపీ మీడియా సమావేశంలో వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు.. ఇటీవల థియేటర్ భాగస్వామి ఎం.సందీప్, మేనేజర్ నాగరాజు, బాల్కనీ ఇన్‌చార్జి విజయ్ చందర్‌లను అరెస్టు చేశారు. కేసులో ఏ11గా ఉన్న అల్లు అర్జున్ శుక్రవారం ఇంట్లోనే ఉన్నట్లు తెలుసుకున్న చిక్కడపల్లి పోలీసులు 11:30కు జూబ్లీహిల్స్‌లోని నివాసంలో అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో అల్లు అర్జున్‌తోపాటు ఆయన తండ్రి అల్లు అరవింద్ సైతం పోలీసుల కారులోనే మధ్యాహ్నం 12:30కు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఆయనను పీఎస్‌కు తరలిస్తుండగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పీఎస్ వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గంటపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డు..

అల్లు అర్జున్‌ను పీఎస్‌లోకి తీసుకువెళ్లిన తర్వాత ఎవరినీ లోనికి రాకుండా పోలీసులు గేట్లు మూసివేశారు. డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ ఆధ్వర్యంలోని బృందం సుమారు గంటపాటు ఆయనను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఓవైపు ప్రశ్నిస్తూనే రిమాండ్ రిపోర్ట్‌ను తయారు చేశారు. మధ్యాహ్నం 1:30కు అల్లు అర్జున్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. 'పుష్ప అరెస్టు' అంటూ సోషల్ మీడియాలో వార్తలు వైరల్ కావడంతో అభిమానులు పెద్ద ఎత్తున చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఆయన్ను చూసేందుకు అభిమానులతోపాటు.. స్థానిక ప్రజలు ఎగబడ్డారు. దాంతో ఆ ప్రాంతమంతా అభిమానులతో కిక్కిరిసిపోయింది. అల్లు అర్జున్‌ను విచారిస్తున్న క్రమంలో ఆయన తండ్రి అల్లు అరవింద్, సినీ నిర్మాత దిల్ రాజు, అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డిని మాత్రమే లోపలికి రానిచ్చారు. ఆయన సోదరుడు అల్లు శిరీష్, కోల శ్రీకాంత్ అనే స్నేహితుడు పీఎస్‌కు చేరుకోగా వారిని పోలీసులు లోపలికి అనుమతించలేదు. దీంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. కాగా, మధ్యాహ్నం 2:15 గంటలకు అల్లు అర్జున్‌ను వైద్య పరీక్షల నిమిత్తం పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ రాజు ఆధ్వర్యంలో బీపీ, షుగర్, కొవిడ్ వంటి వైద్య పరీక్షలు పూర్తయిన అనంతరం భారీ బందోబస్తు నడుమ 3:10 గంటలకు నాంపల్లి కోర్టుకు తీసుకొచ్చి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. సుమారు 45 నిమిషాలపాటు ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం సాయంత్రం 4:00 గంటలకు అల్లు అర్జున్‌కు 14 రోజులు రిమాండ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. అల్లు అర్జున్‌ను నాంపల్లి న్యాయస్థానంలో హాజరుపరిచిన క్రమంలో హైదరాబాద్ అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్ కోర్టులోనే ఉండి పోలీస్ భద్రత, బందోబస్తును





చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద అల్లు అరవింద్, కంచర్ల చంద్రశేఖరరెడ్డి

చంచల్‌గూడ జైలు వద్ద భారీ బందోబస్తు..

హైదరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు అల్లు అర్జున్ అరెస్టును ప్రకటించడంతో చంచల్‌గూడ జైలు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించడంతో ప్రత్యేక పోలీస్ బృందం భారీ బందోస్తు నడుమ అల్లు అర్జున్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించింది. ఈ విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు పెద్ద ఎత్తున జైలు వద్దకు చేరుకున్నారు.

అరెస్టుకు ముందు పోలీసులపై 'పుష్ప' ఫైర్..

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటన కేసుకు సంబంధించి నటుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేసేందుకు వచ్చిన చిక్కడపల్లి పోలీసులపై తొలుత ఆయన ఫైర్ అయినట్లు తెలిసింది. బట్టలు మార్చుకుని వస్తానని చెప్పినా.. పోలీసులు అనుమతించకపోవడంతో ఇది మంచి పద్ధతి కాదని ఆయన అన్నట్లు సమాచారం. "మీరు ఇక్కడికి రావడం, నేను మీతో స్టేషన్‌కు రావడంలో తప్పులేదు. కానీ, బెడ్రూం నుంచి నేరుగా తీసుకెళతాననడం సరికాదని పోలీసులపై ఫైర్ అయినట్లు తెలిసింది. మరోవైపు అల్లు అర్జున్ కంటే ముందే ఆయన తండ్రి అరవింద్ పోలీసు వాహనంలోకి ఎక్కగా.. ఆయన్ను కారులో రావద్దని పోలీసులు వారించారు. అయినా, వినకపోవడంతో అల్లు అర్జున్ కలుగజేసుకొని.. మంచైనా, చెడైనా తనకే వదిలేయండని తండ్రికి చెప్పారు. తండ్రిని కారు నుంచి దించేశారు. ఇక అరెస్టుకు ముందు అర్జున్ కాఫీ తాగుతూ.. తన పక్కనే విచారవదనంతో ఉన్న ఆయన సతీమణిని ఓదార్చారు. కంగారు పడవద్దని భరోసా ఇచ్చారు. ఆపై బుగ్గపై సుతారంగా ముద్దాడారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అరెస్టు- రిమాండ్- బెయిల్
ఉత్కంఠగా సాగిన యాక్షన్ డ్రామా

పుష్ప-2 ప్రీమియర్ షో తొక్కిసలాట కేసులో అల్లు అర్జున్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, అరెస్టు నుంచి బెయిల్ మంజూరు వరకు జరిగిన పరిణామాలు గంట గంటకు ఉత్కంఠభరితంగా సాగాయి. అరెస్టు నుంచి బెయిల్ దాకా శుక్రవారం జరిగిన తీరు ఇది.

- ఉదయం 10:40 : జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్న పోలీసులు
- 11.30 : అల్లు అర్జున్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మధ్యాహ్నం 12:30 : పోలీసు స్టేషన్‌కు తరలింపు
- 12:30- 1:30 : డీసీపీ ఆధ్వర్యంలో అల్లు అర్జున్ స్టేట్‌మెంట్ సేకరణ
- 1:30 : అల్లు అర్జున్‌ను అరెస్టు చేసినట్లు పోలీసుల ప్రకటన
- 2:15 : వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలింపు
- 3:10 : నాంపల్లి కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరు
- సాయంత్రం 4:00 : 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు
- 5:00 : చంచల్‌గూడ జైలుకు తరలింపు
- 5:30 : మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- 6:45 : బెయిల్ పత్రాల రాక కోసం జైలు రిసెప్షన్‌లో ఎదురుచూసిన అల్లు అర్జున్
- దాదాపు రాత్రి 11 గంటల సమయంలో.. సాంకేతిక కారణాలతో విడుదల వాయిదా అంటూ జైలు అధికారుల ప్రకటన

బందోబస్తు కోసం చాలా దరఖాస్తులు వస్తుంటాయి: డీసీపీ

రాజకీయ నాయకులు, సినీ నటులు, ధార్మిక కార్యక్రమాల సందర్భంగా పోలీస్ బందోబస్తు కోసం అనేక లేఖలు వస్తుంటాయని, కార్యక్రమంలో పాల్గొనే వారిని బట్టి తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ తెలిపారు. పెద్ద స్థాయిలో బందోబస్తు కావాలనుకున్న వారు, డీసీపీ, ఏసీపీని కలిసి వివరాలు తెలిపితే దానికి తగిన విధంగా బందోబస్తు ఏర్పాట్లు చేస్తామన్నారు. పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా బందోబస్తు ఏర్పాటు కోసం సంధ్యా థియేటర్ నిర్వాహకులు బందోబస్తు కోసం చిక్కడపల్లి పోలీసులకు పంపిన లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దానిపై డీసీపీ వివరణ ఇచ్చారు. సంధ్య థియేటర్ నిర్వాహకులు అధికారులను కలవకుండా ఇన్‌వార్డ్ విభాగంలో లేఖను అందించారని తెలిపారు. దానికి తగిన విధంగా థియేటర్ బయట తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఆ సినిమా హీరో అల్లు అర్జున్ వచ్చేవరకు జనాలు అదుపులో ఉన్నారని, ఆయన వచ్చి కారు రూఫ్ టాప్ నుంచి బయట ఉన్న అభిమానులకు చేయి ఊపడంతో చాలా మంది థియేటర్ వైపునకు వచ్చారని తెలిపారు. అదే సమయంలో అల్లు అర్జున్ ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది వాహనానికి దారి కల్పించడానికి గుంపుగా చేరిన అభిమానులను పక్కకు నెట్టడం ప్రారంభించారని, దాంతో తొక్కిసలాట జరిగిందని వెల్లడించారు. ఇక అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసేందుకు వెళ్లిన పోలీసులు ఆయనకు దుస్తులు మార్చుకునే అవకాశం ఇవ్వలేదని, ఆయన సతీమణి పట్ల దురుసుగా ప్రవర్తించారన్న ప్రచారంలో నిజం లేదని డీసీపీ అన్నారు. అల్లు అర్జున్‌కు ఆయన భార్య, కుటుంబ సభ్యులతో మాట్లాడుకునేందుకు కూడా తగినంత సమయం ఇచ్చామని తెలిపారు. ఆయనే స్వయంగా వచ్చి పోలీస్ వాహనం ఎక్కారని పేర్కొన్నారు.

14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో అరెస్టు అయిన అల్లు అర్జున్‌ను 14 రోజుల పాటు రిమాండ్‌కు పంపాలని గురువారం నాంపల్లి కోర్టు ఆదేశించింది. తొలుత గాంధీ ఆస్పత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల 20 నిమిషాల సమయంలో నాంపల్లిలోని 9వ అడిషనల్ మెట్రోపాలిటన్ కోర్టులో పోలీసులు ఆయన్ను ప్రవేశపెట్టారు. గంటన్నరకు పైగా ప్రభుత్వ న్యాయవాదికి, అల్లు అర్జున్ తరఫు న్యాయవాది అశోక్‌రెడ్డికి మధ్య వాడివేడిగా వాదనలు జరిగాయి. భారీ సంఖ్యలో అభిమానులున్న అల్లు అర్జున్ ప్రజల్లోకి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోక పోవడం వల్లే తొక్కిసలాట జరిగిందని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. 'అర్జున్ సంధ్య థియేటర్‌కు సినిమా చూడడానికి వచ్చినపుడు పోలీసుల నుంచి అనుమతులు తీసుకోలేదు. ముందస్తు ఏర్పాట్లు కూడా చేసుకోలేదు. పైపెచ్చు ముందస్తు అనుమతి లేకుండా రోడ్‌షో చేయడంతో ఒక్కసారిగా అభిమానులు ఆయనను చూడడానికి నెట్టుకోవడం ప్రారంభించారు. అభిమానులు ఆయనతోపాటే సంధ్య థియేటర్‌లోకి చొచ్చుకువచ్చారు. ఆయనకు భద్రత కల్పించేందుకు బౌన్సర్లు అభిమానులను ఇష్టానుసారం నెట్టేయడంతో తొక్కిసలాట జరిగింది. తన భద్రతకు కోసం బౌన్సర్లను ఏర్పాటు చేసుకున్న అర్జున్, ప్రజల భద్రత గురించి కూడా అదే తరహాలో ఆలోచిస్తే ఈ ప్రమాదం జరిగేది కాదు" అని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న విధంగా సెక్షన్ 105 (నాన్ బెయిలబుల్), సెక్షన్ 118(1), రెడ్ విత్ 3(5), బీఎన్ఎస్ సెక్షన్ల కింద అర్జున్‌కు జ్యుడీషియల్ రిమాండ్ విధించాలని కోరారు.

పోలీసుల వైఫల్యమే!

'పుష్ప2' సినిమా నిర్మాతలు ప్రభుత్వం నుంచి ముందే ప్రీమియర్ షోలకు అనుమతి తీసుకున్నారని, ఈ చిత్రానికున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని అభిమానుల తాకిడిని అంచనా వేసి తగు ఏర్పాట్లు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది అశోక్‌రెడ్డి వాదించారు. పోలీసుల సమక్షంలోనే జరిగిన తొక్కిసలాటకు అల్లు అర్జున్‌ను మాత్రమే బాధ్యుడిని చేయడం సబబు కాదన్నారు. పోలీసుల అజాగ్రత్త కూడా ఇందులో ఉందని, ఫిర్యాదుదారుడు తన భార్య ఊపిరాడక చనిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు కానీ ఎవరినీ బాధ్యులు చేయలేదని ప్రస్తావించారు. ఈ సెక్షన్లు అల్లు అర్జున్‌కు వర్తించవని చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం అల్లు అర్జున్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌ను విధించింది.

అల్లు అర్జున్‌కు బెయిల్!

4 వారాలు ఊరట.. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు.. జైలుకు వెళ్లిన కొద్ది గంటల్లోనే విడుదలకు ఆదేశం

- 'హత్య చేసే ఉద్దేశంతో దాడి' ఇక్కడ లేదు
- క్వాష్ పిటిషన్‌లో మధ్యంతర బెయిలివ్వొచ్చు
- తీర్పు సందర్భంగా జస్టిస్ శ్రీదేవి వ్యాఖ్యలు
- తొక్కిసలాట పోలీసుల వైఫల్యమే..
- అల్లు అర్జున్ తరఫు న్యాయవాది
- క్వాష్ పిటిషన్‌లో బెయిలివ్వడం ఏంటి?
- నటుడైతే లంచ్ మోషన్ ఇస్తారా?
- వ్యతిరేకించిన ప్రభుత్వ న్యాయవాది

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నిందితుడు, సినీ హీరో అల్లు అర్జున్‌కు తెలంగాణ హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ ప్రసాదించింది. ఈ కేసులో శుక్రవారం ఆయన అరెస్టయి జైలుకు వెళ్లిన కొద్ది గంటల్లోనే బెయిలు లభించింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట సంఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. హత్య చేసే ఉద్దేశంతో దాడి చేయడం, ఉద్దేశ పూర్వకంగా పదునైన ఆయుధాలతో దాడి చేయడం వంటి సెక్షన్లు ప్రస్తుత కేసుకు వర్తించవని హైకోర్టు పేర్కొంది. నిర్లక్ష్యం వల్ల మరణం జరిగిందనుకున్నా ఆ నేరానికి పడే గరిష్ఠ శిక్ష ఐదేళ్లే కాబట్టి బెయిల్‌కు పిటిషనర్ అల్లు అర్జున్ అర్హుడని పేర్కొంది. ఏడేళ్లలోపు జైలుశిక్ష పడే కేసుల్లో అరెస్ట్ అవసరం లేదు కాబట్టి.. ఇది బెయిలబుల్ కేసేనని జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం పేర్కొంది. 'మొదట ఈ కేసులో లంచ్ మోషన్ విచారణకు అనుమతి ఇవ్వొద్దని అనుకున్నాను. సామాన్య పౌరులు అయితే లంచ్ మోషన్ ఇద్దామనుకున్నాను. సెలబ్రిటీ అయినందుకు పిటిషనర్ స్వేచ్ఛను కోల్పోవాలా? అనే ప్రశ్న భోజన విరామం సమయంలో నన్ను తొలచివేసింది. సెలబ్రిటీ అయినందుకు పిటిషనర్ స్వేచ్ఛను కోల్పోతుంటే చూస్తూ ఉండటం సమంజసం కాదని అనిపించింది' అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి వ్యాఖ్యానించారు. "అర్నబ్ గోస్వామి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఈ హైకోర్టులో ఇద్దరు జడ్జిలు క్వాష్ పిటిషన్‌లో బెయిల్ మంజూరు చేశారు. ఒకటి 489ఎ వ్యవహారంలో ఒక సామాన్యునికి బెయిల్ లభించింది. బండి సంజయ్ కేసులో దిగువ కోర్టు రిమాండ్ విధించినప్పటికీ ఇదే హైకోర్టులో జడ్జిగా ఉన్న జస్టిస్ ఉజ్జల్ భుయాన్ బెయిల్ మంజూరు చేశారు. క్వాష్ పిటిషన్‌లో సైతం బెయిల్ మంజూరు చేయవచ్చు. పరిమితంగా నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ ఇస్తున్నాం. ఆలోపు పిటిషనర్ తన ఎదుట ఉన్న న్యాయపరమైన అంశాలను వినియోగించుకోవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు సంధ్య థియేటర్ యజమానులకు సైతం మధ్యంతర బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. సంధ్య థియేటర్ యజమానుల్లో అరెస్ట్ కాకుండా ఉన్న మిగతా యజమానులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని స్పష్టంచేసింది. పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా అక్కడ విపరీతమైన రద్దీ ఉంటుందని తెలిసి సాధారంగా ఎవరైనా దూరంగా ఉంటారని ధర్మాసనం పేర్కొంది.



అరెస్టుకు ముందు భార్యతో అల్లు అర్జున్

పోలీసులదే పూర్తి తప్పు: అర్జున్ న్యాయవాది

పుష్ప సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జనాన్ని అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైన పోలీసులు ఆ నెపాన్ని ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని అల్లు అర్జున్ తరఫు సీనియర్ న్యాయవాది, వైసీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. వాస్తవానికి అక్కడ చాలా తక్కువ మంది పోలీసులు బందోబస్తుకు వచ్చారన్నారు. వారు కూడా అల్లు అర్జున్‌ను, సినిమాను చూడటానికి పోటీ పడ్డారని, జనాన్ని అదుపు చేసే విషయాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. పోలీసులు తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారని, పోలీస్ స్టేషన్‌లో అల్లు అర్జున్‌ను చూడవచ్చని వారు భావించారని ఆరోపించారు. అర్నబ్ గోస్వామి కేసులో బాంబే హైకోర్టు బెయిల్ ఇవ్వకపోతే సుప్రీంకోర్టు దానిని సవరించిందని పేర్కొన్నారు. అర్నబ్ గోస్వామి తీర్పు ఆధారంగా ఈ హైకోర్టు ఇప్పటికే రెండు సందర్భాల్లో క్వాష్ పిటిషన్‌లో బెయిల్ మంజూరు చేసిందని గుర్తు చేశారు. షారుఖ్ ఖాన్ ఓ సినిమా ప్రమోషన్ కోసం రైల్లో ప్రయాణించినపుడు ఇలాంటి ఘటనే చోటు చేసుకుందని, దుర్ఘటన జరగాలనే ఉద్దేశం షారుఖ్ ఖాన్‌కు లేదు కాబట్టి ఆయనకు సుప్రీంకోర్టు ఊరట కల్పించిందని గుర్తు చేశారు. మరణం సంభవించడం దురదృష్ట ఘటన అని, మొత్తం ఆసుపత్రి ఖర్చులు పిటిషనర్ భరించడంతో పాటు పరిహారం కూడా ఇప్పటికే ప్రకటించారని తెలిపారు. ఈ దురదృష్టకర ఘటనను ఒకరిపైకి తోసేయడం ఎవరికీ మంచిది కాదన్నారు. ఇతర దేశాల్లో క్రీడలు, ఇతర వేడుకలు జరిగినపుడు పోలీసులు జనాన్ని అదుపు చేయడానికి చూస్తారని, ఇక్కడ పోలీసులు తామే ప్రేక్షకులయ్యేందుకు ఎక్కువ ఆసక్తి చూపారని వ్యాఖ్యానించారు.

అల్లు అర్జున్ వల్లే తొక్కిసలాట: పీపీ పల్లె నాగేశ్వర్‌రావు

అల్లు అర్జున్ క్వాష్ పిటిషన్‌ను అత్యవసర కేసులకు మాత్రమే అవకాశమిచ్చే లంచ్ మోషన్‌లో విచారణకు అనుమతివ్వడాన్ని ప్రభుత్వ న్యాయవాది(పీపీ) పల్లె నాగేశ్వర్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. సినీ నటుడు అయినంత మాత్రాన మధ్యాహ్నం 2.20 గంటలకు లంచ్ మోషన్ ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. జడ్జి సమాధానమిస్తూ సంధ్య థియేటర్ యజమానుల కేసు ఇప్పటికే లిస్ట్‌లో ఉందని, దాంతో పాటు వింటామని చెప్పారు. రిమాండ్ రిపోర్ట్ కాపీ సైతం తమ వద్ద లేదని, వాదనలు వినిపించడానికి మరికొంత సమయం కావాలని పీపీ కోరారు. కావాలంటే వారు హౌస్ మోషన్ వేసుకోవచ్చని, తమకు మాత్రం సోమవారం వరకు సమయం కావాలని చెప్పారు. క్వాష్ పిటిషన్‌లో బెయిల్ ఇవ్వరాదని, రెగ్యులర్ బెయిల్ దాఖలు చేసుకునే అవకాశం అల్లు అర్జున్‌కు ఉందని, మధ్యంతర బెయిల్ కోసం వారు దాఖలు చేసిన అప్లికేషన్‌కు నెంబర్ కూడా కాలేదని, ఇంత హడావుడిగా మధ్యంతర బెయిల్ ఇవ్వడం సరి కాదని వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్ వల్ల ఇప్పటికే ఒక మనిషి చనిపోగా, మృతురాలి కుమారుడు వెంటిలేటర్‌పై ఉన్నారని వ్యాఖ్యానించారు. వాద ప్రతివాదాల అనంతరం అల్లు అర్జున్‌కు నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ ఇస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. క్వాష్ పిటిషన్‌లను రెండు వారాల పాటు వాయిదా వేసింది. ఫిర్యాదుదారుడు అయిన మృతురాలి భర్తకు నోటీసులు జారీ చేసింది.

పాలకుల అభద్రతాభావానికి పరాకాష్ట: కేటీఆర్



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్ అరెస్టును మాజీ మంత్రి కేటీఆర్ ఖండించారు. జాతీయ అవార్డు పొందిన నటుడిని అరెస్టు చేయడం పాలకుల అభద్రతాభావానికి పరాకాష్ట అని విమర్శిస్తూ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మరణించిన మహిళ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. కానీ, ఆ రోజు జరిగిన ఘటనలో నిజంగా తప్పు ఎవరిది? అని కేటీఆర్ ప్రశ్నించారు. నేరుగా బాధ్యుడు కాని అర్జున్‌ను సాధారణ నేరగాడిలా పరిగణించడం సరికాదన్నారు. హైడ్రా భయంతో హైదరాబాద్‌లో ఇద్దరి మరణానికి కారణమైన సీఎం రేవంత్‌ను కూడా ఇలాగే అరెస్ట్ చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

రేవతి మరణానికి పాలకులే కారణం
రేవంత్ సోదరుల అంశంలోనూ చట్టం స్పందించాలి: హరీశ్



అల్లు అర్జున్ అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. సినిమా చూడడానికి వెళ్లి అక్కడ జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. అయితే, రేవతి మరణానికి అసలు కారకులు రాష్ట్ర పాలకులేనని, చర్యలు తీసుకోవాల్సింది ప్రభుత్వంపైనేనని ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. బెనిఫిట్ షోకు అనుమతి ఇచ్చింది ఎవరు ? ముందు జాగ్రత్తలు తీసుకోకుండా సినిమా ప్రదర్శించి ఎవరు? అని హరీశ్ ప్రశ్నించారు. జరిగిన ఘటనతో ప్రత్యక్షంగా సంబంధం లేని అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన పోలీసులు సీఎం సోదరులను ఎందుకు అరెస్టు చెయ్యరని నిలదీశారు. సీఎం సోదరుల వేధింపులు తాళలేక చనిపోతున్నానని లేఖ రాసి కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకుంటే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని అడిగారు.

అరెస్టు బాధ్యతారాహిత్యం : కిషన్‌రెడ్డి



అల్లు అర్జున్ అరెస్టు ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమ వేదిక వద్ద భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులదని, కానీ అలా చేయకుండా ఇప్పుడు వ్యక్తిగతంగా టార్గెట్ చెయ్యడం సరికాదని ఎక్స్‌లో పోస్టు చేశారు. కార్యక్రమ నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులకు ముందుగానే సమాచారం ఇచ్చినప్పటికీ అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం ఉద్దేశపూర్వకమేనని అన్నారు.

అరెస్టు కాంగ్రెస్ డ్రామా : బండి సంజయ్



ఒకప్పుడు రాష్ట్రాన్ని దోచుకున్న వారు స్వేచ్ఛగా ఉండగా, జాతీయ అవార్డు గ్రహీత అల్లు అర్జున్‌ను మాత్రం ప్రభుత్వం అరెస్టు చేసిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్‌కు పాలనాదక్షత శూన్యమని, నాటకాలు, డైవర్షన్ పాలిటిక్స్ అధికమని ఎక్స్‌లో పోస్టు చేశారు. సంచలన ఘటనలు కాంగ్రెస్ అసమర్థతను దాచిపెట్టవని, ఆ పార్టీ డ్రామాలను యావత్ దేశం గమనిస్తోందని అన్నారు. దుస్తులు మార్చుకునే సమయమివ్వకుండా పడకగది నుంచి అర్జున్‌ను పోలీసులు తీసుకెళ్లడం దుర్మార్గమైన చర్య అన్నారు.

తప్పును కప్పిపుచ్చుకునేందుకే అరెస్టు : అశ్వినీ వైష్ణవ్



ప్రభుత్వం, యంత్రాంగం తప్పులను కప్పిపుచ్చుకునేందుకే అర్జున్‌ను అరెస్టు చేశారని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆరోపించారు. సినీ పరిశ్రమ అంటే కాంగ్రెస్ పార్టీకి గౌరవం లేదనే విషయం అల్లు అర్జున్ అరెస్టుతో మరోసారి రుజువైందని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. థియేటర్ వద్ద జరిగిన దుర్ఘటనలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. దానిని కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

వైఫల్యాలను పక్కదారి పట్టించేందుకే : లక్ష్మణ్



సినిమా విడుదల సందర్భంగా జరిగిన ఘటనలో ప్రత్యక్ష ప్రమేయం లేకున్నా అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం అమానుషమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం సినిమా స్క్రిప్టు రచించిందని ఆరోపించారు. జాతీయ అవార్డు పొందిన నటుడిని అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

నాయకులకు ఓ న్యాయం.. నటులకు ఇంకో న్యాయమా ? : కేఏ పాల్



రాజకీయ నాయకులకు ఓ న్యాయం, సినీ నటులు, సామాన్య ప్రజలకు మరో న్యాయమా ? అని ప్రజాశాంతి పార్టీ నేత కేఏ పాల్ ప్రశ్నించారు. చంద్రబాబు కందుకూరు వెళ్లినపుడు జరిగిన తొక్కిసలాటలో 8 మంది చనిపోయారని గుర్తు చేశారు. ఆ ఘటనలో చంద్రబాబుని అరెస్టు చేశారా? అని ప్రశ్నించారు.

అరెస్టు సమ్మతం కాదు: జగన్



అల్లు అర్జున్ అరెస్టును వైసీపీ అధ్యక్షుడు జగన్ ఎక్స్ వేదికగా ఖండించారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయిన ఘటనలో అల్లు అర్జున్‌పై నేరుగా కేసులు బనాయించి మరీ అరెస్టు చేయడం ఏమాత్రం సమ్మతం కాదని ఆయన ట్వీట్ చేశారు. తొక్కిసలాటలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమేనని పేర్కొన్న జగన్.. ఆ సమయంలో అల్లు అర్జున్ బాధ్యతాయుతంగా వ్యవహరించారని, బాధిత కుటుంబానికి అండగా ఉంటానని అన్నారని చెప్పారు.

అల్లు అర్జున్ తప్పు లేదు.. కేసు విత్‌డ్రా చేసుకుంటా

- 'సంధ్య' ఘటనలో మృతురాలి భర్త ప్రకటన

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో అల్లు అర్జున్ తప్పేమీ లేదని పుష్ప -2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో భార్యను కోల్పోయిన భాస్కర్ స్పష్టం చేశారు. అల్లు అర్జున్ అరెస్టు నేపథ్యంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు శ్రీతేజ పుష్ప-2 సినిమా చూడాలని పట్టుబట్టడంతో కుటుంబంతో కలిసి సినిమాకు వెళ్లానని తెలిపారు. ఆ తర్వాత జరిగిన ఘటనలో అల్లుఅర్జున్ తప్పేమీ లేదని, కేసు ఉపసంహరించుకోవడానికి తాను సిద్ధమని వెల్లడించారు. అల్లు అర్జున్ అరెస్టుపై పోలీసులు తనకేమీ సమాచారం ఇవ్వలేదని, సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్నానని తెలిపారు. కాగా, సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడిన బాలుడు శ్రీతేజకు చికిత్స కొనసాగుతోంది. శ్రీతేజకు తొమ్మిది రోజులుగా వెంటిలేటర్‌పైనే చికిత్స అందిస్తున్నామని కిమ్స్ వైద్యులు తెలిపారు. శ్రీతేజ ఆరోగ్యం కొంతమేర మెరుగుపడిందని, రక్త ప్రసరణ కూడా సాధారణ స్థితికి చేరుకుందన్నారు. ఆక్సిజన్ మోతాదు తగ్గించి ఇస్తున్నట్లు తెలిపారు. అయితే, శ్రీతేజ శరీరంలో ఎడమ వైపు స్పర్శ ఉందని, కుడివైపు భాగంలో స్పర్శ లేదని తెలిపారు. చికిత్స అందిస్తున్న సమయంలో అప్పుడప్పుడు జ్వరం వస్తోందని, కానీ శ్రీతేజ ఆరోగ్య పరిస్థితి క్షీణించలేదని వైద్యులు వెల్లడించారు.

మహిళ మృతికి అల్లు అర్జున్ కారణమే!

▸ రిమాండ్ రిపోర్టులో వివరాల నమోదు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట, మహిళ మృతి ఘటనలో సినీ హీరో అల్లు అర్జున్, అతడి సెక్యూరిటీ సిబ్బంది, థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణమని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అల్లు అర్జున్ రాక సందర్భంగా తొక్కిసలాట జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో థియేటర్ యాజమాన్యం విఫలమైందని తెలిపారు. సినీ హీరో వచ్చి వెళ్లేందుకు ప్రత్యేక దారి కేటాయించలేదని, అల్లు అర్జున్ ప్రైవేటు సెక్యూరిటీ ప్రేక్షకులను నెట్టి వేయడంతోనే తొక్కిసలాట జరిగి మహిళ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను రిపోర్టులో నమోదు చేశారు. పుష్ప 2 విడుదల సందర్భంగా ఈ నెల 4వ తేదీన సంధ్య థియేటర్‌లో ప్రీమియర్ షో వేశారు. థియేటర్‌లో 1323 సీటింగ్ కెపాసిటీ ఉంది. థియేటర్ యాజమాన్యం టికెట్లను రూ.1100, రూ.1000 చొప్పున విక్రయించారు. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన భాస్కర్, రేవతి దంపతులు కుమారుడు శ్రీతేజ్, కుమార్తెతో కలిసి రాత్రి 9.10 గంటలకు థియేటర్‌కు వచ్చారు. రాత్రి 9.40 గంటలకు అల్లు అర్జున్, అతడి కుటుంబం ప్రైవేటు సెక్యూరిటీతో థియేటర్‌కు వచ్చారు. అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. అల్లు అర్జున్ ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందితోపాటు థియేటర్ సిబ్బంది ప్రేక్షకులను తోసివేశారు. దీంతో జరిగిన తోపులాటలో అందరూ లోవర్ బాల్కనీ వైపుకు వెళ్లారు. ఈ సమయంలో రేవతి, ఆమె కుమారుడు శ్రీతేజ్ తొక్కిసలాటలో గాయపడ్డారు. తన భార్య పిల్లలు లోవర్ బాల్కనీలోని జనంలో ఉంటారని భావించిన భాస్కర్ వారి కోసం వేచి చూశారు. అయితే, వారు కనిపించక పోవటంతో కుమార్తెను తీసుకొని ఆటోలో రామ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ కుమార్తెను వదిలి బంధువుతో కలిసి థియేటర్ వద్దకు వచ్చారు. అక్కడ తన భార్య రేవతి, కుమారుడు శ్రీతేజ్ కనిపించక పోవడంతో పోలీసులను సంప్రదించారు. కాగా, థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో రేవతి, శ్రీతేజ్ గాయపడటంతో వారిని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆస్పత్రికి తరలించారు. అయితే, ఈలోపే రేవతి చనిపోయారు. మెరుగైన చికిత్స కోసం శ్రీతేజ్‌ను మరో ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు.

'ఓటుకు నోటు'.. ఈడీ కేసు కొట్టేయడానికి నిరాకరణ

▸ వేం నరేందర్‌రెడ్డి కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కుమారుడు వేం కృష్ణకీర్తన్‌కు హైకోర్టులో ఊరట లభించలేదు. ఓటుకు నోటు వ్యవహారంలో ఈడీ కేసు కొట్టేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. ఓటుకు నోటు వ్యవహారంలో తనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసును కొట్టేయడంతోపాటు ఈడీ ప్రత్యేక కోర్టు 2021లో జారీచేసిన సమన్లను నిలిపివేయాలంటూ కృష్ణకీర్తన్ హైకోర్టులో 2022లో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కేవలం కుట్ర ఆరోపణల ఆధారంగా ఈడీ కేసు పెట్టడం సరికాదన్నారు. ఇలాంటి అంశంపై 'పవన్ దిబ్బూర్ వర్సెస్ ఈడీ' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. ఏసీబీ కేసులో పిటిషనర్ నిందితుడు కాదనే విషయాన్ని పట్టించుకోకుండా ఈడీ కేసులో నిందితుడిగా చేర్చడం అక్రమమన్నారు. ఈడీ తరఫు న్యాయవాది వాదిస్తూ.. పిటిషనర్ నేరుగా ప్రధాన నిందితుడైన ఎ.రేవంత్‌రెడ్డి (ప్రస్తుత సీఎం)కి, ఏ-3గా ఉన్న ఉదయ్ సింహకు సహాయం చేశారని తెలిపారు. రూ.50 లక్షల నగదును పిటిషనర్ (వేం కృష్ణకీర్తన్) సమకూర్చినట్లు ఉదయ్ సింహ తెలిపారన్నారు. ప్రధాన కేసు పరిణామక్రమంలో మనీలాండరింగ్ జరిగిందని.. అందుకే పిటిషనర్‌ను నిందితుడిగా చేర్చామని చెప్పారు. కుట్రలో పిటిషనర్ భాగస్వామి అని.. సదరు డబ్బు లంచంగా ఇస్తున్నట్లు ఆయనకు తెలుసని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పు ఇచ్చింది.

యూటీ నంబర్ 7697

రాత్రంతా చంచల్‌గూడ జైల్లోనే అల్లు అర్జున్.. పదిన్నర గంటల తర్వాత వచ్చిన బెయిల్ ఆర్డర్

▸ అప్పటికే బ్యారక్‌కు ఐకన్ స్టార్

▸ జైల్లో భోజనం చేయని అల్లు అర్జున్

▸ రాత్రంతా నేలమీదే గడపాల్సిన పరిస్థితి

▸ తెల్లవారగానే విడుదల చేస్తారని అంచనా



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్‌ను నాంపల్లి 9వ చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ ఆదేశం మేరకు 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంచేందుకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈలోగా హైకోర్టు ఆయనకు నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. కాపీ అందిన వెంటనే విడుదల చేయాలని కూడా ఆదేశించారు. దాంతో అల్లు అర్జున్ విడుదల ఖాయమని అంతా భావించారు. జైలుకు వెళ్లిన అల్లు అర్జున్ బెయిల్ పత్రాల కోసం రిసెప్షన్‌లో వేచి ఉన్నారు. అయితే, రాత్రి పదిన్నర గంటల వరకు హైకోర్టు బెయిల్ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాకపోవడం, ఇతర కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం జరగడంతో శుక్రవారం రాత్రంతా అల్లు అర్జున్ జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో జైలు అధికారులు ఆయన్ను అండర్ ట్రైల్ ఖైదీగా(ఖైదీ నంబర్ 7697) మంజీరా బ్యారక్‌లో ఉంచారు.

ఎందుకు విడుదల చేయలేదు?

సాధారణంగా సూర్యాస్తమయానికి ఖైదీలను బ్యారక్‌లలోకి పంపుతారు. అప్పటివరకు వచ్చే బెయిలు ఆర్డర్లకు సంబంధించిన ఖైదీలను లోపలికి పంపరు. వారందరి బెయిలు పత్రాలను పరిశీలించి, జైలు రికార్డుల్లో ఎంట్రీ చేసి, అందర్నీ ఒకేసారి విడుదల చేస్తారు. సూర్యాస్తమయం తర్వాత వచ్చే బెయిలు ఆర్డర్లకు సంబంధించి ఖైదీలను అప్పటికే బ్యారక్‌లకు పంపడం వల్ల వారిని విడుదల చేయరు. కానీ, వారికి సంబంధించిన బెయిలు పత్రాలను పరిశీలించి, జైలు రికార్డుల్లో ఎంట్రీ చేస్తారు. సూర్యోదయం కాగానే వారిని విడుదల చేస్తారు. అల్లు అర్జున్‌ను నాంపల్లి కోర్టు నుంచి 5.20కు చంచల్‌గూడ జైలుకు తీసుకువచ్చారు. ఆరు గంటల్లోపే ఆయనకు బెయిలు సమాచారం అందింది. దాంతో ఆయన ఏ క్షణమైనా విడుదల అవుతానన్న భరోసాతో ఉన్నారు. చాయ్, బిస్కట్లు కూడా తీసుకున్నట్లు సమాచారం. ఆరు గంటల వరకు బెయిలు కాపీలు రాకపోవడంతో మరి కాసేపు వేచిచూసి ఆయన్ను నిబంధనల ప్రకారం బ్యారక్‌లోకి పంపారు. అప్పుడే ఆయన రాత్రంతా జైల్లో ఉండటం ఖాయమైంది. దాంతో ఆయన మొహంలో అసహనం పెరిగిపోయింది. ఖైదీలందర్నీ బ్యారక్‌లలోకి పంపినట్లుగా ధ్రువీకరించుకున్నాకే చివరగా అల్లు అర్జున్‌ను బ్యారక్‌కు తరలించారు. తనను ముగ్గురు ఖైదీలు ఉండే బ్యారక్‌లో ఉంచారు. అందులో ఆయనతో మరో ఇద్దరు విచారణలో ఉన్న ఖైదీలు ఉన్నారు. రిసెప్షన్ నుంచి అల్లు అర్జున్‌ను బ్యారక్‌కు తరలిస్తున్నపుడు ఇతర బ్యారక్‌లలో ఉన్న ఖైదీలు పుష్ప.. పుష్ప.. అంటూ అరుస్తూ ఉన్నారు. జైల్లో అర్జున్‌కు భోజనం ఆఫర్ చేసినా తినలేదు. 14 రోజుల రిమాండ్ విధించినపుడు న్యాయాధికారి ఆయనను ప్రత్యేక ఖైదీగా పరిగణించాలని ఆదేశించారు. అయితే, ఆ సౌకర్యాలు జైల్లోకి వచ్చిన మర్నాడు మాత్రమే అందుతాయి. తొలిరోజు రాత్రి అర్జున్ సాధారణ ఖైదీల లాగే నేల మీద పడుకోవాలి. ఆయనకు కొత్త రగ్గు, కొత్త దుప్పటి ఇచ్చారు. వాటిని నేల మీద పరుచుకొని పడుకోవాల్సి ఉంటుంది. పదిన్నర తర్వాత తక్షణమే విడుదల చేయాలని బెయిలు ఉత్తర్వులు అందినప్పటికీ అధికారులు నిబంధనల ప్రకారం ఉదయమే విడుదల చేయాలని నిర్ణయించారు. బెయిలు కార్యక్రమం రాత్రే ముగిసిపోయినందున శనివారం తెల్లవారగానే ఏడుగంటల్లోపే అల్లు అర్జున్‌ను విడుదల చేస్తారు. సెలవు రోజైనా విడుదలకు ఎలాంటి ఆటంకం ఉండదు.

ఒక్కసారైనా ఫొటో దిగాలనుకున్నాడు..

ఏకంగా అరెస్టు చేశాడు!

ఖైరతాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తన అభిమాన నటుడిని ఒక్కసారైనా కలిసి, ఆయనతో ఫొటో దిగాలనుకున్న ఆ పోలీసు ఇన్‌స్పెక్టర్‌కు తీరా ఆయన్నే అరెస్టు చేయాల్సి వచ్చింది. ఆ నటుడు అల్లు అర్జున్ అయితే, ఆ సీఐ రాజు నాయక్. అల్లు అర్జున్ అంటే రాజు నాయక్‌కు ఎంతో అభిమానమట! ఆయనతో ఫొటో దిగాలనే బలమైన కోరిక మనసులో ఉందట. అయితే ఈ కోరిక అయన్ను అరెస్టు చేస్తూ నెరవేర్చుకోవడం ఇబ్బందికరంగా ఆయన భావించినట్లు సమాచారం.



అల్లు అర్జున్‌కు అండగా చిరంజీవి !

అరెస్టు సంగతి తెలియగానే షూటింగ్ రద్దు

సతీసమేతంగా అర్జున్ ఇంటికి రాక

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారనే వార్త తెలుసుకున్న ప్రముఖ సినీ నటుడు చిరంజీవి.. వెంటనే అల్లు కుటుంబానికి అండగా వెళ్లారు. తన తదుపరి సినిమా చిత్రీకరణ పనుల్లో ఉన్న చిరంజీవి.. అరెస్టు వార్త తెలియడంతో షూటింగ్ రద్దు చేసుకుని భార్య సురేఖతో కలిసి అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్నారు. ఆ తర్వాత కాసేపటికి చిరంజీవి సోదరుడు నాగబాబు కూడా అక్కడికి చేరుకున్నారు. చిరంజీవి దంపతులు అల్లు అర్జున్ నివాసంలో చాలాసేపు ఉన్నారు. నాగబాబు మాత్రం కొంత సమయం ఉండి వెళ్లిపోయారు.

హాట్‌వాటర్ బ్యాగ్.. 2ఏళ్ల బాబు ప్రాణం తీసింది!

▸ నొప్పి తగ్గడానికి నడుమ్మీద బ్యాగ్ పెట్టుకున్న తండ్రి

▸ నాన్నా అంటూ పరుగెత్తుకుంటూ వచ్చి మీద పడిన చిన్నారి

▸ వేడినీళ్లు పడటంతో తీవ్ర గాయాలు.. చికిత్స పొందుతూ మృతి

అల్వాల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలున్న తల్లిదండ్రులు.. ఇంట్లోని వాటర్ హీటర్లు, ఐరన్ బాక్సులు, సెల్‌ఫోన్ చార్జర్లు, హాట్ వాటర్ బ్యాగ్ తదితర వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండకపోతే కొన్నిసార్లు అదెంత విషాదాన్ని మిగుల్చుందనేందుకు ఈ ఘోరమే ఉదాహరణ! హాట్ వాటర్ బ్యాగ్ పగిలి.. ఆ వేడినీరు పడటంతో రెండేళ్ల చిన్నారి తీవ్రగాయాలతో ప్రాణాలు విడిచాడు. అల్వాల్ పరిధిలో ఈ హృదయ విదారకమైన ఘటన జరిగింది. ఎస్సై సురేశ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం గోపాల్‌నగర్ ప్రాంతానికి చెందిన ఆనంద్ ప్రైవేటు ఉద్యోగి, ఆయనకు రెండేళ్ల బాబు దేవాన్ష్ (2) ఉన్నాడు. ఆనంద్ కొన్నాళ్లుగా బ్యాక్ పెయిన్‌తో బాధపడుతుండటంతో ఉపశమనం కోసం వైద్యులు హాట్ వాటర్ బ్యాగ్ థెరపీని సూచించారు. ఈనెల 8న రాత్రి హాట్‌వాటర్ బ్యాగ్‌ను నింపి, దాన్ని నడుమ్మీద పెట్టుకొని బోర్లా పడుకున్నాడు ఆనంద్. ఆ సమయంలో చిన్నారి దేవాన్ష్.. నాన్నా అంటూ పరుగెత్తుకుంటూ వచ్చి ఆనంద్‌పై దూకాడు. నేరుగా హాట్‌వాటర్ బ్యాగ్‌పై బాబు పడటంతో అది పగిలింది లోపలున్న. వేడినీళ్లు పడటంతో దేవాన్ష్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చిన్నారిని చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు.

పాప కోసం ఊయల కడితే తల్లి ప్రాణం పోయింది

▸ చిన్నారి ఏడ్పు మాన్పించేందుకు చీరతో ఊయల కట్టిన తల్లి

▸ కొద్దిసేపటికి తాను ఊగుతుండగా మెడకు బిగుసుకున్న చీర

▸ ఊపిరాడక మృతి.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో విషాదం

బెల్లంపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏడుస్తున్న కూతురును ఆడించేందుకు చీరతో తల్లి ఊయల కట్టగా.. ఆ చీరే ఆమె ప్రాణం తీసింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఈ విషాదం జరిగింది. పట్టణంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన పోచంపల్లి విజయ్-నీరజ (42) దంపతులకు ముగ్గురు పిల్లల్లో 19నెలల సుచిత్ర చివరి సంతానం. గురువారం సాయంత్రం సుచిత్ర ఏడుస్తుండటంతో ఇంటి వరండాలో దూలానికి చీరతో ఊయల కట్టింది తల్లి నీరజ. పాపను ఆడించాక, కొద్దిసేపటికి చిన్నారిని దింపి.. ఆ ఊయలలో నీరజ ఊగింది. ఊయల ఊగుతున్న క్రమంలో చీర, నీరజ మెడకు చుట్టుకోవడంతో ఊపిరాడక మృతిచెందింది. కొద్దిసేపటికి నీరజ అత్త వచ్చి చూడగా అప్పటికే ఆమె కిందపడిపోయి ఉంది. స్థానికుల సాయంతో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.